thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 175 కరీంనగర్ మంగళవారం, 2 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.

## కేసీఆర్, హరీష్ రావు మధ్యంతర పిటిషన్లపై కొన్ని ఘడియల్లో విచారణ



హైదరాబాద్, సెప్టెంబర్ 01: కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావులు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లపై మంగళవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరగనుంది. అందుకోసం చీఫ్ జస్టిస్ బెంచ్‌లో వీరిద్దరి పిటిషన్లు లిస్టు అయినాయి. ఈ నేపథ్యంలో ఈ కేసు సీబీఐకి అప్పగించాలంటూ ప్రభుత్వ నిర్ణయంపై మంగవారం కోర్టులో వాదనలు జరగనున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. లక్షల కోట్లు ప్రజా ధనాన్ని వినియోగించి.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించింది. అయితే అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు ఏర్పాడ్డాయి. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ స్పష్టమైన హామీ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ కొలువు తీరింది. అనంతరం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ దాదాపు 13 నెలల పాటు వందలాది మందిని విచారించింది. ఆ జాబితాలో కేసీఆర్, హరీష్ రావు, ఈటల రాజేందర్, పలువురు ఐఏఎస్, నీటిపారుదల, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను సైతం ఉన్నారు. ఈ కమిషన్ తన నివేదికను ఇటీవల ప్రభుత్వానికి అందజేసింది. లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నిర్మించిన ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కర్త, కర్మ, క్రియా అంతా బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ అని స్పష్టం చేసింది. అలాగే ఆర్థిక మంత్రులుగా పని చేసిన హరీష్ రావు, ఈటల రాజేందర్ సైతం బాధ్యులని పేర్కొంది. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో తమను అరెస్ట్ చేయవద్దంటూ కేసీఆర్, హరీష్ రావులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు.

## హరీష్ రావును టార్గెట్ చేసింది అందుకేనా..?




హైదరాబాద్, సెప్టెంబర్ 01: మాజీ సీఎం కేసీఆర్‌పై కొందరు అగ్రనేతలు కుట్రలు చేస్తున్నారని.. వారి వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తేలిపోయిందని స్పష్టం చేశారు. కాళేశ్వరంలో తప్పు చేసింది కేసీఆరా? లేదా హరీశ్ రావా? అనేది తమకు అనవసరమన్నారు. వారి ప్రభుత్వ హయాంలోనే ఈ స్కాం జరిగిందనేది స్పష్టమైందని తెలిపారు. కవిత సైతం ఇప్పుడు అదే చెప్పారంటూ పీసీసీ చీఫ్ కుండ బద్దలు కొట్టారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో మామ కేసీఆర్ వాటా ఎంత..? అల్లుడు హరీశ్ రావు వాటా ఎంత..? అనేది తేలాల్సి ఉందన్నారు. కేసీఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట ఫైనల్‌కి చేరిందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. అయినా.. కుటుంబ కలహాలను తమపై రుద్దడం ఏంటంటూ కవితపై ఈ సందర్భంగా ఆయన మండిపడ్డారు. ఏమీ తప్పు చేయలేదంటున్న బీఆర్ఎస్ నేతలు.. సీబీఐ అనగానే ఎందుకు జంకుతున్నారంటూ వారిని సూటిగా ప్రశ్నించారు. వారు తప్పు చేయక పోతే విచారణ ఎదుర్కోవాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. మొదటి దఫా ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా హరీశ్ రావు తప్పు చేస్తే.. ఆయనపై అప్పటి సీఎం కేసీఆర్ బాధ్యతగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆ సమయంలోనే కల్వకుంట్ల కవిత సైతం ఎందుకు మాట్లాడ లేదు..? అంటూ టీపీసీసీ చీఫ్ సందేహం వ్యక్తం చేశారు. మొదట కేటీఆర్, అనంతరం కవిత అమెరికా పర్యటనకు వెళ్లి ఒక అవగాహన కదుర్చుకొని.. అంతర్గత కలహాలతో హరీష్‌రావును టార్గెట్ చేశారని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. కేసిఆర్ కుటుంబ కలహాలతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. బిఆర్ఎస్ పార్టీ అవినీతిని బయటపెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని గతంలో చెప్పిన కవిత.. ఆ దెయ్యాలు హరీశ్ రావు, సంతోష్ రావేనా..? ఇంకా ఎవరెవరు ఉన్నారో స్పష్టం చేయాలంటూ ఆమెను డిమాండ్ చేశారు. కవిత మాటలు నిజమా..? ఆదివారం అసెంబ్లీ మాట్లాడిన హరీశ్ రావు మాటలు నిజమా..? అనేది వారు స్పష్టం చేయాలంటూ పీసీసీ చీఫ్ మహేష్ డిమాండ్ చేశారు.

# అప్రమత్తంగా ఉండండి

# పరిస్థితులను సమీక్షించండి

## అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 01: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాలు, వరదల నష్టంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. వర్షాల కారణంగా 1,052 చోట్ల 1,023 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని వారిని ఆదేశించారు. అలాగే గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు రాక పోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ అంశాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. ఇక భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక సైతం అందజేయాలని సూచించారు. గత ఏడాది ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్.. వరదల సమయంలో బాగా పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్బంగా ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. హెచ్ఎండీఏ పరిదిలో చెరువులను వెంటనే నోటిఫై జరగాలని ఆదేశించారు. అయితే వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని అధికారులకు సూచించారు. అలాగే చనిపోయిన జంతువులకు సైతం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టం చేశారు. కింద స్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండి.. పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి అందజేయాల్సి ఉందని అధికారులకు తెలిపారు.

# సరిహద్దుల్లో శాంతి నెలకొనాలి

# అలా కాదని దుడుకుగా ప్రవర్తిస్తే...!

## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై ప్రధాని మోదీ ఘాటైన వ్యాఖ్యలు



సరిహద్దు ఉగ్రవాదం భారత్, చైనా దేశాలపై ప్రభావం చూపుతోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదం అనేది మానవత్వానికి, శాంతికి ముప్పుగా పరిణమించిందని తియాన్‌జిన్ వేదికగా సోమవారం జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు "ఉగ్రవాద సమస్యలతో భారత్ 4 దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోంది. ఉగ్రవాదం, వేర్పాటువాదం సవాళ్లుగా మారాయి. ఎస్‌సీవో సభ్య దేశంగా భారత్ కీలక భూమిక పోషిస్తోంది. ఎస్‌సీవో కోసం భారత్ విజన్, పాలసీ 3 పిల్లర్లపై ఆధారపడి ఉంది. భద్రత, అనుసంధానం, అవకాశాలు 3 పిల్లర్లుగా నిలుస్తాయి. మనమంతా ఏకతాటిపైకి వచ్చి సంస్కరణలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది" అని షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు 2025లో మోదీ ప్రసంగించారు. సరిహద్దు ఉగ్రవాదం భారత్‌తో పాటు చైనాపైనా ప్రభావం చూపుతోంది. ఇరు దేశాలకూ ఇదొక సవాల్‌గా మారిందని మోదీ స్పష్టం చేశారు. ఈ సమస్యను ఎదుర్కొనడానికి పరస్పర సహకారం అవసరమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత కొనసాగితేనే ద్వైపాక్షిక సంబంధాలు మెరుగవుతాయని మోదీ అభిప్రాయపడ్డారు.

**పాక్ ప్రధానిపై విసుర్లు..** SCO సదస్సు వేదికలో పాకిస్తాన్‌పై భారత ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా ఘాటు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ దేశం ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న దేశంగా బహిరంగంగా విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు బలైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇది ఉగ్రవాదం యొక్క అత్యంత వికృత రూపం. అయినా ఉగ్రవాదంపై రాజీ ఉండబోదు అని స్పష్టం చేశారు. "ఆ సమయంలో కొన్ని దేశాలు భారత్‌కు మద్దతుగా నిలిచాయి. ఆ దేశాలకు మా కృతజ్ఞతలు. అలాగే.. కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బహిరంగంగా మద్దతు ఇస్తున్నాయి. అలాంటి ద్వంద్వ ప్రమాణాలను మేం అంగీకరించబోం" అని వ్యాఖ్యానించారాయన. భద్రత ప్రతి దేశ హక్కు. ఉగ్రవాదం మనమందరికీ సవాల్. ఇది కేవలం భారత్‌కు మాత్రమే కాదు, ప్రపంచానికి కూడా ముప్పు. SCO సభ్యదేశాలు ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించాలి. అంతర్జాతీయంగా ఏకతా అవసరమని మోదీ పిలుపునిచ్చారు. ఆ సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా పాక్‌కు అపమానకరమేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అంతకు ముందు.. సదస్సుకు హాజరైన వివిధ దేశాధినేతలను ఆప్యాయంగా పలకరించిన మోదీ.. పాక్ ప్రధాని వైపు కనీసం కన్నెత్తి చూడలేదు.

**పాక్ పేరు లేకుండానే..** సదస్సు ముగింపు ప్రకటనలో చైనా సహా యూరేషియన్(యూరప్‌ంఆసియా సమాహారం) దేశాలు భారత్ వైపు నిలిచాయి. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ.. ఎస్‌సీవో సదస్సులో తీర్మానం చేశాయి. అయితే.. అందులో ఎక్కడా పాకిస్థాన్ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. చైనా, టర్కీ సహా పలు దేశాలు పహల్గాం బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశాయి. దాడికి పాల్పడినవారిని శిక్షించాలని వేదిక నుంచి గళం వినిపించాయి. ఉగ్రవాదం, విభజనవాదం, తీవ్రవాదంపై సంయుక్తంగా పోరాడాలని సభ్యదేశాలు ప్రతిజ్ఞ చేశాయి. అదే సమయంలో.. పాక్‌లో జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్, ఖుజ్దార్ దాడులను కూడా ఖండించాయి.

మరోవైపు.. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్, చైనా అధినేతలు చర్చించుకున్నారు. ఈ విషయంలో భారత్ చైనా మద్దతు కోరగా.. చైనా అందుకు అంగీకరించిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు.



## తెలంగాణలో వైద్య విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి

దిల్లీ: తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవాల్సిందేనన్న నిబంధనను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.

## తెలుగువాడికి అవకాశం వచ్చింది.. మద్దతివ్వండి: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని చెప్పారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో కలిసి సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్డీయే అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు.

కానీ.. తెలుగువాడికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మాజీ సీఎంలు కేసీఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అక్బరుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి"అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## కాళేశ్వరం అవినీతికి భారాస బాధ్యత వహించాల్సిందే

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై భాజపా వైఖరే నిజమని మరోసారి రుజువైందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం అవినీతికి భారత రాష్ట్ర సమితి పూర్తి బాధ్యత వహించాల్సిందేనని డిమాండ్ చేశారు. "దీనిపై మొదట్నుంచీ సీబీఐ విచారణ కోరుతున్నాం. కాంగ్రెస్ మాత్రం భారత రాష్ట్ర సమితిని కాపాడుతూ చర్యలు ఆలస్యం చేసింది. నేడు నిజానికి తలవంచి సీబీఐకి అప్పగించేందుకు అంగీకరించారు. వెంటనే సీబీఐకి లేఖ పంపాలని డిమాండ్ చేస్తున్నాం. గతంలోనూ ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై కాంగ్రెస్ సిట్‌ను ప్రకటించింది. అయినా నేటికీ ఆచరణ రూపం దాల్చలేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం డైలీ సీరియల్‌గా కొనసాగుతోంది" అని బండి సంజయ్ అన్నారు.

## గిన్నిస్ బుక్ రికార్డ్స్ లక్ష్యంగా బతుకమ్మ వేడుకలు: మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్: బతుకమ్మ పండుగను గొప్ప కార్నివాల్‌గా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈనెల 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి.

గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 29న ఎల్బీస్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తాం. పీపుల్స్ ప్లాజాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి. బతుకమ్మకు జాతీయస్థాయి ప్రచారం కోసం కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం"అని మంత్రి జూపల్లి తెలిపారు. బతుకమ్మ వేడుకల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి




ప్రచారం కల్పిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ పండుగ గురించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి దేశవిదేశాలకు తెలిసేలా చేస్తామన్నారు. పర్యాటకశాఖ, మహిళలను భాగస్వామ్యం చేస్తూ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు.

## కాళేశ్వరంపై మాట్లాడలేకే కేసీఆర్ మొహం చాటేశారు: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు దీన్ని నమ్మినందుకే భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని గద్దెదించారని చెప్పారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మాట్లాడారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే విచారణను సీబీఐకి అప్పగించాం. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కేసీఆర్ మొహం చాటేశారు. బీసీ బిల్లు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడుతోంది. భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. మండలిలో బీసీ బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు నానా హంగామా చేశారు. భాజపా తరహాలోనే ఆ పార్టీ కూడా బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తోంది" అని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు.






## కంటెయినర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

కొత్తకోట గ్రామీణం: మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున అడ్డాకుల మండలం కాటావరం స్టేజి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటెయినర్ లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను అఫ్రస్ ఉన్నిసా (70), హసన్ (35), ఎల్లమ్మ (45)గా గుర్తించారు. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.



## మండలిలో భారాస ఎమ్మెల్సీల ఆందోళన

హైదరాబాద్: తెలంగాణ శాసన మండలిలో భారత రాష్ట్ర సమితి సభ్యులు ఆందోళన చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి అప్పగించనున్నట్లు శాసనసభ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మండలి ఛైర్మన్ పోడియాన్ని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు చుట్టుముట్టి నినాదాలు చేశారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రతులను భారత రాష్ట్ర సమితి సభ్యులు చించివేసి ఛైర్మన్ వైపు విసిరారు. 'రాహుల్‌కు సీబీఐ వద్దు.. రేవంత్‌కు సీబీఐ ముద్దు' అంటూ నినాదాలు చేశారు. భారత రాష్ట్ర సమితి సభ్యుల తీరుపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.

పోడియం వద్దకు రావొద్దని.. కేటాయించిన స్థానాల్లోనే నిరసన తెలపాలని సూచించారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీల నిరసనల మధ్యే మంత్రులు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం పంచాయతీరాజ్ చట్టసవరణ, పురపాలక సంఘాల చట్టసవరణ, అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులు సభ ఆమోదం పొందినట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు.

## కేసీఆర్‌కు అవినీతి మరక వెనుక హరీశ్‌రావు పాత్రలేదా?: కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితసంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. " కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్‌డ్‌గా సీబీఐ పేరు చెప్పారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండి. బీసీల రిజర్వేషన్లపైనా బిల్ పెడతారు. కానీ, ఎందుకు సుప్రీం కోర్టు దాకా వెళ్లి పోరాడటం లేదు. బిహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ బలి చేస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి బిహార్ వెళ్లి మీ బండారం బయటపెడతాం. సీబీఐ కాదు, ఇంకే ఎంక్వైరీ వేసిన కేసీఆర్ కడిగిన ముత్యంలా వస్తారు" అని ధీమా వ్యక్తం చేశారు.

## కాళేశ్వరం విచారణ.. సీబీఐకి అప్పగించడం ప్రాజెక్టును ఎండబెట్టడమే: కేటీఆర్



హైదరాబాద్: కాళేశ్వరంపై విచారణ సాకుతో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేవలం కేసీఆర్, భారత రాష్ట్ర సమితిపైనే దాడి జరగడం లేదన్న ఆయన.. కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి, గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించే కుతంత్రాలకు తెరదీశారని విమర్శించారు. పార్టీ శ్రేణులతో ఆయన సోమవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగించడమంటే ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టడమే. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను ప్రధాని మోదీ జేబు సంస్థలుగా విమర్శించిన రేవంత్‌రెడ్డి.. 48 గంటల్లో ఎందుకు మాట మార్చారో చెప్పాలి. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వమంతా కేంద్ర దర్యాప్తు సంస్థలను భాజపా దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాహుల్ గాంధీకి చేదుగా అనిపించిన సీబీఐ, రేవంత్‌కు మాత్రం ముద్దొస్తోందా? కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కోరగానే.. రేవంత్ ఆ దిశగా ముందుకెళ్లడం ఆ రెండు పార్టీల సంబంధానికి సాక్ష్యం. తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, బంగారు తెలంగాణ నిర్మాతగా చరిత్ర సృష్టించిన కేసీఆర్‌పై విష ప్రచారం చేయాలన్న దుర్మార్గపు ఆలోచనతో రేవంత్ ఉన్నారు. గతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలినా, సుంకిశాలలో సైడ్ వాల్ కూలినా, వట్టెం పంప్ హౌజ్ కూలిపోయినా, పెద్దవాగు రెండు సార్లు కొట్టుకుపోయినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. ఇప్పుడు రాని జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ, మేడిగడ్డ రెండు పిల్లర్లు కుంగితే మాత్రం ఆగమేఘాలపై వచ్చి, తలా తోక లేని రిపోర్టు ఇచ్చింది. పద్నాలుగేళ్ల ఉద్యమంలో, పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో, రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తెలంగాణ ఏకైక గొంతుకగా నిలుస్తున్న కేసీఆర్, భారత రాష్ట్ర సమితి పార్టీని అణచివేసే కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుంది. బెదిరింపులు, కేసులు మాకు కొత్తేం కాదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని పోరాటాలకైనా, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం"అని కేటీఆర్ తెలిపారు.



## ముంబయి వీధులను రేపటిలోగా ఖాళీ చేయండి

ముంబయి: మరాఠాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. మరోవైపు మరాఠా కోటా నిరసనలపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు ముంబయిలో తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు కారణం కావడంతో హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రేపటి(సెప్టెంబర్ 2)లోగా నిరసనకారులు ముంబయి వీధులను వీడాలని ఆదేశాలిచ్చింది. సోమవారం ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మరాఠా రిజర్వేషన్ల ఆందోళన చేపట్టారు. వేలాది మంది నిరసనకారులు దక్షిణ ముంబయికి చేరుకోవడంతో.. సీఎస్‌టీ, ఫోర్ట్, చర్చిగేట్ తదితర మార్గాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నిరసనకారులు పలు మార్గాలను బ్లాక్ చేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ నిరసనలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు శాంతియుతంగా జరగడం లేదని.. నిబంధనలన్నీ ఉల్లంఘిస్తున్నారని కోర్టు వ్యాఖ్యనించింది. ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్, అతడి మద్దతుదారులు ముంబయి వీధులను మంగళవారం మధ్యాహ్నంలోగా ఖాళీ చేయాలని ఆదేశించింది.

**మరాఠా కోటా.. ఏమిటీ 'హైదరాబాద్ గెజిట్'?...** మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలన్న తన డిమాండ్ నెరవేరే వరకూ ముంబయి విడిచి వెళ్లబోనని కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్ ఆదివారం తెగేసిచెప్పిన విషయం తెలిసిందే.

# సమాజ హితానికి జీవితాన్ని అర్పించిన ధన్యజీవి కరీంనగర్ గాంధీ

## సెప్టెంబర్ 2... బో. వే. రా. జన్మదినం సందర్భంగా



సమాజ హితానికి జీవితాన్ని ధారబోసిన ధన్యజీవి కరీంనగర్ గాంధీ. దేశ ఆరు ఏడు దశాబ్దాల చారిత్రక నేపథ్యంలో వెంకట రామారావు 73 ఏళ్ల సుదీర్ఘ ప్రస్తానం విడ దీయరానిది. కరీంనగర్, తోటపెల్లి గాంధీగా పేరెన్నిక గన్న బోయినిపెల్లి వెంకట రామారావు కరీంనగర్ జిల్లా తోటపెల్లిలో పద్మ నాయక కుటుంబంలో 1920 సెప్టెంబర్ 2న జన్మించారు. బాల్యం నుంచే స్వతంత్ర ఆలోచనలు కలిగి, గాంధీ ప్రభావానికి లోనైనారు. అంటరాని తనాన్ని వ్యతిరేకించారు. ఆర్యసమాజం, సంఘ సంస్కరణ ఉద్యమాలు, క్విట్ ఇండియా ఆకర్షితులై నైజాం పాలనకు, ఉర్దూ మీడియం పట్ల నిరసన వ్యక్తం పరిచారు. నిజాం వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటంలో నాయకత్వం వహించి క్రియాశీలక పాత్ర పోషించారు. తర్వాతి కాలంలో మహాత్ముని వేషం సిద్ధాంతాల ప్రభావాలకు లోనై, వాటిని పాటించడంతో తోటపెల్లి గాంధీ అని పిలిచేవారు. 1935 డిసెంబర్ 29,30,31,1936 జనవరి 1 తేదీలలో సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహా సభలలో స్వచ్ఛంద దళ నేతగా సేవలందించారు. 1940లో చిల్వాకోడూరు, 48 లో జగిత్యాలలో, కోరుట్లలో వితంతు పునర్వివాహాలు జరిపించారు. 1945లో హరి జనులను దేవాలయ ప్రవేశం చేయించి సహ పంక్తి భోజనం ఏర్పాటు చేశారు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికకు విలేఖరిగా పనిచేశారు. బోయినిపెల్లి కార్య కలాపాలను తెలుసుకున్న నిజాం, కుటుంబ సభ్యులను వేధించి తండ్రి కొండాల్ రావును మాలీ పటేల్ పదవి నుంచి తొలగించి, కుమారుని తలపై బహుమతి ప్రకటించారు. కొండల్ రావును అక్టోబర్ లో అరెస్టు చేసి జైలు పాలు చేయగా, వెంకట రామారావు తప్పించుకుని, మెట్ పెల్లి ఖాదీ వస్త్ర కర్మాగారంలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసి అజ్ఞాత వాసం గడిపారు. జమ్మికుంట రైల్వే లైను తొలగింపు విషయంలో కుట్ర కేసులో జైలుకు పంపారు. 1948లో గాంధీ మరణ వార్త విని జైలులో సంతాప సభ నిర్వహించారు. 1981లో ఖాదీ ఉద్యమాన్ని విస్తరించి, భారీ ఉత్పత్తులను, చేతి వృత్తులను కాపాడేందుకు "ఖాదీ నవ నిర్మాణ సమితి"ని స్థాపించారు. గాంధీ నెలకొల్పిన " "అఖిల భారత సర్వసేవా సంఘం"లో సభ్యులైనారు. 1994లో ఎన్టీఆర్ ప్రభుత్వం మద్య నిషేధం విధించగా, జిల్లా కమిటీ అధ్యక్షులుగా పని చేశారు. చంద్రబాబు ప్రభుత్వం మద్య నిషేధ ఉపసంహరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ధర్మాలు, సత్యాగ్రహాలు చేశారు. హైదరాబాద్ లో "దక్షిణ భారత హిందీ ప్రచారసభ" వ్యవస్థాపక సభ్యులు. స్వాతంత్ర్యానంతరం కరీంనగర్ జి ల్లాలో సాహిత్య వికాసానికి ఎనలేని కృషి సల్పారు. గ్రంథాలయ ఉద్యమంలో భాగస్వామియైన అనుభవంతో "జిల్లా గ్రంథాలయ సంస్థ"కు పలుమార్లు "అధ్యక్షులు"గా సేవలందించారు. ఆంధ్ర విధ్యాభి వర్ధినీ గ్రంధాలయం 1939లో తన 19వ ఏట స్థాపించారు. 93 వ ఏట మరణించే వరకూ కొన సాగించారు. 1962లో కరీంనగర్ జిల్లా రచయితల సంఘాన్ని స్థాపించారు. కవిసామ్రాట్, దివాకర్ల, వానమామలై, ధూపాటి, ఖండ వల్లి, పల్లా దుర్గయ్య, దాశరథి, సినారె, శేషేంద్రశర్మ, పోరంకి, దేవులపల్లి, గజ్జెల మల్లారెడ్డి, కాళోజీ, శతావధాని కృష్ణమాచార్య, పీవీ నరసింహారావు, చొక్కారావు ఆదిగా తమ సంస్థ ద్వారా సన్మానితుల గావించారు. సినారె రాజ్యసభ సభ్యులుగా ఉండగా, ఆయన సహకారంతో కరీంనగర్ జిల్లా రచయితల, సారస్వత జ్యోతి మండలికి వేరు వేరుగా భవనాల నిర్మాణాలు చేయించారు. కరీంనగర్ జిల్లా చరిత్ర, శాసనాల పరిశోధనలలో ధూపాటి వెంకట రమణాచార్యులు, బీఎన్ శాస్త్రి లాంటి వారితో స్వయంగా పర్యటనలో పాల్గొన్నారు. నాణేలు, ఇటుకలు, తాళపత్రాలు, బండ రాతలు, పురా వస్తువులు సేకరించి శాఖా పరం చేశారు. జిల్లాలో దేవాలయాలు, స్వాతంత్ర్య సంగ్రామం నాటి అనుభవాల వ్యాస సంకలనం, ఆంధ్ర మహా సభల నిర్వహణ పుస్తకం, వేంకట రామారావు గేయాలు స్వీయ రచనలు వెలువరించారు. 2001లో భారత మాత పురస్కారం, దివ్యజ్ఞాన సమాజం చెన్నై వారిచే లైఫ్ అచీవ్ మెంట్ అవార్డు, రాజీవ్ మెమోరియల్ ట్రస్టు ద్వారా బంగారు కంకణం, గాంధీ మనమరాలు చేతుల మీదుగా లక్ష నగదు పొందారు. స్వర్ణ కంకణాలు, స్వర్ణ ఆభిషేకాలు స్వీకరించి, గ్రంథాలయ విభూషణ్, ఉపన్యాస కేసరి, విశ్వ బంధు. హరిజన బంధు, అపరగాంధీ లాంటి బిరుదులకు పాత్రులైనారు. 2005లో కాకతీయ విశ్వ విద్యాలయం డాక్టరేట్ బిరుదుతో సన్మానించింది. భారత ప్రభుత్వం స్వతంత్ర్య సమర వేయోధుల ఎంపిక కమిటీ రాష్ట్ర అధ్యక్షుడుగా, కేంద్ర ప్రభుత్వ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 93 ఏళ్ల ప్రాయంలో జారి పడి 2014 అక్టోబర్ 27న చికిత్స పొందుతూ డెక్కన్ హాస్పిటల్ లో మృతి చెందారు. రాష్ట్ర ప్రభుత్వం మానేరు తీరాన అధికార లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించగా, నాటి సీఎం కేసీఆర్, ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు. రాజేంద్ర ప్రసాద్, నెహ్రూ, శాస్త్రి, ఇందిర, వినోబా, జయప్రకాశ్ లాంటి ప్రముఖులతో కలిసి సమావేశంలో పాల్గొన్న, వారి స్ఫూర్తిని సహచరులకు అందించి భారత రాష్ట్రపతిచే క్విట్ ఇండియా ఉత్సవాల సందర్భంగా పురస్కార గ్రహీతయైనారు అపరగాంధీ బోయినిపెల్లి.


**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# రొమాంటిక్ ఐకాన్ హరనాథ్ - సెప్టెంబర్ 2... హరనాథ్ జయంతి



బుద్ధరాజు వెంకట అప్పల హరినాథ రాజు అలియాస్ హరనాథ్ (సెప్టెంబర్ 2, 1936 – నవంబర్ 1, 1989) తెలుగు సినిమా కథానాయకుడు. ఆయన 1936లో సెప్టెంబర్ 2 న తూర్పుగోదావరి గొల్లప్రోలు మండలం రాపర్తి గ్రామంలో బుద్దరాజు వరహాలరాజు దంపతులకు జన్మించాడు. ఆయనకు కుమారుడు శ్రీనివాస రాజు, కుమార్తె పద్మజ ఉన్నారు. తండ్రి బుద్ధరాజు వరహాలరాజు శ్రీ ఆంధ్ర క్షత్రియ వంశ రత్నాకరము అనే గ్రంథ రచయిత. మద్రాసులో పాఠశాల విద్యను పూర్తి చేసి, కాకినాడలో ఆర్ట్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. తన కళాశాల రోజుల్లో, పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఉత్సాహభరితమైన వ్యక్తి. ఆయన తన కళాశాలలో నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి నిలిపాడు. కళాశాలలో హరనాథ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వంటి అనేక నాటకాల్లో నటించాడు. మరియు బహుమతులు కూడా గెలుచు కున్నాడు. ఆయన శిక్షణ పొందిన పైలట్. ఒక రోజు, ఆయన పైలట్ శిక్షణా తరగతికి హాజరై తిరిగి వచ్చినప్పుడు, దర్శకుడు గుత్తా రామినీడును చూశాడు. ఒకేసారి, దర్శకుడు అతనిని చూశాడుబీ వెంటనే రామినీడు, హరనాథ్ ను తన మనస్సులో ఒక హీరోగా ఊహించు కొన్నాడు. వెంటనే చిత్రంలో హీరోగా బుక్ చేసుకున్నాడు. ఆ చిత్రం ఋష్యశృంగ. 60 వ దశకంలో హరినాథ రాజు తెలుగు సినిమాల్లో రొమాంటిక్ ఐకాన్ గా పేరొందాడు. ఆయన తొలి సినిమా మా ఇంటి మహాలక్ష్మి 1959 లో హైదరాబాద్ సారథీ స్టూడియోస్ లో చిత్రీకరించారు. మా ఇంటి మహాలక్ష్మి సినిమాతో ఎన్టీయార్, ఏఎన్నార్ తరువాత తెలుగులో హరనాద్ ప్రముఖ హీరో అని అనిపించు కున్నాడు. నందమూరి తారక రామారావు 1959 నిర్మించిన సీతారామ కళ్యాణం సినిమాలో శ్రీరాముడుగా నటించాడు. 1967 లో నిర్మించిన భీష్మలో శ్రీకృష్ణుడుగా నటించాడు. 1969 శ్రీ రామ కథ శ్రీ రామ పాత్రలో నటించాడు. సుమారు 117 తెలుగు సినిమాలు, 12 తమిళం, 1 హిందీ, 1 కన్నడం సినిమాల్లో నటించాడు. హరనాథ్, జమున తో కలిసి చాలా చిత్రాల్లో నటించాడు. లేత మనసులు' చిత్రంలో హరనాథ్ నటించిన 'అందాలా ఓ చిలకా, అందుకో నా లేఖా' పాట ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని మంత్ర ముగ్దులను చేసింది. పాలమనసులు, పెళ్లి రోజు వంటి సినిమాలు, హరనాథ్, జమున ప్రధాన జంటగా అద్భుతమైన విజయాలు సాధించాయి. ఆయన చివరి చిత్రం 1989 లో తోడల్లుడు. ఆయన 1981 లో విడుదలైన మా ఇంటి దేవత అనే ఒక చిత్రాన్ని నిర్మించాడు. చివరి దశలో మద్యపానానికి అలవాటు పడడంతో కేవలం అతిథి పాత్రలలో నటించే అవకాశాలే వచ్చాయి. 1984లో హరనాథ్ చివరగా చిరంజీవి నటించిన, నాగు సినిమాలో తండ్రి పాత్ర పోషించాడు. ఆయన 1989, నవంబర్ 1 న మరణించాడు. హరనాథ్ కుమారుడు శ్రీనివాస్ బుద్ధరాజు చిత్ర నిర్మాత, కుమార్తె పద్మజా చిత్ర నిర్మాత జివిజి రాజు భార్య. హరనాథ్...కలవారి సంసారం (1982)బీ గడసరి అత్త సొగసరి కోడలు (1981)బీ బాల భారతం (1972)బీ భలే పాప (1971)బీ కథానాయిక మొల్ల (1970)బీ శ్రీదేవి (1970)బీ తల్లి తండ్రులు (1970)బీ ప్రేమకానుక (1969)బీ చల్లని నీడ (1968)బీ నడమంత్రపు సిరి (1968)బీ బంగారు సంకెళ్ళు (1968)బీ పెళ్ళిరోజు (1968)బీ భక్త ప్రహ్లాద (1967)బీ చదరంగం (1967)బీ శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న (1967)బీ లేత మనసులు (1966)బీ శ్రీకృష్ణ పాండవీయం (1966)బీ చంద్రహాస (1965)బీ సర్వర్ సుందరం (1964)బీ అమరశిల్పి జక్కన్న (1964)బీ మురళీకృష్ణ (1964)బీ పెంపుడు కూతురు (1963)బీ గుండమ్మ కథ (1962)బీ భీష్మ (1962)బీ కలసివుంటే కలదు సుఖంబీ ఋష్య శృంగ (1961)బీ మా ఇంటి మహాలక్ష్మి (1959)బీ తదితర చిత్రాలలో విభిన్న పాత్రలలో నటించారు.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**




వాషింగ్టన్: అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో పిడుగు పడింది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతినిధులకు జారీ చేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను ఆవిష్కరించింది. అంటే.. ఇకపై విదేశీ విద్యార్థులు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా వీసా నిబంధనల్లో మార్పులు చేయనుంది. ప్రస్తుతం ఎఫ్–1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే–1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాల నుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం సిద్ధమైంది. ఈ వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది.

**మా విద్యార్థులపై వేధింపులు ఆపండి – అమెరికాకు చైనా విజ్ఞప్తి...**
"విదేశీ విద్యార్థులు, ఇతర వీసాదారులు అమెరికాలో నిరవధికంగా నివసించేలా చాలాకాలంగా అమెరికాలోని గత ప్రభుత్వాలు అనుమతి కల్పించాయి. దీని వల్ల భద్రతాపరమైన ఇబ్బందులతో పాటు అమెరికన్లకు ప్రయోజనాలపై దెబ్బ పడింది. దీనికి ముగింపు పలికేలా కొత్త నిబంధనలను ప్రతిపాదించాం. కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి తీసుకొస్తున్నాం. దీనివల్ల ఫెడరల్ ప్రభుత్వంపై భారం తగ్గనుంది" అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ నోటీసుల్లో పేర్కొంది.

**ప్రతిపాదనల్లో సూచించిన మార్పులు ఇవే..** ఎఫ్, జే వీసా పొందిన విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు అమెరికాలో చదువుకునేందుకు గరిష్ఠ కాల పరిమితి నాలుగేళ్లుగా నిర్ణయించారు. గ్రాడ్యుయేట్ స్థాయి ఎఫ్–1 విద్యార్థులు కోర్సు మధ్యలో ప్రోగ్రామ్‌లు మార్చుకుంటే ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎఫ్–1 విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న తర్వాత మరో వీసా కోసం ప్రయత్నించాలనుకుంటే.. ఆ గ్రేస్ పీరియడ్ ను 60 రోజుల నుంచి 30 రోజులకు కుదించారు. విదేశీ మీడియా సంస్థల ప్రతినిధులు తీసుకునే ఐ–వీసాదారులు 240 రోజుల వరకు అమెరికాలో ఉండొచ్చు. ఆ తర్వాత మరో 240 రోజుల వరకు తమ నివాస అనుమతిని పొడిగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. దేశ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా చైనీస్ మీడియా ప్రతినిధులు అదనపు ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే, విదేశీ విద్యార్థులు గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా, లేదా అనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఈ ప్రతిపాదనలను ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేయనున్నారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలు స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3 లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు.

# సంప్రదాయానికి ప్రతీక, స్థిరత్వానికి మూలం...కొబ్బరి దినోత్సవం

## సెప్టెంబర్ 2... ప్రపంచ కొబ్బరి దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తారు. జీవన వృక్షం అని ప్రసిద్ధి చెందిన కొబ్బరి చెట్టు ప్రాధాన్యతను చాటడం, దాని ఆధారంగా జీవనోపాధి సాగిస్తున్న కోట్లాది మంది రైతుల కృషిని గుర్తించడం, పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఆసియా పసిఫిక్ కొబ్బరి సమాజం అనే అంతర్జాతీయ సంస్థ 1999లో స్థాపించ బడింది. దీనిని పురస్కరించుకుని 2009లో మొదటి.సారిగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపు కున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న దీన్ని గుర్తుగా పాటిస్తున్నారు. ఈ సంస్థలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన 18 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కొబ్బరి పంట ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ, రైతుల ఆదాయాభివృద్ధి లక్ష్యాలతో ఈ వేదిక ఏర్పడింది. కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలవడానికి కారణం దాని ప్రతి భాగం ఉపయోగకరమై ఉండడమే. వేర్లు, కాండం, ఆకులు, పండు అన్నీ మానవ జీవితానికి ఉపయోగ పడతాయి. కొబ్బరి నీరు సహజమైన ఎలక్ట్రోలైట్‌లకు నిలయం. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీటిలో సుమారు 19 క్యాలరీలు, 4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 25 మిల్లీ గ్రాముల సోడియం ఉంటాయి. క్రీడాకారులకు, శ్రమతో జీవించే వారికి ఇది సహజ శక్తినిస్తుంది. కొబ్బరి నూనెలో 90 శాతం మధ్యస్థ శృంఖల కొవ్వు ఆమ్లాలు (%వీజుం%) ఉంటాయి. వీటిలో లౌరిక్ ఆమ్లం శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొబ్బరి పాలు విటమిన్ సి, ఇ, బి కంప్లెక్స్, ఇనుము, మగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో నిండిపోయి ఉంటాయి. కొబ్బరి తురుము మిఠాయిలు, వంటకాల్లో రుచిని పెంచడమే కాకుండా అధిక ఫైబర్‌తో జీర్ణక్రియకు తోడ్పడుతుంది. కొబ్బరి చెట్టు ఆకులను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పుల కోసం, చాపలు, ముట్టెలు తయారీకి ఉపయోగిస్తారు. పీచు నుండి తాడులు, గోనె సంచులు, పరుపులు, బ్రష్‌లు తయారవుతాయి. తాటి కాండంతో గృహోపకరణాలు, ఫర్నిచర్ తయారు చేస్తారు. చిప్పలను బయోమాస్ ఇంధనంగా వినియోగిస్తారు. కొబ్బరి చెట్టు వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అమూల్యమైన వనరుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 6.3 కోట్ల మెట్రిక్ టన్నుల కొబ్బరి ఉత్పత్తి అవుతుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశం మూడు ప్రధాన ఉత్పత్తి దారులు. వీటి లోనే ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం వస్తుంది. భారత దేశం రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023 గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల హెక్టార్లకు పైగా కొబ్బరి సాగు విస్తరించి ఉంది. సంవత్సరానికి సుమారు 1.9 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేరళ ఒక్కదాని లోనే దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా కూడా ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలు. దేశ వ్యాప్తంగా సుమారు 20 కోట్ల ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా కొబ్బరి ఆధారిత జీవనోపాధిపై ఆధారపడి ఉన్నారు. కొబ్బరి ఉత్పత్తుల ద్వారా భారత దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. కోయిర్ ఉత్పత్తులు, కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి, కొబ్బరి నీటితో తయారైన పానీయాలు, హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎగుమతుల్లో ప్రధాన భాగం. కేవలం కోయిర్ ఉత్పత్తుల ద్వారానే 2022%–%23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,340 కోట్ల రూపాయల ఎగుమతులు జరిగాయి. ఈ పరిశ్రమలో లక్షలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. అయితే కొబ్బరి పరిశ్రమకు సవాళ్లు తక్కువ కావు. దేశ వ్యాప్తంగా పంటలో 30 శాతం చెట్లు వయసు పైబడినవే. దిగుబడి తగ్గిపోవడం సహజం. కొత్తగా నాటే మొక్కలకు ప్రోత్సాహక పథకాలు అవసరం. కొబ్బరి చెట్లకు రూట్ విల్ట్, బ్లాక్ హెడ్, కీటకాల దాడి వంటి వ్యాధులు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి. మార్కెటింగ్ సౌకర్యాల లేమి, శ్రామికుల కొరత రైతుల సమస్యలలో ముఖ్యమైనవి. ఒక చెట్టుపైకి ఎక్కి కాయలు కోయగల నైపుణ్యం కలిగిన శ్రామికులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. దీంతో రైతులు అధిక ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. ప్రపంచ కొబ్బరి దినోత్సవం ఈ సమస్యలను గుర్తించడానికి, వాటి పరిష్కార మార్గాలను చర్చించడానికి ఒక మంచి వేదిక. ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన థీమ్ ప్రకటించి రైతుల ఆదాయాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు, సాంకేతికత వినియోగం, మార్కెట్ విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కొబ్బరి పరిశ్రమ భవిష్యత్తు స్థిరంగా ఉండాలంటే పంట సంరక్షణ, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు రైతులకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ కొబ్బరి దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఇది జీవనానికి, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. కోట్లాది మంది రైతుల కష్టానికి గౌరవం ఇవ్వడం, ఈ వనరును భావి తరాలకు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి మనకు ప్రసాదించిన ఈ కల్ప వృక్షాన్ని కాపాడు కోవడం ద్వారానే గ్రామీణాభివృద్ధి, స్థిరమైన జీవన విధానం సాధ్యమవుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440585494**

# భారత్–అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు..!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్–అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

**భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా..?..** గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూదిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్–అమెరికా సంబంధాల్లో ఇండో–పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్–అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకుతీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్–అఫ్గాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోదీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతర సందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..** 2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత–పాక్–అఫ్గానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్–అఫ్గానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గతమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్–మస్క్ వివాదాన్ని ఎగదోసి..** శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ నాసా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనేట్‌కు పంపే సమయంలో మస్క్–ట్రంప్ మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. అదే సమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా మస్క్ చివరి రోజున.. నాసా చీఫ్ పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు..!...** ఇక సెనెట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీ కాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోద ముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆయన చివరి రెండేళ్లు మాత్రమే భారత్‌లో పనిచేశారు.

# చురకలు సంపాదకీయం

## జగదీప్ ధన్‌ఖడ్ మోడీకి షాకిచ్చారా?

అనారోగ్య కారణాలతో ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో పరోక్షంగా ఆయన కేంద్రంలోని మోడీ సర్కారుకు భారీ షాకిచ్చినట్టు జాతీయ మీడియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయిన రెండో రోజే ఆయన తన పదవికి రాజీనామా సమర్పించారు. ఎలాంటి సంకేతాలు ఇవ్వకుండానే రాత్రికిరాత్రి దీనికి సంబంధించిన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పించారు. అనంతరం.. ఆ రాజీనామాను ఆమోదించడం తెలిసిందే. అప్పట్లో తనకు ఆరోగ్యం సహకరించడం లేదని.. అందుకే రాజీనామా చేస్తున్నానని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి పోస్టుకు ఎన్నికలు కూడా వచ్చాయి. ఇక, అప్పటి నుంచి ఇప్పటి వరకు జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడా కనిపించలేదు. ఆయన గురించిన వార్త కూడా ఎక్కడా వినిపించలేదు. ఇప్పుడు అనూహ్యంగా ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని చెప్పారు.

**ఏం చేశారు?...** రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జగదీప్ ధన్‌ఖడ్.. 1993లో జరిగిన ఎన్నికల్లో కిషన్‌గఢ్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత.. ఆయన ఓడిపోయారు. ఇంతలో కేంద్రంలో మోడీ సర్కారు వచ్చాక .. బీజేపీకి వీర విధేయుడు అనే కారణంగా ఆయనను బెంగాల్‌కు గవర్నర్‌గా పంపించారు. ఆ తర్వాత.. ఉపరాష్ట్రపతిని చేశారు. ఇప్పుడు తాజాగా.. నేను మాజీ ఎమ్మెల్యేను కాబట్టి.. నాకు పింఛను ఇప్పించండి .అని రాజస్థాన్ స్పీకర్ వాసుదేవ్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. వాస్తవానికి గతంలోనూ ఆయన 2019లో గవర్నర్ అయ్యేదాకా.. పింఛను తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ మాజీ ప్రజాప్రతినిధి హోదాలో పింఛనుకు దరఖాస్తు చేశారు. ఈ క్రమంలో ఆయనకు సుమారు 42 వేల చొప్పున నెల నెలా పింఛను రానుంది.

**ఉపరాష్ట్రపతి పింఛన్ వద్దా?!...** వాస్తవానికి జగదీప్.. ఉపరాష్ట్రపతిగా ఉంటూ.. తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలోకూడా ఆయన కు రాజ్యసభ చైర్మన్‌గా అందించిన సేవలకు సంబంధించి పింఛను లభిస్తుంది. ఇది ఆయన పదవీ విరమణ, లేదా రాజీనామా చేసే సమయానికి ఎంత ఉంటే అందులో సగాన్ని పించనుగా ఇస్తారు. ఉదాహరణకు తెలుగువారైన వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవీ విరమణ పొందే సమయానికి ఆయన వేతనం 3,20000 రూపాయలు. ప్రస్తుతం దీనిలో సగం మొత్తం ఆయనకు పింఛనుగా అందుతోంది. అలానే.. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసినా.. ఆయనకు పింఛను వస్తుంది. ఆయన పదవిలో ఉన్నప్పుడు.. రూ.4 లక్షల చొప్పున వేతనం అందుకున్నారు. దీనిలో సగం 2 లక్షలు ఆయనకు పింఛనుగా వస్తుంది. కానీ, దీనిని కాదని.. ఆయన మాజీ ఎమ్మెల్యేగా కేవలం 42 వేల రూపాయల పింఛను కోసం దరఖాస్తు చేసుకోవడం.. దీనిని ఆమోదించేదుకు రాజస్థాన్ స్పీకర్ రెడీ కావడం వంటివి సంచలనంగా మారాయి. దీనిని బట్టి.. ఆయన మనసులో ఆవేదనను మరో రూపంలో వెళ్లగక్కారా? ఉపరాష్ట్రపతి పదవి నుంచి అనూహ్యంగా రాజీనామా చేయడం వెనుక ఉన్న కారణాలపై పరోక్షంగా ఆయన స్పందించినట్టు అయిందా? అనే చర్చకు దారితీసింది.

## ఆహారం పై అవగాహన అవసరం - పోషకాహార లోపమే అనారోగ్యానికి మూలం - జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా

జాతీయ పోషకాహార వారోత్సవం (ఎన్ ఎన్ డబ్ల్యు) పోషణ, ఆరోగ్య సంబంధిత సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారిస్తుంది. ఆరోగ్యం మరియు సంక్షేమం ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుండి 7వ తేదీ వరకు ఈ వారోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ బృహత్ కార్యక్రమ ప్రచారాన్ని 1982లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పోషకాహార లోపం వల్ల ప్రభావాలు, కారణాలు, ప్రతికూల చర్యలను హైలైట్ చేసి ప్రజలలో ఆరోగ్యకరమైన జీవనం, మంచి ఆరోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. జీవించడానికి ప్రాధమిక అవసరంలో మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించడం అసంభవం. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదించినా, ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే.. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. అయితే ఆ తినడంలో పోషక పదార్థాలపై ఏ మాత్రం దృష్టి పెట్టక పోవడం అనారోగ్యానికి హేతువు అవుతున్నది. ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగుతామనో, లావు అయిపోతామనో అనేక కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి జబ్బుల బారిన పడకుండా, ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన పెంపొందించు కోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసు కోవాలి. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద



మనిషి తినకలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతీయులు రోజూ కనీసం 400 గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. పోషకాలు అధికంగా ఉండే ఆహారం శక్తిని అందిస్తాయి. పండ్లు, కూర గాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బబ్బెర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50 శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. తాజా పండ్లు, గోధుమ రొట్టె, బ్రౌన్ రైస్, పాలు, పెరుగు, జున్ను వంటి పాల మొక్కల ఆధారిత ప్రత్యామ్నాయాలు, బలవర్ధకమైన బాదం లేదా సోయా పాలు తగినంత ద్రవాలు, ఎక్కువగా తియ్యగా ఉండే పానీయాల వంటి వాటిని తీసుకుంటే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఎర్ర మాంసం, చికెన్, చేపలు, ఆకుకూరలు, బీన్స్, కాయ ధాన్యాలు మరియు కాయలు వంటివి ఐరన్ యొక్క మంచి వనరులు. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని ఐరన్ కలిగిన శాఖాహార వంటి వాటితో కలిపి తినడం వల్ల పోషణ మెరుగు పడుతుంది. ప్రసవ సమయంలో ఉన్న మహిళలకు పుట్టుకతో వచ్చే లోపాలను తగ్గించడానికి తగినంత ఫోలేట్ (ఫోలిక్ యాసిడ్) తీసుకోవడం ఉత్తమం. వంట గదిలో తయారు చేసిన కూరగాయలు, బీన్స్, జున్ను, పెరుగు వంటి వాటిని తీసుకోవడం ఉత్తమం. ఎక్కువ భాగం కేలరీలు ఉన్న వాటిని తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరం. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. బిస్కెట్లు, కుకీలు, కేకులు మరియు స్వీట్లు వంటి ప్యాకేజీ చేసిన ఆహారాలను తగ్గించాలి. వీలైన మేరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకోవాలి. తీసుకునే ఆహారంలో నాణ్యతను గుర్తించడం అత్యంత అవసరం.

**రామకిష్టయ్య సంగనభట్ల... 9440595494**

## జన హృదయ నేత వై. యస్. - సెప్టెంబర్ 2... రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (జూలై 8, 1949 – సెప్టెంబర్ 2, 2009) ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, ప్రత్యేక గుర్తింపు పొందిన జన హృదయ నేత. తల పండిన నేతలను తల దన్నిన వ్యూహ రచనా దురంధరుడు ఆయన. మునిగి పోతున్న కాంగ్రెస్ నావను ఒంటి చేత్తో దరికి చేర్చిన రథ సారథి ఆయన. రాజకీయాలకు సరి కొత్త అర్థం చెప్పిన చాణక్యుడు వై.యస్...రాజశేఖర్ రెడ్డి 1949 జూలై 8న జమ్మల మడుగు లోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించా డు. ఆయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారి లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరారు. 1972లో గుల్బర్గా విశ్వ విద్యాలయం నుంచి వైద్య విద్యలో పట్టా పుచ్చు కున్నారు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షు డిగా వ్యవహరించారు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్ సర్జన్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పని చేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తరువాత కొద్ది రోజుల పాటు జమ్మల మడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పనిచేశారు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేశారు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెల కొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగిం చారు. పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రి పురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది. కళాశాల దశ నుంచే రాజకీ యాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 1980–83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించారు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎన్నికయ్యారు. పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 6 సార్లు విజయం సాధించారు. రాష్ట్ర శాసన సభ ప్రతిపక్ష నేతగా, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించారు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతి వాదిగా పేరు పడ్డారు. కాంగ్రెస్ ముఖ్య మంత్రులు అందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989–94 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపారు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరా బాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అదే తాను ముఖ్య మంత్రి అయ్యేనాటికి అలాంటి శిబిరాలు లేని పరిస్థితిని సృష్టించు కోగలిగారు. రాజకీయాల్లో ముక్కు సూటి తనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి నిలువెత్తు నిదర్శనం. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశారు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నారు. 1999 నుంచి 2004 వరకు 11 వ శాసన సభలో ప్రతిపక్ష నేత గానూ వ్యవహ రించారు. 2003 వేసవి కాలంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాద యాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించారు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహద పడింది. 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధించడంతో అది వరకే పార్టీలో పేరు సంపాదించిన వై.ఎస్. ఆర్. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. పాద యాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞం లకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశారు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 ఏప్రిల్‌లో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముందుండి నడిపించడమే కాకుండా శాసన సభలో 156 స్థానాలతో పూర్తి మెజారిటీని సంపాదించి పెట్టారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలలో 33 స్థానాలలో విజయం సాధించడానికి కృషి చేశారు. వై.యస్.రాజశేఖర రెడ్డి చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సి.ఎస్.ఐ) అనే చర్చికి చెందిన ప్రొటెస్టెంటు క్రైస్తవుడు. ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2004లోనూ, మరలా 2009లోనూ కుటుంబ సమేతంగా బెత్లహాము యాత్రకు వెళ్ళి వచ్చారు. క్రైస్తవులైనా పారంపరికంగా వచ్చిన హిందూ సంప్రదా యాలని వీడలేదు. రాజశేఖరరె డ్డి తిరుమలను అనేకమార్లు సందర్శించి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని పూజలు చేశారు. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు అనుకూల వాతావరణంలో బయలు దేరగా ఉదయం గం.9.35 నిమిషాలకు హెలి కాప్టరుతో సంబంధాలు తెగి పోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో



మరణించారు. తమ అభిమాన నాయకుని మరణాన్ని జీర్ణించు కోలేక రాష్ట్ర మంతా దాదాపు 67 మంది మరణించారు. వీరిలో చాలా మంది గుండె ఆగి మరణించగా కొద్ది మంది ఆత్మహత్య చేసుకున్నారు. రాజ శేఖర్ రెడ్డి ఎన్నో పదవులు అనుభవించారు. 1975లో యవజన కాంగ్రెస్ కార్యదర్శిగాబీ 1980లో తొలి సారిగా రాష్ట్ర మంత్రి వర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగాబీ 1982లో రాష్ట్ర మంత్రివర్గంలో ఎక్సైజ్ శాఖా మంత్రిగాబీ 1982లో రాష్ట్ర మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగాబీ 1983లో పిసిసి అధ్యక్షుడిగా నియమించ బడ్డాడు (1985 వరకు). 1998లో రెండోసారి పిసిసి అధ్యక్షుడిగా నియామకం (2000 వరకు)బీ 1999లో శాసనసభ ప్రతిపక్ష నేతగాబీ 2004లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. 2009లో రెండో పర్యాయం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇక 1978లో పులివెందుల నుంచి తొలిసారి శాసన సభ్యుడిగాబీ 1983లో పులివెందుల నుంచి రెండోసారిబీ 1985లో వరుసగా మూడవ సారి శాసనసభ్యుడిగా హాట్రిక్ విజయం సాధించారు. 1989లో కడప నియోజకవర్గం నుంచి తొలిసారి లోకసభ సభ్యుడిగాబీ 1991లో కడప నియోజకవర్గం నుంచి రెండో సారిబీ 1996లో వరుసగా మూడవసారి గెలుపొంది హాట్రిక్ సాధించారు. అలాగే 1998లో కడప నుంచి వరుసగా నాలుగవసారి ఎంపీగాబీ 1999లో పులివెందుల నుంచి నాలుగవ సారి ఎమ్మెల్యేగాబీ 2004లో పులివెందుల నుంచి ఐదవసారి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. 2009లో పులివెందుల నుంచి రెండోసారి హాట్రిక్ విజయం, శాసన సభ్యుడిగా ఆరవసారి గెలుపొందారు.

**రామకిష్టయ్య సంగనభట్ల... 9440595494**

## జలియన్ వాలా బాగ్ ను తలపించిన పరకాల మారణ హోమం - పరకాలలో రజాకార్ల కాల్పులకు 78 ఏళ్ళు



దేశమంతా స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకుంటూ ఉంటే, తెలంగాణ రాష్ట్రం మాత్రం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతోన్న సమయమది. బానిస బతుకులతో తెలంగాణ ప్రజల రక్తం ఉడికిపోయిన కాలమది. తెలంగాణ సాయుధ పోరాటంగా మొదలైన పోరు బాట, చాకలి ఐలమ్మతో మొదలైన తిరుగుబాటు, పేద రైతులు భూమి కోసం, భుక్తి కోసం జరిగిన పోరులో ఎందరో బలైన సందర్భమది. స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం చేసే క్రమంలో ఎన్నో ఘటనలు జరిగిన నేపథ్యమది. 76 ఏళ్ళ క్రితం నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ, దేశ సాధికారికతను, సార్వభౌమాధికారికతను ప్రకటించే చర్యగా జాతీయ పతాకాన్ని ఎగుర వేసే క్రమంలో రజాకార్ల కాల్పులకు పోరాట యోధులు బలైన దుర్ఘటన అది. 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక, నిజాం రాజ్యంలోనూ జాతీయ పతాకం ఎగురవేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. వాటిని అణగ దొక్కేందుకు రజాకార్లు ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వాళ్ల వీరోచిత పోరాటానికి నిలువెత్తు నిదర్శనం వరంగల్ జిల్లా పరకాలలో రజాకార్లు జరిపిన మారణ హోమం. జలియన్ వాలాబాగ్ ఘటనను తలపించేలా, పరకాలలో జరిగిన మారణ హోమం, పోరుగడ్డ మీద పరకాల వీరులు చిందించిన నెత్తుటి జ్ఞాపకం. భారత దేశానికి 1947 ఆగస్టు 15 న స్వాతంత్ర్యం వచ్చింది.. కానీ తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం, రజాకార్ల పాలనలోనే ఉంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంతంలో తిరుగుబాటు మొదలైంది. 1945–46 ... తెలంగాణ ప్రాంతంలో సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న కాలం అది. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూమి కోసం దొరలపైన కమ్యూ నిస్టులు, కాంగ్రెస్ నేతల అధ్వర్యంలో పోరు తీవ్ర స్థాయిలో జరుగుతోంది. నిజాం తన అధికారం చేజారుతోందని భావించి, ప్రైవేటు సైన్యమైన రజాకార్లను ఖాసిం రిజ్వీ నాయకత్వంలో నియమించారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా తెలంగాణ గ్రామాల్లోని ప్రజలు సాయుధ పోరు బాట పట్టారు. 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుంచి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2న పరకాలలో జాతీయ పతాకం ఎగుర వేయలని నిర్ణయించారు. పోలీసులు వరంగల్ జిల్లాలో అన్ని సమావేశాలను నిషేధించారు. సెప్టెంబర్ 2న జాతీయ పతాకం ఎగుర వేసేందుకు సమీప గ్రామాల నుండి 1,500 మందికి పైగా ప్రజలు వచ్చారు. వందల సంఖ్యలో జనాలు పరకాల లోని చాపల బండ చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన రజాకార్లు కత్తులు, బరిసెలు, తల్వార్లతో ఉద్యమకారులను వెంబడించి విచక్షణా రహితంగా నరికివేశారు. రజాకార్ల కాల్పుల్లో అక్కడికక్కడే 15 మంది మృతి చెందారు. 22మంది అసువులు బాసారు. వేలాదిమంది క్షత గాత్రులయ్యారు. రాత్రికి రాత్రి రజాకార్లు ఇళ్లలోకి చొరబడ్డారు. ఆడవారిపై అత్యాచారాలు చేశారు. అంతే కాదు పరకాలకు దగ్గరలోనే ఉన్న రంగాపూరు గ్రామంలో జెండా ఎగురవేసే ప్రయత్నం చేసిన ముగ్గురిని చెట్టుకు కట్టేసి కాల్చేశారు. బెహరాన్ పల్లిలో కూడా రజకార్లు మారణకాండ సృష్టించారు. ఉద్యమ కారులు ఆకుతోట మల్లయ్య, వడ్డెపల్లి వీరయ్య, రాజా మహ్మద్‌లను రంగాపురంలో చెట్టుకు కట్టి ఊచకోత కోసి కాల్చి చంపేశారు. నాటి రజాకార్ల దురాఘాతానికి వందలాదిమంది చనిపోయారని ప్రచారంలో ఉన్నా.. 96 మంది చనిపోయినట్టు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 1947, సెప్టెంబర్ 2న జరిగిన ఈ దురాగతం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నిజాం నిరంకుశపాలన కూల్చి వేయడానికి నాంది పలికింది. 1948 సెప్టెంబరు 13న ప్రారంభమైన ఆపరేషన్ పోలో, సెప్టెంబర్ 17న నిజాం సైన్యం లొంగిపోవడంతో ముగిసింది. హైదరాబాద్ సంస్థానాన్ని భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పరకాల ఘటనను దక్షిణాది జలియన్ వాలాబాగ్‌గా వర్ణించారు. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన తల్లి చెన్నమనేని చంద్రమ్మ జ్ఞాపకార్థంగా పరకాలలో 1998లో పరకాలలో అమరధామం పేరిట ఓ నిర్మాణం చేపట్టారు. జలియన్ వాలాబాగ్ ఘటనను తలపించే పరకాల నెత్తుటి జ్ఞాపకమే అమరధామం. దాన్ని బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వానీ ఆవిష్కరించారు. ఏటా అమరధామం వద్ద స్థానిక ప్రజలు అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. **రామకిష్టయ్య సంగనభట్ల... 9440595494**

# బత్తాయికి తీపి రోజులు వచ్చేనా..!

గుర్రంపోడు : జిల్లాలో సాగవుతున్న బత్తాయి తోటల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతున్న నేపథ్యంలో.. జిల్లాలో వ్యవసాయ రైతు కమిషన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. తెగుళ్లు, చీడపీడల బారిన పడిన బత్తాయి సాగు రైతుకు పెనుభారంగా మారడం, మార్కెట్లో ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో సాగుకు రైతులు క్రమంగా దూరమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పదిహేనేళ్ల క్రితం రెండు లక్షల ఎకరాల విస్తీర్ణం నుంచి ప్రస్తుతం నలభై వేల ఎకరాలకు పడిపోయిందంటే బత్తాయి సాగుపై రైతుల అనాసక్తి, ఇబ్బందులు అర్థం చేసుకోవచ్చు. నల్గొండలో ఏర్పాటు చేసిన బత్తాయి మార్కెట్ యార్డు కూడా ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. మొదటి ఏడాది మినహా ఇక్కడ క్రయవిక్రయాలు జరగకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 29న అధికారులు. ప్రజా ప్రతినిధులు నాగార్జునసాగర్ నియోజకవర్గం నిడమనూరు మండలం ఎర్రబెల్లి,



గుంటిపల్లి గ్రామాల్లో బత్తాయి తోటలను పరిశీలించనున్నారు. 30న నల్గొండలోని కలెక్టరేట్‌లో రైతులతో సమావేశం కానున్నారు.

**ప్రభుత్వ సహకారం కోరుతున్నాం..** సిరిగిరి శ్రీనివాసరెడ్డి, బత్తాయి రైతు సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు జన్యులోపాలు, సమస్యల అప్పుల సుడి గుండంలో చిక్కుకున్న బత్తాయి రైతులు ప్రభుత్వం నుంచి మద్దతును కోరుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే సాగు మరింత పడిపోయి బత్తాయి మనుగడే ప్రమాదంలో పడుతుంది. మార్కెట్‌లోనూ ధరను మరింతగా పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# 'పట్టా'ఫట్ జరిగిపోవాలిక..!

కొత్తగూడెం: సాదాబైనామాల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. 2020లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 112 అమలును నిలిపివేస్తూ.. జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు తాజాగా ఎత్తివేసింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 1.74లక్షల మంది రైతుల నిరీక్షణకు తెరపడనుంది. అయితే 2020లో తీసుకున్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో కొత్తగా తీసుకున్న అర్జీలను సైతం క్రమబద్ధీకరిస్తారా అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. సాదాబైనామాలకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలు ఏవిధంగా ఉంటాయనేది చర్చనీయాంశమవుతోంది.

**విచారణాధికారిగా ఆర్డీఓ..** భూభారతి చట్టంలోని సెక్షన్-6 ద్వారా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. విచారణాధికారిగా ఆర్డీఓకు బాధ్యతలు అప్పగించింది. తెల్లకాగితాలపై రాసుకున్న భూ కొనుగోళ్ల ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు ఆధారంగా భూమి కొనుగోలు, అమ్మకందారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి స్థానిక రైతుల వాంగ్మూలం తీసుకుంటారు. ఇరుపక్షాల నుంచి ఏవైనా అభ్యంతరాలు వ్యక్తమైతే వాటిని విచారిస్తారు. ఎలాంటి సమస్యలు లేకుంటే భూమి కొనుగోలుదారులకు పట్టాదారు పాసుపుస్తకం జారీ చేస్తారు. సాదాబైనామా ద్వారా ఎవరికైనా అన్యాయం జరిగిందని భావిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

**గతంలో నిబంధనలు ఇలా..** 2014 కంటే ముందు భూములు కొనుగోలు చేసి ఉండాలి. ఒక్కో వ్యక్తి మెట్ట భూమి ఐదెకరాలు, తరి భూమి రెండున్నర ఎకరాలు కొనుగోలు చేసి ఉంటేనే సాదాబైనామాకు అర్హులు.ఏజెన్సీ ప్రాంతాల్లో 2014 కంటే ముందు ఎస్టీల నుంచి ఎస్టీలే కొనుగోలు చేసి ఉండాలి. గిరిజనేతరులైతే 1970 కంటే ముందు ఎస్టీల నుంచి కొనుగోలు చేసి ఉండాలి.
గిరిజనేతరుల నుంచి గిరిజనేతరులు 1970 కంటే ముందే భూమి కొనుగోలు చేసి ఉండాలి. సాదాబైనామా దరఖాస్తులు

ఖమ్మం : 1,11,449

భద్రాద్రి : 62,511

**పెరగనున్న ప్రభుత్వ ఆదాయం..**

సాదాబైనామా ప్రక్రియ పూర్తయ్యి రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు వస్తే భూముల క్రయవిక్రయాలు జోరందుకుంటాయని ప్రభుత్వం భావిస్తోంది. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల ద్వారా సర్కారుకు భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. ఏళ్ల క్రితం డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన భూములకు పట్టా లేకపోవడంతో వాటిని అమ్ముకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చేపట్టే సాదాబైనామా ప్రక్రియ ద్వారా వీటికి పరిష్కారం లభించనుంది. భూభారతి చట్టంలోని సెక్షన్-6లో సాదాబైనామా అంశాన్ని పొందుపరిచినప్పటికీ.. తెల్లకాగితాలపై రాసుకున్న భూవిక్రయాలకు ఎలా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలనే అంశంపై మార్గదర్శకాలు వెలువడలేదు. ప్రభుత్వం వాటిని వెల్లడిస్తే సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలవుతుంది. మధు, ఆర్డీఓ, కొత్తగూడెం

# బాబోయ్.. యూరియా కొనలేం.. అమ్మలేం..!

కొత్తగూడెం: యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. 40శాతం కోటా యూరియా కొద్దిమంది డీలర్ల వద్దకే వెళ్తుండటంతో అన్నదాతల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అంతగా ప్రభావం చూపని గుళికల, పురుగు మందులను అంటగడుతున్నారు. వ్యాపారులకు కాసులు కురుస్తుండగా.. రైతులకు పెట్టుబడి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. యూరియాలో మాదిరి కాంప్లెక్స్ ఎరువుల్లోనూ నత్రజని ఉంటుందని కొందరు డీలర్లు సలహా ఇస్తున్నారు. అధిక ధర కలిగిన కాంప్లెక్స్ ఎరువులను అమ్ముతున్నట్లు తెలుస్తోంది.ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో రైతులకు యూరియా భారమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా సరిపడా యూరియా అందించలేకపోతోంది. ప్రైవేటు డీలర్లకు కేటాయించే యూరియా చర్చనీయాంశమవుతోంది. ప్రైవేటు, రిటైల్ డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. యూరియా కంపెనీలు విక్రయిస్తుండటంతో పాటు ఇతర రసాయన మందులు అమ్మాలని ఒత్తిడి తెస్తున్నాయని డీలర్లు చెబుతున్నారు. యూరియాలో 60శాతం పీఏసీఎస్, డీసీఎంఎస్, ఆగ్రో తదితర కేంద్రాలకు మిగిలిన 40 శాతం ప్రైవేటు డీలర్లు, రిటైలర్లకు కేటాయిస్తారు.

**కొరవడిన పర్యవేక్షణ** ప్రైవేటు డీలర్లకు కేటాయించే 40శాతం యూరియాను రైతులు కొనుగోలు చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ప్రైవేటు డీలర్లు, రిటైలర్లు బస్తాకు రూ.266కు బదులుగా రూ.400-500 తీసుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు. అధిక ధరలకు యూరియా అమ్మటంతో పాటు గుళికలు లేదా ఇతర పురుగు మందులు అంటగడుతున్నారని వాపోతున్నారు. 40శాతం కేటాయింపుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.ప్రైవేటు డీలర్లకు కేటాయించిన యూరియా అధిక ధరకు విక్రయించకుండా కూపన్ విధానాన్ని అమలుచేస్తున్నాం. డీలర్ల వద్ద యూరియా కొనాలనుకునే రైతులు ముందుగా వ్యవసాయాధికారుల వద్ద కూపన్ రాయించుకోవాలి. కూపన్‌లో నిర్దేశించిన ధరకే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

**బాబూరావు, డీఏఓ, భద్రాద్రి కొత్తగూడెం**

యూరియా కొనుగోలుకు ఎరువుల కంపెనీలు అంతులేని లింకులు అంటగడుతున్నాయని ప్రైవేటు డీలర్లు చెబుతున్నారు. రూ.లక్ష యూరియాకు అంతే విలువైన పురుగు మందులు తీసుకోవాలనే షరతులు విధిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధిక ధరలకు యూరియా విక్రయించలేక, రైతులకు ఇతర పురుగు మందులు అంటగట్టలేక ఇల్లెందు పట్టణంలోని సుమారు పది ఎరువుల దుకాణాలు యూరియా కొనటమే మానేశాయని ఓ డీలర్ తెలిపారు.

ఆగస్టు నాటికి కేటాయించిన యూరియా

# ప్రమాదకరంగా శిథిల ఇళ్లు




కరీంనగర్ : ఆకాశానికి చిల్లులు పడినట్లే వర్షం పడుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షానికి జిల్లా అతలాకుతలంగా మారింది. కరీంనగర్ నగరపాలకసంస్థతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలిక పరిధిలో అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభంతోనే శిథిల ఇళ్లు, భవనాలపై దృష్టి సారించారు. ప్రమాదకరంగా ఉన్న కొన్ని శిథిలమైన ఇళ్లను, ప్రహరీలను పట్టణ ప్రణాళిక అధికారులు గుర్తించి.. వాటిని నేలమట్టం చేశారు.

నగరంతోపాటు విలీన గ్రామాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు సర్వే నిర్వహించి 178 శిథిలావస్థ ఇళ్లను గుర్తించి నోటీసులు జారీ చేశారు. కొందరికి స్వయంగా అందించగా, మరికొందరికి ఇంటి తలుపులకు అంటించారు. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న పాత ఇళ్లు అయిదు వరకు కూల్చివేశారు. నోటీసులతో కొందరు ఇంటి యజమానులు మరమ్మతులు చేసుకున్నారు. నివాసానికి యోగ్యంగా లేని ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో రోడ్ల మీదకు నీరు చేరి సెల్లార్లల్లోకి వస్తున్నాయి. నెల రోజుల కిందట రద్దీ ప్రాంతంలో ఒకటి మునిగింది. కనీసం మోటార్లు పెట్టి నీటిని తోడుకునే పరిస్థితి లేకుండా మారింది. ట్రాక్టర్ పంపు తీసుకొచ్చి నీటిని బయటకు పంపించారు. బహుళ అంతస్తుల్లో కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉంటుండగా, వ్యక్తిగతంగా నిర్మించుకున్న అంతస్తుల్లోని సెల్లార్‌లో కనీస జాగ్రత్తలు తీసుకోవడంలేదు.

**చర్యలు తీసుకుంటున్నాం**

శిథిలమైన ఇళ్లలో నివాసముంటే వెంటనే ఖాళీ చేయిస్తున్నాం. ప్రమాదకరంగా ఉంటే నోటీసులు ఇచ్చి కూల్చివేస్తున్నాం. ఇంకా అలాంటివి ఏవైనా ఉంటే ఒకటెండ్రు రోజుల్లో సర్వే చేసి చర్యలు తీసుకుంటాం.
వేణు, ఏసీపీ, కరీంనగర్ పట్టణ ప్రణాళిక

# వరద వేళ.. పంట జాగ్రత్త



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం వల్ల వరిసహా ఆరుతడి పంట పొలాలు ముంపునకు గురికావడం, నీరు నిలవడం చోటుచేసుకుంటున్నాయి. వర్షాల నేపథ్యంలో రైతులు పండిస్తున్న పంటల్లో పలు యాజమాన్య పద్ధతులను చేపట్టాలని జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి సూచించారు. పత్తిని నల్లరేగడి నేలల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నందున తోటలో వర్షపు నీరు నిల్వకుండా బయటకు పారేలా చూడాలి. నీరు నిలిస్తే పత్తి మొక్కలు ఎర్రబారి పోషక లోపాలు తలెత్తుతాయి. కొన్నిచోట్ల మొక్కలు కుళ్లిపోయే అవకాశముంది. వర్షాలు తగ్గిన తరువాత మొక్కలు అక్కడక్కడా కుళ్లిపోయి, ఎండిపోయినట్లు గుర్తిస్తే మెటాలాక్సిల్ 3 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రాములు లేదా కార్బండిజం 1 గ్రాము లీటరు నీటికి కలిపి కుళ్లిపోయిన మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. పోషక లోపాలతో ఆకులు ఎర్రబారితే లీటరు నీటికి 5-10 గ్రాముల వరకు నత్రజని, భాస్వరం, పొటాష్ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. ప్రధాన పంటయిన వరిలో వర్షాలతో బ్యాక్టీరియా ఎండాకు తెగులు విస్తరించే అవకాశమున్నందున నివారణకు ఎకరాకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రాములు, ప్లాంటామైసిన్ 40 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. జింకు లోప నివారణకు జింకు సల్ఫేట్ 2 శాతాన్ని పిచికారీ చేయాలి. వరి పొలం మడుల్లో నీరు నిల్వఉంటే సల్ఫైడ్ ఇంజురీ తలెత్తే అవకాశమున్నందున మురుగు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పారించాలి. ఈ వానాకాలంలో సన్నగింజ వరిరకాలు అధికంగా సాగు చేస్తున్నందున సన్నాలపై చీడపీడల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి యూరియాను పరిమితంగా వాడాలి, పొటాష్‌ను యూరియాతో కలిపి వేయాలి. కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు ఆశించకుండా వరి పొలంగట్లను కలుపులేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.పసుపులో వర్షాలతో వ్యాపించే ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1.మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కూరగాయల్లో నారుకుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి నేల తడిచేలా పిచికారీ చేయాలి. అలసంద, సోయాబీన్ తదితర అన్నిరకాల ఆరుతడి పంటల్లోనూ వర్షపు నీరు నిలవకుండా బయటకు పారేలా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు తగ్గిన తరువాత పైపాటుగా యూరియా, పొటాష్ ఎరువులను వేయాలి. సస్యరక్షణ మందుల పిచికారీని కూడా వర్షాలు తగ్గిన తరువాతనే చేపట్టాలి. వర్షాలతో చేతితో కలుపు మొక్కల తొలగింపు సాధ్యపడనపుడు ఆయా పంటలకు తగిన కలుపు నివారణ రసాయన మందులను పిచికారీ చేయాలి.

# భద్రంగా దాటు బిడ్డో..!



సూర్యాపేట : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రధానంగా పట్టణ ప్రాంత పాఠశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నారు. వీరు బడికి వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పాఠశాలల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా విద్యార్థుల రక్షణకు ట్రాఫిక్, విద్యాశాఖ, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. రోడ్డు సమీప పాఠశాలల వద్ద స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డులు, జీబ్రాక్రాసింగ్ లైన్స్, ఫుట్‌పాత్‌లు, సూచిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు కన్పించడం లేదు.

సూర్యాపేట పట్టణంలో పదుల సంఖ్యలో ప్రభుత్వ, ముప్పైకిపైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ముఖ్యంగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి, ఖమ్మంరోడ్డు, కుడకుడరోడ్డు, ఎంజీ రోడ్డు, అరవై ఫీట్ల రోడ్డు, పాత బస్టాండ్ రోడ్డు సమీపంలో అత్యధికంగా ఉన్నాయి. రహదారుల సమీపంలోని పాఠశాలల వద్ద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోదాడ పట్టణంలోని బస్టాండ్, రంగా థియేటర్, సూర్య ల్యాబ్, ఎల్ఐసీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, అనంతగిరిరోడ్డు, ఖమ్మం క్రాస్‌రోడ్డు సమీపాల్లో పాఠశాలలు ఉన్నాయి. వాటి వద్ద స్కూల్ జోన్స్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నూతనకల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు పరిసర గ్రామాలనుంచి విద్యార్థులు కాలినడకన, సైకిళ్లు, ఆటోలపై వస్తుంటారు. ప్రధాన గేటు సూర్యాపేట-దంతాలపల్లి ప్రధానరోడ్డుకు ఉంటుంది. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై పాఠశాల జోన్ బోర్డులు, రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, తెల్లరంగులతో రోడ్డుపై క్రాసింగ్ సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రమాదకరంగా ప్రధాన రోడ్డును దాటాల్సి వస్తోంది.

సిబ్బందిని పంపించి ప్రమాదాలు జరుగకుండా రోడ్డుపై సూచికలు ఏర్పాటు చేయిస్తామని ఆర్అండ్‌బీ డీఈ పద్మావతి చెప్పారు.

పాటించాల్సిన నియమాలు

ఉపాధ్యాయులు, పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు రోడ్డు దాటాలి.

జీబ్రా, పాదచారుల క్రాసింగ్‌లు ఉన్నచోటకే వెళ్లాలి.

సిగ్నల్ లైట్లు, ట్రాఫిక్ పోలీసుల సూచనలు గమనించాలి.

ఇయర్‌ఫోన్సు, మొబైల్ ఫోన్లు వాడకూడదు.

**అప్రమత్తత అవసరం**

సాయిరాం, ట్రాఫిక్ ఎస్సై, సూర్యాపేట

పిల్లలు రోడ్డు దాటేటప్పుడు వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. రోడ్డు భద్రత నియమాలను తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం పిల్లలకు తెలియపర్చాలి. రోడ్డు దాటేటప్పుడు పరుగులు తీయకుండా జాగ్రత్తగా వాహనాలను గమనిస్తూ రోడ్డు దాటాలి. రోడ్డుకు కుడి, ఎడమలను గమనించాలి.

# ఖాళీ ప్లాట్లు.. ప్రమాదాలకు నెలవు

ఆసిఫాబాద్ : నాలుగు రోజుల కిందట ఆసిఫాబాద్‌లోని పైకాజీనగర్‌లో ఉన్న ఓ ఖాళీ ప్లాట్‌లో గడ్డి మేసేందుకు వెళ్లిన ఆవు పాముకాటుతో మృతి చెందడం చుట్టుపక్కల కుటుంబాలను భయాందోళనకు గురిచేసింది. కాలనీలో చిన్న పిల్లలు సాయంత్రం వేళల్లో, పాఠశాలల సెలవు రోజుల్లో వాటి దగ్గరే ఆడుతుంటారని, ఒక్కోసారి అందులోకి వెళుతుంటారని చెబుతున్నారు. పాములు తిరుగుతుండటం, పశువు మృతితో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలిన ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పొదలు పెరిగి పాములు, ఇతర విష పురుగులకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో చుట్టు పక్కల ఇళ్ల వారు భయాందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెండు పట్టణాలతోపాటు కొన్ని మండల కేంద్రాల్లో భూములకు ఎక్కువ ధరలు పలుకుతున్నాయి. కొందరు వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. పేరుకు వెంచర్ అయినా.. అందులో ఎలాంటి మౌలిక వసతులు ఉండవు. కొందరు వారసత్వంగా, కొందరు ఇతరుల వద్ద భూములు కొనుగోలు చేసి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండానే ఖాళీగా వదిలేస్తున్నారు. వర్షాకాలంలో వాటిలో తుమ్మ చెట్లు, గడ్డి, ఇతర పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. కొన్ని లోతట్టు ప్లాట్లలో వర్షం నీరు ఎటూ వెళ్లలేక అందులోనే ఇంకి బురదతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానికులు దుర్వాసన, దోమలతో ఇబ్బందులకు గురవుతున్నామని, వ్యాధుల కాలం



నేపథ్యంలో జ్వరాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు.

**గతంలో నోటీసులు జారీ..**

గతంలో పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు నిర్వహించిన సమయంలో.. ఖాళీ ప్లాట్లు ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని అప్పటి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వారు శుభ్రత పనులు చేయించకుంటే.. పంచాయతీ/పురపాలిక ఆధ్వర్యంలో చేయించి కూలీ ఖర్చులను సదరు యజమానుల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. తరువాత ఈ అంశాన్ని అధికారులు మర్చిపోవడం, ఖాళీ ప్లాట్ల యజమానులు పెద్దగా పట్టించుకోకపోవడంతో.. చుట్టుపక్కల ఇళ్ల వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఈ విషయంపై పుర కమిషనర్ గజానంద్‌ను వివరణ కోరగా.. ఖాళీగా వదిలేసిన ప్లాట్ల చుట్టు పక్కల వారు ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎక్కడెక్కడ అంటే..** జిల్లా కేంద్రంలో పైకాజీనగర్, కంఠ కాలనీ, సందీప్‌నగర్, బజార్‌వాడి, రాజంపేట్, చెక్‌పోస్టు కాలనీ, జన్కాపూర్, కలెక్టరేట్ వెళ్లే మార్గం, గుండి రోడ్డు.. ఇలా పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు దర్శనమిస్తున్నాయి. కాగజ్‌నగర్‌లోని బాలాజీనగర్, పెట్రోల్‌పంప్ ఏరియా, ద్వారకా నగర్, కౌసర్‌నగర్, సర్‌సిల్క్‌కాలనీ, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లోనూ ఎక్కువగా ఉన్నాయి.

# రుణాలిస్తాం.. షరతులు వర్తిస్తాయి!

ఆదిలాబాద్ : 'రుణాలు అందిస్తాం.. రాయితీ మాత్రం అర్హత, నిధుల లభ్యతకు లోబడి విడుదల చేస్తామని' ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీయేతర దరఖాస్తుదారులకు తిరకాసు విధించడంతో కథ మళ్లీ మొదటికి వచ్చేలా కనిపిస్తోంది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం(పీఎం ఈజీపీ) కింద జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు అవకాశం కల్పించారు. అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలిస్తున్నారు. తొలుత గత మార్చి నుంచి ఆన్‌లైన్ స్తంభించడంతో దరఖాస్తులు స్వీకరించకపోగా నెలన్నర కిందట ఆన్‌లైన్ మొదలు కావడంతో అంతా ఊరట చెందారు. కాకపోతే ఎస్సీ, ఎస్టీలకు మాత్రం అవకాశం కల్పించి బీసీ, మైనార్టీ, జనరల్ కేటగిరీ వర్గాలకు అవకాశం ఇవ్వలేదు. కేంద్రస్థాయిలో ఒత్తిళ్లు రావడంతో మునుపటిలాగే అన్నివర్గాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించి ఊరటనిచ్చినా రాయితీపై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**డెయిరీ, సిమెంటు ఇటుకల తయారీ**

ఏటా డెయిరీ ఫాంల ఏర్పాటు, ఇటుకల తయారీ, సిమెంటు పైప్‌లు, ప్రీకాస్ట్ వాల్‌లు, బ్రెడ్ తయారీ, పప్పుమిల్‌లు, ఎంబ్రాయిడరీ దుకాణాలు, ఇతరత్రా యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 41 యూనిట్లకు రూ.1.50 కోట్ల వరకు రుణం మంజూరైంది. మరో 43 యూనిట్లకు సంబంధించి దరఖాస్తులు బ్యాంకర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి పరంగా ఎన్నో రకాలుగా చేయూతనిస్తున్న ఈ రుణాల్లో తిరకాసు విధించడంతో నిరాశ తప్పడం లేదు.

**ప్రయోజనమిలా..**

ఈ పథకం కింద ఏటా దాదాపు వంద మంది వరకు రుణాలు పొందుతున్నారు. తయారీ రంగానికి(పరిశ్రమలకు) గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు, సేవా రంగం(సర్వీస్ సెక్టార్)కు రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతవాసులైతే 35 శాతం రాయితీ, అదే పట్టణ ప్రాంతాల్లో 25 శాతం రాయితీ వర్తింపజేస్తారు. ఇందులో అన్నివర్గాల ప్రజలకు అవకాశం కల్పించారు. జనరల్ కేటగిరీ(ఓసీ) పురుషులైతే మాత్రం పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, గ్రామాల్లో 25 శాతం రాయితీ వస్తుంది.

**మొదట్లోనే.. నిబంధన**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీలైతే ఎలాంటి నిబంధనలు సూచించడం లేదు. బీసీ, మైనార్టీ, ఓసీలకు మాత్రం రాయితీపై ప్రత్యేక నిబంధన వస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పద్మభూషణ్‌రాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రాయితీ వస్తుందా..? రాదా..? అనేది చెప్పలేమని వివరించారు.

## తొలగనున్న అంతరాయం.. ప్రయాణం వేగవంతం

తాండూరు: జిల్లాలోని తాండూరు, వికారాబాద్, ధారూర్, బషీరాబాద్, మంతటి, రుక్మాపూరు, గోధుమగూడ రైల్వే స్టేషన్ల నుంచి ఇక అంతరాయం లేకుండా రైలు ప్రయాణాలు సాగనున్నాయి. దీనికితోడు సరకు రవాణా రైళ్లు నిర్ణీత స్టాప్‌లో తప్ప ఎక్కడా ఆగవు. ప్రయాణికులు, సరకు రవాణాకు ప్రయోజనం కలిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కర్ణాటక, తెలంగాణ, బిహార్, అసోం రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్‌తోపాటు సుదూర ప్రాంతాన్ని అనుసంధానించే రైలుమార్గం నిర్మించడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం నిర్ణయం తీసుకొంది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్–వాడి మార్గంలో కొత్తగా 3, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

**సిమెంటు కర్మాగారాలకు ప్రయోజనం..:** కొత్తగా మరో రెండు రైల్వేలైన్ల నిర్మాణంతో తాండూరులోని సిమెంటు కర్మాగారాలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. తాండూరు సమీపంలో సీసీఐ, ఇండియా సిమెంట్స్, పెన్నా.. సమీపంలోని కర్ణాటక రాష్ట్రంలో వికాట్‌సాగర్, చెట్టినాడు సిమెంటు కర్మాగారాలున్నాయి. వీటికి సికింద్రాబాద్– వాడి మార్గం నుంచే గూడ్సు రైళ్ల ద్వారా బొగ్గు, క్లింకర్ తదితర ముడి



సరకు దిగుమతి అవుతుంటుంది. కర్మాగారాల్లో ఉత్పత్తి అయిన సిమెంటు గూడ్సురైళ్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు. లైన్లు పెరగనుండడంతో రవాణా వేగవంతం కానుంది. ప్రజల ప్రయాణాలకు ఆటంకాలు తొలగనున్నాయి.

**ప్రస్తుతం రెండే లైన్లు..:** సికింద్రాబాద్– వాడి మార్గంలో ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉన్నాయి. ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగించే వేళ గూడ్సు రైళ్లు గంటల తరబడి ఆగాల్సి వస్తోంది. కొన్నిసార్లు ప్రయాణికుల రైళ్లూ స్టేషన్‌లోనే నిలిచిపోతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి 1, 2వ లైన్లకు అదనంగా 3, 4 నిర్మించనున్నారు. రెండు లైన్లపై నుంచి ప్రయాణికులకు సంబంధించినవి, మరో రెండు లైన్లపై గూడ్సు రైళ్లు రాకపోకలు సాగిస్తాయని రైల్వేశాఖ ఇంజినీరు తెలిపారు.

## బియ్యమిస్తాం.. స్థలమేదీ?

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లు సిద్ధంగా ఉన్నా.. ఖాళీ స్థలాలు లేక సంబంధిత ఏజెన్సీలు తీసుకోని విచిత్రమైన పరిస్థితి నెలకొంది. 2024–25 వానాకాలంలో సేకరించిన ధాన్యానికి మే 15 వరకు సీఎంఆర్ ఇవ్వడానికి గడువు ఇచ్చారు. ఈ లోపు చాలా మంది చెల్లించలేదు. ఎఫ్‌సీఐ తిరిగి అనుమతి ఇవ్వకుండా మూడు నెలల పాటు జాప్యం చేసింది. మిల్లులు నడవలేదు. మూడు నెలల తదుపరి సెప్టెంబరు 12 వరకు పొడిగిస్తూ ఎఫ్‌సీఐ ఆగస్టు 12న ఉత్తర్వులు ఇచ్చింది. స్వల్పకాలంలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.గత వానాకాలంలో జిల్లాలో 2.20 లక్షల ఎంటీల ధాన్యం ఇవ్వగా మిల్లర్లు 1.50 లక్షలు ఎంటీల సీఎంఆర్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. కానీ మే 15 వరకు 1.04 లక్షల ఎంటీలు చెలించారు. ఇంకా సుమారు 46 వేల టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కానీ సెప్టెంబరు 12 వరకు సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు.బియ్యం నిల్వ చేసేందుకు ఎఫ్‌సీఐ వద్ద స్థలం లేక ప్రక్రియ వేగంగా జరగడం లేదు. మిల్లులలోనే వేల బస్తాల బియ్యం పేరుకుపోయింది. ఒక్కో మిల్లులో సుమారు 150 నుంచి 200 టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు అంచనా.

భువనగిరి మండంలోని నాగిరెడ్డిపల్లి బఫర్ గోదాంలో ఎఫ్‌సీఐకి సుమారు 50 వేల ఎంటీల నిల్వ చేసే స్థలం మాత్రమే ఉంది. ఇప్పటికే



పూర్తిస్థాయిలో నిండిపోయింది. అక్కడికి వ్యాగన్లు వచ్చి నిల్వలు తరలిస్తే తిరిగి బియ్యం సేకరించే అవకాశం ఉంది.

ఇక రబీ సీజన్‌లో కూడా 3.70 లక్షల ఎంటీల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం 42 మిల్లులకు ఇచ్చారు. 2.58 లక్షల ఎంటీల బాయిల్డ్ రైస్‌ను మిల్లర్లు తిరిగి పెట్టాలి. ఇప్పటి వరకు సుమారుగా 87 వేల టన్నులు సీఎంఆర్‌ను సేకరించారు. దీనికి కూడా స్థలం లేక మిల్లర్లు సీఎంఆర్ పెట్టలేకపోతున్నారు. జిల్లాలోని మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం రోజుకు 4 నుంచి 12 ఎంటీల వరకు ఉంది. ఆ మేరకు ఎఫ్‌సీఐకి నిల్వ సామర్థ్యం లేదు. బియ్యం సేకరణ ఆలస్యమైతే పక్కదారి పట్టే అవకాశం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. స్థలం కేటాయింపునకు ఎఫ్‌సీఐ అధికారులతో సంప్రదిస్తున్నామని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గోపిరెడ్డి వీరారెడ్డి తెలిపారు.

## అలలు ఎగిసే... మది మురిసే



నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద కొనసాగుతుండటంతో అధికారులు 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 3,18,791 క్యూసెక్కుల నీరు జలాశయానికి వస్తుంది. సాగర్ నుంచి 26 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 2,01,604, ప్రధాన విద్యుత్తు కేంద్రం ద్వారా 33,454, కుడి కాల్వ ద్వారా 9,019, ఎస్సెల్బీసీ ద్వారా 2,400, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం ప్రస్తుతం 586.70 అడుగుల వద్ద ఉంది. ఇది 303.9495 టీఎంసీలకు సమానం. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో వర్షాలు పడుతుండటంతో ఎడమ కాల్వకు నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

## ప్లా'స్టిక్' అయితే ప్రమాదమే



హైదరాబాద్: ప్లాస్టిక్ అనర్థాల వల్ల కలిగే నష్టాల్లో మహానగరం కూరుకుపోయింది. రోజువారీ ఉత్పత్తయ్యే ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం రోజుకు రోజుకు పెరుగుతోంది. అందులో సగానికిపైగా భూమిలోనే కలుస్తోంది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాలను ప్లాస్టిక్ మహమ్మారి ముంచేస్తోంది. నగర వాతావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ముంపు సమస్యకు ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రధాన కారణమని ఇంజినీరింగ్ విభాగం, పారిశుధ్య విభాగాలు ఉమ్మడిగా చేపట్టిన సంయుక్త అధ్యయనంలో స్పష్టమైంది.

**చెరువులు, నాలాలు కలుషితం**


చెత్తలో పడుతోన్న ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే అధికారులు లెక్కగట్టారు. చెరువులు, నాలాల్లోకి చేరుతోన్న ప్లాస్టిక్ వ్యర్థాలు వాటికి అదనం. అవి పూడిక మట్టిలో కలిసిపోతున్నాయి. బల్దియా చేపట్టే పూడికతీత పనులతో కొంత ప్లాస్టిక్ డంపింగ్‌యార్డుకు చేరుతుండగా.. మెజారిటీ వ్యర్థాలు జలవనరుల్లో ఉండిపోతున్నాయి. నేలపై ఒక పొరలా ఏర్పడుతున్నాయి. కల్వర్టులను, పైపులైన్లను పూడ్చేస్తున్నాయని ఇంజినీరింగ్ విభాగం ఆందోళన వ్యక్తం చేసింది.

**స్వచ్ఛ ఆటోలతో ప్రయోజనం..**

ఇంటింటి చెత్త సేకరణలోని స్వచ్ఛ ఆటోలకు చెత్తను ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉంది. ఆటో కార్మికుల కోసం నగరంలో వేర్వేరు చోట్ల జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎసీ(డ్రై రిసోర్స్ సెంటర్స్)లను నిర్మించింది. ఆటోలోని వ్యర్థాలను అందులో పోసి.. ప్లాస్టిక్, గాజు, లోహం, కర్ర, కాగితం వంటి రీసైకింగ్‌కి పనికొచ్చే వ్యర్థాలను కార్మికులు వేరు చేస్తారు. తద్వారా రోజూ 30 టన్నుల రీసైక్లింగ్ వస్తువులు పునర్వినియోగానికి మళ్లుతున్నాయి.

**పెరుగుతున్న చెత్త..**నగరంలో 2019లో రోజువారీ ఉత్పత్తయ్యే చెత్త పరిమాణం 3,800 టన్నులు ఉండేది. అప్పట్లో సగటున ఒక వ్యక్తి ఉత్పత్తి చేసే వ్యర్థాలు 570 గ్రాములు. ప్రస్తుతం రోజూ 8 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో సగటు వ్యక్తి ఉత్పత్తి చేసే చెత్త 733 గ్రాములు. ఒక కుటుంబం 2.2 కేజీల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోంది. ఇప్పటికే జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డు కిక్కిరిసిపోయింది. వ్యర్థాలను నిల్వ చేసేందుకు స్థలం లేక అధికారులు నానా అవస్థలు పడుతున్నారు.**పరిష్కారం ఏంటంటే..** ఇటీవలి వరదలతో బల్దియా పారిశుధ్యం, ఇంజినీరింగ్ విభాగాలు ప్లాస్టిక్ ముప్పుపై చేపట్టిన అధ్యయనం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ప్లాస్టిక్ నియంత్రణ, వరద నాలాల విస్తరణ, చెరువుల పునరుద్ధరణ, కొత్త వ్యర్థాల యాజమాన్య కేంద్రాలు ఏర్పాటు, చెత్త నుంచి విద్యుదుత్పత్తి కేంద్రాలను నగరం నలువైపులా నిర్మించే కార్యక్రమాలను కమిషనర్ వేగవంతం చేస్తున్నారని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

## మాఫ్ పేరుతో సాఫ్



హైదరాబాద్ : బల్దియాలో ఇంటి దొంగలున్నారని మరోసారి తేలింది. ఉన్నతాధికారుల కళ్లుగప్పి చందానగర్ సర్కిల్‌లోని పౌర సేవా కేంద్రం (సీఎస్‌సీ) ఉద్యోగిని రూ.56 లక్షలు కాజేసింది. ఆడిట్ అధికారులు గుర్తించడంతో ఒకరోజు వ్యవధిలోనే ఆమె మొత్తం డబ్బును తిరిగి చెల్లించింది. అయితే అంతా ఒకేసారి చెల్లించడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇక్కడే కాదు.. ఇతర సర్కిళ్లలోని పౌర సేవా కేంద్రాల్లోనూ ఈ తరహా దోపిడీ జరుగుతోంది. నోటరీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇవ్వడం, ఆస్తిపన్ను మొండి బకాయిలను మాఫీ చేసే పథకాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో భాగంగా పౌరులు చెల్లించే పన్నులు, రుసుములను సీఎస్‌సీ కేంద్రాల్లో ఉద్యోగులు మాయం చేస్తున్నారు. బల్దియా ఖజానాలో జమ కావాల్సిన నిధులతో జేబులో నింపుకొంటున్నారు.

**రూ.కోట్లలో దోపిడీ..**

సూపర్ స్ట్రక్చర్స్, వీఎల్‌టీ రూపంలో వచ్చే ఆదాయాన్ని కొందరు అధికారులు, సిబ్బంది మింగేస్తున్నారు. ఏటా రూ.10 కోట్లతో జేబు నింపుకొంటున్నారని అంచనా. ఆస్తిపన్ను బకాయిలో సగం చెల్లిస్తే మొత్తం మాఫీ చేస్తామంటూ కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. మరికొందరు.. వాస్తవ విస్తీర్ణాన్ని తగ్గించి పన్ను విలువను తక్కువ చేస్తున్నారు. అనుమతి లేకుండా కట్టే అదనపు అంతస్తులు, అపార్ట్‌మెంట్లకు నామమాత్రపు పన్ను వేస్తున్నారు. వ్యాపార భవనాలను ఇళ్లుగా చూపుతున్నారు. నోటరీ పత్రాలతో క్రయవిక్రయాలు జరిగే వందలాది కాలనీల్లో జారీ అవుతోన్న ఇంటి నంబర్లే నిదర్శనం. ఇటీవల మూసాపేట, అల్వాల్ సర్కిళ్లలోనూ నకిలీ ఇంటి నంబర్ల ఉదంతాలు వెలుగు చూశాయి. వాటన్నింటినీ నియంత్రిస్తే ఆదాయం పెరుగుతుంది.

**లావాదేవీలు తనిఖీ చేయడంతో..**

జీహెచ్‌ఎంసీ మూడేళ్ల కిందట ఆస్తిపన్ను చెల్లింపును నగదు రహితం చేసిందిగానీ.. జీవో 299 ద్వారా సూపర్ స్ట్రక్చర్స్ (నోటరీ స్థలాలు, అనుమతి లేని నిర్మాణాలు, అదనపు అంతస్తులు)కు ఆస్తిపన్ను మదించే ప్రక్రియను, ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) వసూళ్లను అందులో చేర్చలేదు. అదే అదనుగా.. బల్దియా సిబ్బంది, అవినీతి అధికారులు రెచ్చిపోతున్నారు. సర్వేల పేరుతో కనిపించిన ప్రతి ఇంటికి నోటీసు ఇవ్వడం, పన్ను కట్టలేదని, ఇంటి నంబర్లు లేవని యజమానులను బెదిరిస్తున్నారు. వారి నుంచి మూడేళ్ల కాలానికి పన్ను వసూలు చేస్తున్నారు. కొందరు నిబంధనల ప్రకారం పన్ను మదింపు చేస్తున్నారు. మరికొందరు పన్ను మదింపును వసూళ్లకు వాడుకుంటున్నారు. సీఎస్‌సీ కేంద్రాల్లో పన్ను చెల్లించినట్టు రసీదులు సృష్టించి, వాటితో పన్ను మదింపును పూర్తి చేస్తున్నారు. చందానగర్‌లో వెలుగు చూసిన ఉదంతం ఈ కోవలోనిదే. ఇటీవల సీఎస్‌సీ కేంద్రం లావాదేవీలను ఆడిట్ చేసిన అధికారి.. తన ఇంటికి సంబంధించిన లావాదేవీ కనిపించకపోవడంతో కంగుతిన్నారు. లోతుగా విచారణ చేయగా దాదాపు 250కిపైగా ఇంటి నంబర్లకు సంబంధించిన రూ.56 లక్షల పన్ను జీహెచ్‌ఎంసీ ఖాతాలో జమ కానట్లు తేలింది. గత ఉపకమిషనర్ హయాంలో నకిలీ ఇంటి నెంబర్ల జారీ పెద్దఎత్తున జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆయన బదిలీ అవడంతో అవకతవకలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని, ఇతర సర్కిళ్లలోని సీఎస్‌సీ కేంద్రంల్లోనూ ఆడిట్ చేసి, 2020 నుంచి జరిగిన లావాదేవీలను పరిశీలించాల్సి ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై సర్కిల్ ఉపకమిషనర్ శశిరేఖ స్పందిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని 15 ఏళ్లుగా పనిచేస్తోందని, ఏం జరిగిందో తెలుసుకునేందుకు విచారణ చేపట్టామని, నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## సంసార సాగరం.. గొడవలతో కల్లోలం




వికారాబాద్ : 'మా ఆయన రోజంతా బాగానే ఉంటాడు. సాయంత్రం కాగానే మద్యం తాగి అకారణంగా గొడవపడతాడు. పరుష పదజాలంతో దూషిస్తాడు. ఆ మాటలకు నలుగురిలో తలెత్తుకోలేని పరిస్థితి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా పరిస్థితిలో మార్పు లేదు. గత్యంతరం లేక మహిళా ఠాణాను ఆశ్రయించా."మాకు పెళ్లయి 20 ఏళ్లు దాటింది. ఇద్దరు సంతానం. నా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని నన్ను వేధింపులకు గురిచేస్తున్నాడు. పెద్దల సమక్షంలో సర్దిచెప్పినా ప్రవర్తనలో మార్పు లేదు. విసిగిపోయి ఠాణాను ఆశ్రయించా.'.. ఇదీ పలువురు మహిళల ఆవేదన.నిండు నూరేళ్లు కలిసిమెలిసి ఉంటామని ఒక్కటైన దంపతులు తగవులతో విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహిళా ఠాణాకు రోజుకు సగటున 2–3 ఫిర్యాదులు చొప్పున నెలకు 80 వరకు వస్తున్నాయి. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్నిసార్లు గత్యంతరం లేకపోవడంతో కేసులు నమోదు చేస్తున్నారు.

**ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక..**

ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక వేరుగా జీవించాలని చాలామంది మహిళలు భావిస్తున్నారు. దీంతో భార్యాభర్తల సమస్యలు పరిష్కరించే వారు లేకపోవడంతో అంతరాలు పెరుగుతున్నాయి. అవి పెద్దవై కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ప్రేమ పెళ్లిల్లు చేసుకున్నవారు చిన్న విషయాలకే ఠాణాలను ఆశ్రయిస్తున్నారు. మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. జీవిత భాగస్వామిపై అనుమానంతో గొడవలు పెట్టుకుంటున్న వారూ ఎక్కువగానే ఉంటున్నారు. మద్యం చాలా కాపురాల్లో చిచ్చు రేపుతోంది. మహిళా ఠాణాకు వచ్చే 30 శాతం కేసుల్లో మద్యం కారణంగా సమస్యలు తలెత్తి విడిపోవాలనుకుంటున్నారు. జీవిత భాగస్వామి సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉంటున్నారని మరికొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. నిరక్షరాస్యత, పేదరికం వివాదాలకు కారణమవుతున్నాయి. ఇలాంటివన్నీ 20 శాతం వరకు ఉన్నాయి.

**చాలా విషయాల్లో నచ్చజెపుతున్నాం..**

– సరోజ, సీఐ, మహిళా ఠాణా, వికారాబాద్

భార్యాభర్తలకు నచ్చజెప్పే పద్ధతి అనుసరిస్తున్నాం. కుటుంబ పెద్దల తరహాలోనే మాట్లాడుతున్నాం. దంపతులిద్దరితో మొదట వేర్వేరుగా మాట్లాడి సమస్య తెలుసుకుంటున్నాం. తరువాత ఇద్దర్నీ కూర్చోబెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. కౌన్సెలింగ్ అనంతరం దాదాపు 90 శాతం మంది కలిసి ఉండడానికి మొగ్గు చూపుతున్నారు. కొందరే న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు.

## వాగుల్లో కాసుల వేట

బొంరాస్‌పేట: ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వివిధ అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకొని వేసవిలో ఇష్టారీతిన ఇసుక తరలించి సొమ్ము చేసుకున్న వ్యాపారులు వర్షాలు ప్రారంభమయ్యాక కొద్దికాలం మిన్నకుండిపోయారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ, ప్రైవేటు పనులు జోరుగా సాగుతుండడంతో అక్రమ రవాణాకు మళ్లీ తెరలేపారు. అధికారులు కేసులు చేస్తున్నా.. జరిమానాలు విధిస్తున్నా లెక్కచేయడం లేదు.

**వర్షాలతో పుష్కలంగా..**

వర్షాలు సమృద్ధిగా కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో ఇసుక భారీగా మేటలు వేసింది. కాగ్నాతోపాటు చిన్న వాగుల్లోనూ ఇసుక పేరుకుంది. ఆ నిల్వలను తరలించడానికి అక్రమార్కులు ప్రణాళికలు వేసుకొని అమలు చేస్తున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. రాత్రిపూట కాకరవాణి వాగు నుంచి ట్రాక్టర్లలో మైదాన ప్రాంతానికి తెచ్చి నిల్వ చేస్తున్నారు. అదేరాత్రి టిప్పర్లు, లారీల్లో లోడు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ట్రాక్టర్ల యజమానులూ మహంతిపూర్, మద్దిమడుగు, బొంరాస్‌పేట శివారు ప్రాంతంలోని వాగు పరివాహకం నుంచి ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.3500 నుంచి రూ.4వేల వరకు ధర పలుకు



తోంది. వర్షాకాలం కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువగా నిర్మిస్తుండడంతో ఇసుకకు గిరాకీ పెరిగింది.

**రాత్రికి రాత్రే తరలింపు**

గతంలో అనుమతులు తీసుకొని వాటినే మళ్లీ మళ్లీ చూపుతూ.. దోపిడీకి పాల్పడేవారు. ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. పగలు వాగు నుంచి తరలించి నిల్వ చేస్తే అధికారులు పట్టుకుంటున్నారని రూటు మార్చారు. దేవులానాయక్ తండా సమీపంలో రాత్రి వాగు నుంచి తరలించి టిప్పర్లలోకి నింపి రవాణా చేస్తున్నారు. మే నెలలో రెండు, జులై, ఆగస్టులో నాలుగేసి చొప్పున ఇసుక తరలించే వాహనాలను పట్టుకొని పోలీసులు కేసులు నమోదు చేశారు. పెడచెవిన పెట్టిన అక్రమార్కులు మళ్లీ అదే పనిలో నిమగ్నమవుతున్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా..** –పద్మావతి, తహసీల్దార్

ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. ఎవరైనా తరలిస్తే విచారణ చేయిస్తాం. ఎక్కడినుంచైనా అక్రమంగా తరలిస్తే వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగిస్తాం. అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానాలూ విధిస్తున్నాం.

## హద్దులు తేల్చరు.. ఆక్రమణలు ఆగవు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామంలో అటవీ భూమిని ఆక్రమించారంటూ ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అది తమ పూర్వీకుల నుంచి వచ్చిందేనని, అటవీ అధికారులు తమను దూషించారంటూ సాగుదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, అటవీ శాఖ భూముల మధ్య హద్దులు తేలకపోవడంతో పరస్పరం కేసులు నమోదయ్యాయి. జిల్లాలో చాలా అటవీ గ్రామాల్లో ఇదే పరిస్థితి.

**పట్టాలు కొంత. కబ్జా కొండంత**

2005లో అటవీ హక్కుల చట్టం పథకం ద్వారా గిరిజనులు, గిరిజనేతరులకు 424 ఎకరాలకు పట్టాలు అందించారు. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో 166 మందికి 332.14 ఎకరాలు, మంగెళలో 60 మందికి 87.18 ఎకరాలు, తుంగూర్‌లో 13 మందికి 14.12 ఎకరాలకు సంబంధించి అటవీ భూములకు పట్టాలు అందించారు. చర్లపల్లి, తంగూర్, కందెనకుంట, కమ్మునూర్, రంగసాగర్, కండ్లపల్లితో పాటు ప్రతి గ్రామంలో వందల ఎకరాల్లో అటవీ భూమిని అక్రమంగా సాగు చేసుకుంటున్నా వివరాలు తేలడం లేదు. పోడు భూముల వివరాల సేకరణలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సర్వే చేపట్టారు. అప్పట్లో 11 మండలాల్లోని 53 గ్రామాల్లో 9,437 ఎకరాల పోడు భూముల కోసం 4,829 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే సమయంలో మరింత ఆక్రమణకు గురైంది.

**శాఖల మధ్య సమన్వయ లోపం**

జిల్లాలో 59,735 హెక్టార్లలో అటవీ భూములుండగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 12,789 హెక్టార్లలో ఉంది. రెవెన్యూ శాఖలోని లొసుగులే ఆసరాగా కొన్నేళ్లుగా 6,684.16 ఎకరాల్లో అటవీ భూములను ఆక్రమించినట్లు అధికారులు ప్రకటించారు.



ఇందులో అత్యధికంగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 4,120 ఎకరాలుందని రెవెన్యూ శాఖ నిర్వహించిన భూ ప్రక్షాళనలో తేల్చారు. బీర్‌పూర్‌లో 3,662 ఎకరాలు, సారంగాపూర్‌లో 458.35 ఎకరాలు వివాదంలో ఉన్నట్లు భూ ప్రక్షాళనలో చూపారు.

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఏళ్లు గడుస్తున్నా సర్వే చేపట్టడం లేదు. సారంగాపూర్, బీర్‌పూర్, మెట్‌పల్లి తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో అటవీ భూమి ఆక్రమణకు గురవుతోంది.

బీర్‌పూర్ మండలం చర్లపల్లిలో 850 ఎకరాలు, తాళ్లధర్మారంలో 1082 ఎకరాలు, తుంగూర్‌లో 305 ఎకరాలు, కమ్మునూర్‌లో 290.11 ఎకరాలు, నర్సింహులపల్లెలో 140 ఎకరాలు, కండ్లపల్లిలో 40 ఎకరాలు, బీర్‌పూర్‌లో 19, రేకులపల్లెలో 80 ఎకరాలు వివాదంలో ఉన్నట్లు గుర్తించారు. రెండు శాఖల భూములకు హద్దులు నిర్ణయించక పోవడంతో అటవీ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది.

**రెవెన్యూ అధికారులను తరచూ కోరుతున్నాం**

ఆక్రమణకు గురైన అటవీ భూముల హద్దులు తేల్చాలని రెవెన్యూ అధికారులను పదే పదే కోరుతున్నాం. హద్దులు నిర్ణయిస్తే అటవీ శాఖదని తేలితే స్వాధీనం చేసుకుంటాం. ప్రస్తుతం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి, భూములు స్వాధీనం చేసుకుంటున్నాం. హద్దుల ఏర్పాటుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

శ్రీనాథ్, అటవీ శాఖ రేంజి అధికారి

# కోతలు కాదు.. కొలతలు పెరగాలి..!

కొత్తగూడెం: పరిహార అటవీకరణ నిధి నిర్వహణ, ప్రణాళిక ప్రాధికార సంస్థ(కాంపా) నిధులతో చేపడుతున్న పనులు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మిశ్రమ ఫలితాలు ఇస్తున్నాయి. ఒకవైపు అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తుంటే.. మరోవైపు విచ్చలవిడిగా పోడు చేయటంతో లక్ష్యం నీరుగారుతున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులు, ఆక్రమణల వల్ల హరించుకుపోతున్న అటవీ భూములకు పరిహారంగా ఉభయ జిల్లాల్లో చేపడుతున్న అటవీకరణ యత్నాలు క్రమంగా పురోగతి సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**క్రమేణా తగ్గుతున్న అటవీ విస్తీర్ణం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అడవుల విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామిక ప్రాంతాలు విస్తరించటంతో పాటు పోడు సమస్య అటవీ విస్తీర్ణంపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2021-23 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణం తగ్గిన జిల్లాల జాబితాలో ఆదిలాబాద్(-115.50 చ.కి.మీ) తర్వాత భద్రాద్రి జిల్లా(-95.55 చ.కి.మీ) రెండోస్థానంలో నిలవగా.. ఖమ్మం (-25.76 చ.కి.మీ) ఏడో స్థానంలో ఉంది.

**అరకొరగా కేటాయింపులు..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు కాంపా నిధుల కేటాయింపుల్లో కోతలే అధికంగా ఉంటున్నాయి. భద్రాద్రి జిల్లా అటవీ అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.100.57కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే.. రూ.30.62కోట్లు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాకు రూ.8.46కోట్లు



కేటాయించగా.. గత మార్చి నాటికి రూ.3.71కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి భద్రాద్రికి రూ.30.47కోట్లు, ఖమ్మం జిల్లాకు 7.73కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు డీఎఫ్‌ఓలు కిష్టాగౌడ్, సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ ఏడాది నిధుల కేటాయింపు ఏ విధంగా ఉంటుందనేది వచ్చే నెలలో తేలనుంది.

**అడవుల పెంపకంపై ప్రత్యేక దృష్టి**

గతంలో మంజూరైన కాంపా నిధులతో సోలార్ పంప్‌సెట్లు, నీటికుంటలు, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణంతో పాటు బేస్‌క్యాంపు సిబ్బందికి జీతభత్యాలు చెల్లించేవారు. ఈఏడాది కేటాయించే నిధులతో కేవలం ప్లాంటేషన్ల పెంపకం, ఫెన్సింగ్ వంటివి మాత్రమే చేపట్టేలా మార్గదర్శకాలు వెలువడినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. సింగరేణి గనులు, రహదారుల నిర్మాణం, ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం ఏమేరకు అటవీ విస్తీర్ణం కోల్పోతే అంతే మొత్తం అడవులను పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. నర్సరీలు, ప్లాంటేషన్ల పెంపకంపై జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో పకడ్బందీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ ఏడాది కాంపా నిధుల కేటాయింపుల్లో నూతన విధానం అమలు చేస్తున్నారు. గతంలో ఆఫ్‌లైన్‌లో ప్రతిపాదనలు స్వీకరించగా.. ఈసారి ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియ చేపట్టారు. ఏటా జూన్-జులైలో నిధులు విడుదలయ్యేవి. ఈసారి ఆలస్యమవుతోంది. ఈఏడాది నర్సరీలు, ప్లాంటేషన్లు పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించనున్నాం. సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ, ఖమ్మం

# బలిపీఠంపై బాల్యం

ఖమ్మం: ఆడుతూ.. పాడుతూ.. చదువుతూ గడపాల్సిన బాల్యం మూడు ముళ్లకు బందీ అవుతోంది. లోకం పోకడ తెలియకముందే పుత్తడి బొమ్మలకు వివాహాలు చేస్తుండటంతో చిన్న వయస్సులోనే తల్లులై మానసికంగా, శారీరకంగా కుంగిపోతున్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నా.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో బాల్యవివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని అడ్డుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.

అడ్డుకుంటున్నారిలా..బాలబాలికల సంరక్షణకు మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో గ్రామ, మండల, జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటయ్యాయి. చైల్డ్‌లైన్ నంబర్(1098)కు వస్తున్న ఫోన్‌కాల్స్ ద్వారా బాల్యవివాహాలను ఆపుతున్నారు. గతేడాది ఉభయ జిల్లాల్లో 116 (ఖమ్మంలో 66, భద్రాద్రిలో 50) బాల్యవివాహాలను అడ్డుకున్నారు. పదేళ్లలో ఖమ్మం జిల్లాలో 438 మంది, భద్రాద్రి జిల్లాలో 229 మంది చిన్నారి పెళ్లికూతుళ్లు బలిపీఠం ఎక్కకుండా ఆపారు. చిన్నారి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో శారీరక మార్పులు, ఆన్‌లైన్, లైంగిక వేధింపులు, పిల్లల అక్రమ రవాణా, బాల్యవివాహాల అనర్థాలు, మంచి-చెడు స్పర్శ, మాదకద్రవ్యాల ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల్లో డ్రాపవుట్ అవుతున్న, ఎక్కువ రోజులు గైర్హాజరైన బాలికలను గుర్తించి ఆరా తీస్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

**ఖమ్మం జిల్లాలో..**2021లో 28, 2022లో 90, 2023లో 36, 2024లో 66, 2025లో జూన్ వరకు 39 బాల్యవివాహాలను అడ్డుకున్నారు. నిరక్షరాస్యత, ఆర్థికంగా వెనుకబాటు, కుటుంబ సమస్యలు, పేద కుటుంబాల్లో పిల్లల పోషణ భారమవటం, జీవనోపాధికి తల్లిదండ్రులు పట్టణాలకు వలసవెళ్లడం, పెళ్లి చేస్తే బాధ్యత తీరుతుందని భావించటం, ఉన్నత చదువులు చదివించే స్తోమత, ఆసక్తి లేకపోవటం, ఒంటరి తల్లి లేదా తండ్రి కుటుంబాల్లో ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు తదితరాలతో బాల్యవివాహాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

**పటిష్ఠ కార్యాచరణ** ప్రయోగాత్మకంగా ఖమ్మం, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో పదేసి గ్రామాల చొప్పున ఎంపికచేసి బాల్యవివాహ రహిత గ్రామాలుగా మార్చాలని సర్కారు నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో 2022 నుంచి ఈఏడాది జూన్ వరకు తరచూ బాల్యవివాహాలు జరుగుతున్న గ్రామాలను అధికారులు గుర్తించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు జన్నారం(ఏన్కూరు మండలం)లో 4, ఖమ్మం అర్బన్‌లో 22, సింగరేణి బీసీకాలనీలో 3, శంకిగిరితండా(నేలకొండపల్లి)లో 4, మధిరలో 3, మాటూరు(మధిర)లో 3 వివాహాలను అడ్డుకున్నారు. మరో నాలుగు గ్రామాల్లో తరచూ బాల్యవివాహాలు జరుగుతున్నట్లు ఫోన్లు రావటంతో నిలిపేశారు.

# నడవనివ్వని కాళ్లు.. కాలుతున్న ఒళ్లు..!



నల్గొండ : జిల్లాలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురువకపోయినా.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది ప్రాంతం కాలువలు, కుంటలు నిండటంతో పాటు దోమలు విపరీతంగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలువలు చిత్తడిగా మారుతున్నాయి. జిల్లా అంతటా సీజనల్ వ్యాధులు గుప్పుమంటున్నాయి. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రితో పాటు ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జనరల్ ఆసుపత్రిలో సాధారణంగా రోజుకు 550 నుంచి 650 వరకు ఉండే ఓపీ నాలుగు రోజుల నుంచి 800కి చేరింది. ఐపీ రోగులు 600 మందికి పైగా ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండని కారణంగా ప్రైవేట్ బాట పడుతున్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, చందంపేట, డిండి, మల్లేపల్లి, దామరచర్ల ప్రాంతాల నుంచి జ్వర పీడితులు ఆసుపత్రులో ఎక్కువగా చేరుతున్నారు.

చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానంగా ఒళ్లు, గొంతునొప్పులు, జలుబు, దగ్గు, సాధారణ జ్వరాలకు సంబంధించిన పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారని వైద్యుడు సత్యనరేష్ పేర్కొన్నారు. అవసరమైన ఔషధాలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వనిపాకలలో డెంగీ కేసును గుర్తించారు.

నకిరేకల్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు వస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిత్యం 280 నుంచి 300 మంది వరకు బయటి రోగులు వస్తున్నారు. మండలంలోని ఓగోడు పీహెచ్‌సీ, గ్రామాల్లో ఉన్న 11 ఉపకేంద్రాల్లో జూన్‌లో 7,177, జులైలో ఇప్పటి వరకు 6,892 మంది ఓపీ సేవలు పొందారు. జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు, కాళ్లు, కీళ్ల నొప్పులు, అతిసారంతో బాధపడుతున్న వారే అధికంగా ఉంటున్నారని వైద్యులు వివరించారు. నకిరేకల్ ప్రాంతీయ వైద్యశాల, పీహెచ్‌సీ, ఉప కేంద్రాలల్లో మే, జూన్ మాసాలతోపాటు జులైలో మంగళవారం వరకు మొత్తం 42,962 మంది పలు అనారోగ్య సమస్యలతో ఓపీ చికిత్సలు పొందినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**రెండు రకాలు బయట తీసుకున్నా**

నర్సమ్మ, బొట్టుగూడ

జ్వరంతో పాటు ఒళ్లు నొప్పుల కారణంతో జనరల్ ఆసుపత్రికి వచ్చాను. వైద్యులు పరీక్షించి ఐదు రకాల మాత్రలు, ఇంజక్షన్లు రాశారు. ఇందులో రెండు రకాలు బయటే కొనుగోలు చేశాను. జనరల్ ఆసుపత్రిలో వార్డుల మార్పు వల్ల వైద్యులు ఎక్కడ ఉన్నారో తెలియక ఇబ్బంది పడుతున్నాం.

అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి

సీజన్ వ్యాధులకు సంబంధించిన అన్నిరకాల మాత్రలు, ఇంజక్షన్లు, ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు.

# అమ్మృతం..!



చౌటుప్పల్ : తల్లి పాలు శిశువులకు సంజీవని లాంటివి..జన్మించిన గంటలోపు శిశువులకు తల్లిపాలు తాగించడం ప్రారంభించి.. ఆరు నెలల వరకు కొనసాగించాలి. ముర్రు పాలు శిశువుకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. కొన్నేళ్ల క్రితం నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నివేదిక ప్రకారం రాష్ట్రంలో సగటున తల్లిపాలు 67.0 శాతం మంది మాత్రమే శిశువు పుట్టిన గంటలోపు తాగిస్తున్నారని గుర్తించారు. ఆరు నెలలపాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇస్తున్న తల్లులు కేవలం 40 శాతం మంది అని నివేదికలో పొందుపర్చారు. ఆరు నెలల నుంచి రెండేళ్ల వయసు వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని 8.3 శాతం మాత్రమే ఇస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఈ వివరాలను జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం పంపారు. 'తల్లిపాలకు ప్రాధాన్యం ఇవ్వండి' అంశంతో నేటి నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకు సన్నద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కార్యక్రమాలు ఇలా..**

ఆగస్టు 1న జిల్లా, ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశాలకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన. గృహ సందర్శన చేసి గర్భిణులు, రెండేళ్ల లోపు పిల్లల పోషణ, ఆరోగ్య సలహాలిస్తారు. 2న తల్లిపాల ప్రాధాన్యంపై కుటుంబ సభ్యులకు అవగాహన, ప్రసూతి ఆస్పత్రుల సందర్శన, గంటలోపు తల్లిపాలను ప్రారంభించేలా ప్రోత్సాహిస్తారు. పోస్టర్ల ప్రదర్శన, వ్యక్తిగత గౌరవంపై అవగాహన కల్పిస్తారు. 4న అన్నప్రాశన, ఆహారం, రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించడంపై అవగాహన. 5న 6-24 నెలల పిల్లల తల్లులకు తల్లిపాల పద్ధతులు, పోషణ లోపాలున్న పిల్లల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్. 7న స్వయం సహాయక సంఘాల బృందాల మద్దతు కోసం సమావేశాలు.

**ఎన్నో పోషకాలు..**

పసుపు పచ్చటి ముర్రు పాల(కొలస్ట్రం)లో బిడ్డ పెరుగుదలకు కావాల్సిన అన్ని పోషకాలుంటాయి. విటమిన్ ఏ, కే ఎక్కువుంటాయి. ఇవి శిశువుకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా పని చేస్తాయి. బిడ్డను కామెర్ల వ్యాధి నుంచి రక్షిస్తాయి. పిల్లల జీర్ణాశయాన్ని శుభ్రపరుస్తాయి. బిడ్డకు ఆర్నెళ్లు నిండే వరకు తల్లిపాలు తప్ప ఏ ఆహార, ద్రవ పదార్థాలు ఇవ్వగూడదు. తల్లి రొమ్ములో మిలియన్ల సంఖ్యలో పాల ఉత్పత్తి గ్రంథులు (ఎల్వియాలై)ఉంటాయి. బిడ్డ ఎంత ఎక్కువగా పాలు తాగగలిగితే అన్ని ఉత్పత్తి అవుతాయి. బిడ్డ పాలు తాగడం ఆపేస్తే ఉత్పత్తి తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

**కుటుంబానికి, సమాజానికీ ప్రయోజనం**

శిశు మరణాలు తగ్గుతాయి. ఔషధాలు, సీసాలు, పాలపీకలు లాంటివి కొనే అవసరం లేకుండా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుంది. పిల్లల అభివృద్ధికి తోడ్పడుతుంది.

**ఎంతో శ్రేయస్కరం..**

కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, నల్గొండ.

చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం. ప్రతి ఒక్కరికి తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన పెంచేందుకే ప్రభుత్వం ఏటా ప్రత్యేకంగా వారోత్సవాలు నిర్వహిస్తుంది. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సెర్ప్, మెప్మా సిబ్బందితో అంగన్‌వాడీ ఉపాధ్యాయునిలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించనున్నారు. తల్లిపాలతో పాటు చిన్నారులకు అందించాల్సిన అనుబంధ ఆహారం, గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై కూడా అవగాహన కల్పించనున్నాం.


# భద్రత కరవైన బాల్యం

ముస్తాబాద్: జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరవైంది. కొన్ని బడులు ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల ఆవరణలో పశువులు, శునకాలు సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. విష సర్పాలతో ప్రమాదం పొంచి ఉంది. వీటికితోడు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రహరీలు లేని కొన్ని పాఠశాలల స్థలాలు ఆక్రమణకు గురయ్యే అవకాశముంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రహరీలేని వాటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలు-112, ప్రాథమిక-337, ప్రాథమికోన్నత-38, ఆదర్శ పాఠశాల-7 ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి దాదాపు 39 వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

**కొన్నిచోట్ల తీవ్ర ఇబ్బంది**

ముస్తాబాద్ పరిధిలోని వెంకయ్యకుంట ప్రాథమిక పాఠశాల, మద్దికుంట, బందనకల్ అంబేద్కర్ నగర్, నామాపూర్ చైతన్య నగర్, నామాపూర్ తండా, గన్నెవారిపల్లె, తెర్లుమద్ది లంబాడితండా, చీకోడ్ ఒడ్డెర కాలనీ, గోపాల్‌పల్లె గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కొన్ని పాఠశాలలు పొలాల పక్కనే ఉన్నాయి. ఆయా పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు ఉండటంతో విష సర్పాలతో ప్రాణభయం ఉందని ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు బడుల సమయం ముగిసిందంటే చాలు



పశువులు, కుక్కలకు అడ్డాగా మారుతున్నాయి. నాటిన మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

**రాజిరెడ్డి, ఎంఈవో ముస్తాబాద్**

మండలంలోని ప్రహరీలేని పాఠశాలలను గుర్తించాం. ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్య పరిష్కారానికి మరోసారి పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. కాగానే పనులు ప్రారంభించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించేలా చర్యలు చేపడతాం.

# నీటిపారుదల శాఖకు మంచి రోజులు

అశ్వారావుపేట : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం నీటిపారుదల శాఖలో పెద్దఎత్తున పోస్టులు మంజూరు చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా పూర్వ నల్గొండ, ఖమ్మం జిల్లాలకు ఎక్కువ పోస్టులు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ కాలువ, వైరా జలాశయం, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, పాలేరు రిజర్వాయర్, లంకాసాగర్, కట్టలేరు.. భద్రాద్రి జిల్లాలో పెద్దవాగు ప్రాజెక్టు, అశ్వారావుపేట వెంకమ్మ చెరువు, తాలిపేరు, మూకమామిడి, సీతారామ ఎత్తిపోతల, సీతమ్మ సాగర్, వెంగళరాయ సాగర్ లాంటి ప్రధాన ప్రాజెక్టులున్నాయి. 25 ఏళ్ల కిందట నియమించిన లస్కర్ పోస్టులే కొనసాగుతున్నాయి. అనేకమంది ఉద్యోగ విరమణ చేయడంతో చాలాచోట్ల అధిక సంఖ్యలో ఖాళీలున్నాయి. లస్కర్లు లేకపోవడంతో గత ఏడాది అశ్వారావుపేట మండలం పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడి పెద్దఎత్తున నష్టం సంభవించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా తెలంగాణలో జలాశయాల వద్ద కీలకంగా వ్యవహరించే లస్కర్ పోస్టుల మంజూరుపై దృష్టి పెట్టింది. భద్రాద్రి జిల్లాకు 115, ఖమ్మం 151 లస్కర్ పోస్టులు మంజూరయ్యాయి. త్వరలోనే పూర్తిస్థాయి నియామక ఉత్తర్వులు రానున్నాయి. అశ్వారావుపేట నియోజకవర్గానికి భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా 38 లస్కర్ పోస్టులు, నాలుగు సూపర్‌వైజర్ పోస్టులు



రానున్నాయని తెలుస్తోంది. భద్రాద్రి జిల్లాలో 2,364, ఖమ్మం జిల్లాలో 1061 జలాశయాలున్నాయి. ప్రభుత్వం నీటిపారుదలశాఖ జీఓఆర్‌టీ నెంబరు: 1212 తేదీ: 19.07.2025 ఉత్తర్వులననుసరించి ఉమ్మడి జిల్లాలో మంజూరు చేసిన పోస్టుల వివరాలు ఇవి...

ప్రభుత్వం నియామక ఉత్తర్వులు విడుదల చేయగానే అవసరాన్ని బట్టి నియోజకవర్గాలవారీగా సిబ్బంది కేటాయింపులు జరిపే అవకాశాలున్నాయి. పోస్టుల కేటాయింపుతో చాలావరకూ సిబ్బంది కొరత తీరనుంది. ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ, నీటిపారుదలశాఖ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

# ఇక డుమ్మాలకు చెక్..!

కొత్తగూడెం: సింగరేణిలో ఇప్పటి వరకు బయోమెట్రిక్ విధానం ద్వారా ఉద్యోగులు తమ హాజరును నమోదు చేసుకునేవారు. శుక్రవారం నుంచి ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు యాజమాన్యం అన్ని ఏరియాల అధికారులను ఆదేశించింది. ఆగస్టు 1 నుంచి గనులు, కార్యాలయాల్లోకి ఉద్యోగులు రావడాన్ని, తిరిగి వెళ్లడాన్ని ఈ యంత్రం ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రధాన కార్యాలయం, ఏరియా జీఎం కార్యాలయాలు, గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ముఖగుర్తింపు యంత్రాల బిగింపు ప్రక్రియ పూర్తికాగా కొన్ని ప్రాంతాల్లో తుది దశకు చేరింది.

**పారదర్శకతకు చర్యలు..:** ముఖ గుర్తింపు ద్వారా హాజరును నమోదుచేసే ప్రక్రియకు కొంతకాలం ముందు నుంచే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని మెస్సర్స్ సెల్ఫీటెక్నాలజీస్



లిమిటెడ్ సంస్థ దీన్ని రూపొందించింది. ముందుగా ఉద్యోగుల ఫొటోలు సేకరించి ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చింది. ఇది నేరుగా సింగరేణిలో ఉద్యోగుల వేతనాలు చెల్లించే యాప్ (శాప్)నకు అనుసంధాన మవుతుంది. ఉద్యోగుల హాజరు ఆధారంగా వేతనాన్ని లెక్కించనున్నారు. సింగరేణి ఉద్యోగుల హాజరులో పారదర్శకత కోసం ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు.

**ఏరియాల వారీగా ఉద్యోగులు..** కొత్తగూడెం (2,622), ఇల్లెందు (668), మణుగూరు (2,547), రామగుండం-1 (5,688), రామగుండం-2 (3,803), రామగుం డం-3 (4,070), భూపాలపల్లి (5,362), బెల్లంపల్లి (1,027), మందమర్రి (4,966), శ్రీరాంపూర్ (9,101), జైపూర్ ఎస్టీపీపీ (138)

# అనారోగ్యం కొని తేచ్చుకోకు..!

పాల్వంచ: రంగు, రుచి చూసి చిన్నారులు చిరుతిళ్లను అమితంగా ఇష్టపడతారు. విపణిలో లభించే చౌక తినుబండారాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. నాణ్యత లేని, తక్కువ ధరకు దొరికే ముడిపదార్థాలతో తయారుచేసే పిజ్జాలు, బర్గర్లు, బేకరీ ఉత్పత్తులు, మసాలా పదార్థాలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. గతేడాది ఇలాంటి ఘటనలు నారాయణపేట, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల్లో చోటుచేసుకున్నాయి.

**గతేడాది మార్గదర్శకాలు జారీ**

వసతిగృహాలు, సంక్షేమ గురుకులాలు, కేజీబీవీల్లోని విద్యార్థులకు తల్లిదండ్రులు తినుబండారాలు తెచ్చి అందించకూడదని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది మార్గదర్శకాలు వెలువరించింది. విద్యార్థులు సైతం బయట కొనుక్కొని తీసుకురాకూడదని స్పష్టం చేసింది. కలెక్టర్లు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్న భోజనంతో పాటు వసతిగృహాల్లో కూరగాయలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. కొన్ని జిల్లాల్లో విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఈనేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ వ్యవస్థను మెరుగుపరచాలి. విద్యార్థులు తినుబండారాలను తీసుకురాకుండా పాఠశాల ప్రార్థన సమయంలో రోజువారీగా యాజమాన్యాలు తనిఖీ చేసేలా చొరవ చూపాలి. రాగి బిస్కెట్లు, పల్లి చెక్కీలు వంటివి మహిళా సంఘాలతో తయారుచేయించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అందిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. 'మార్కెట్‌లో లభ్యమయ్యే ఆహార పదార్థాలను తింటే జీర్ణకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. గ్యాస్, మలబద్ధకం, అజీర్తి, కడుపునొప్పి, పేగుపూతలు, దంత సమస్యలు, ఊబకాయం వంటివి వస్తాయి. జంక్ ఫుడ్‌లో రుచి కోసం వినియోగించే ఉప్పు ఆరోగ్యానికి చేటు చేస్తుంది'వైద్యుడు ముక్కంటేశ్వరరావు తెలిపారు.

చురకలు



# ఏళ్ల నాటి కల..నెరవేరనున్న వేళ



నిడదవోలు : పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నిడదవోలు రైల్వే పైవంతెన (ఆర్వోబీ) నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీని నిర్మాణానికి 2019లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.201 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది జనవరి 7న అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నిర్మాణ వ్యయంలో రూ.56 కోట్లు రైల్వే, మిగిలిన రూ.145 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నిర్ణయించగా.. రైల్వే పరిధిలో పనులు అప్పట్లోనే సుమారుగా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో జరగాల్సిన పనులు ప్రారంభం కాకపోవడంతో తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో నిలుపుదల చేసింది. తర్వాత కొంతకాలం అదే పరిస్థితి కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.197 కోట్లు 2023 ఆగస్టులో మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ అనంతరం గత ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. ఇంతలో సాధారణ ఎన్నికలు రావడంతో అంతగా ముందుకు సాగలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, నిడదవోలు నియోజకవర్గం నుంచి అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం సాధించడం, మంత్రి కావడంతో పనులు ఊపందుకున్నాయి. పలు సందర్భాల్లో ఆయన పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రయాణికులకు తప్పని అవస్థలు...**

ఆర్వోబీ నిర్మాణం కారణంగా రాజమహేంద్రవరం–తాడేపల్లిగూడెం వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనుల కారణంగా రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతమంతా బురదమయంగా మారి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు.

**అరవై శాతం నిర్మాణం పూర్తి..**

ప్రస్తుతం ఆర్వోబీ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా నిడదవోలులో రెండు వైపులా, తాడేపల్లిగూడెం వైపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం కాంక్రీట్ స్లాబ్‌లు ఎక్కిస్తున్నారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ మీదుగా నిడదవోలు నుంచి సమిశ్రగూడెం వైపునకు వంతెన నిర్మాణ పనులు చేపట్టారు.

# ఉల్లి రాసుల్లో కన్నీటి పొరలు

కర్నూలు : “ పంట సాగు చేసిన ఏ ఒక్క రైతు నష్టపోకూడదు. వారికి అండగా నిలవాలి.. ఉల్లికి మద్దతు క్వింటా రూ.1,200కు కొనుగోలు చేయాలి’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కనీస ధర లభిస్తుందని అన్నదాతలు ఆశించారు. కానీ ముఖ్యమంత్రి ఆదేశాలు కర్నూలు మార్కెట్లో అమలుకాలేదు. వ్యాపారుల మాటే నెగ్గింది. రైతులకు నష్టమే మిగిలింది. సరకు తెచ్చి రోజులు గడుస్తున్నా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. చేసేది లేక రైతులు విపణిలోనే వదిలేసి వెళ్లిపోతున్నారు.

**నాలుగైదు లాట్లకే ధర**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 3,793 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. క్వింటా ఉల్లి గరిష్ఠ ధర రూ.1,149 పలికింది. మద్దతు ధర క్వింటా రూ.770 ఉండగా.. దానికంటే రూ.31 తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేశారు. కేవలం నాలుగైదు లాట్లకు మాత్రమే గరిష్ఠ ధర పరిమితం చేశారు.

**చాలావరకు కొనుగోలు చేయక..**

మార్కెట్‌కు గురువారం 87 లాట్ల ఉల్లి వస్తే అందులో 43 లాట్లను వ్యాపారులు కొనుగోలు చేయలేదు. ఆ 43 లాట్లకు కనీసం రూ.100 ధర కూడా రాయలేదు. కనిష్ఠ ధర రూ.500కు తగ్గకుండా కొనుగోలు చేయాలని జేసీ ఆదేశించడంతో వ్యాపారులు కొంత సరకుకు రూ.500 రాసి కొనుగోలు చేస్తున్నారే తప్ప మొత్తం సరకును కొనుగోలు చేయలేదు.

**అమ్ముకోలేక వదిలేశారు**

కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన శ్రీనివాసులు సోమవారం



రాత్రి 50 సంచుల ఉల్లిని తీసుకొచ్చారు. ఉల్లి షెడ్డులో ఉన్న సరకు వైపు వ్యాపారులు రాలేదు. మార్కెట్ కమిటీ అధికారులు పట్టించుకోలేదు. సరకు దెబ్బతింటుండటంతో ఏం చేయాలో దిక్కుతోచక ఒక్కో సంచిని రూ.100 చొప్పున పది సంచుల వరకు విక్రయించారు. మిగిలింది వదిలేసి వెళ్లిపోయారు.

**రోజుకు ఒక్కసారే**

కర్నూలు మార్కెట్‌ను జేసీ డా.బి.నవ్యతనిఖీ చేశారు.. ఏరోజు ఉల్లిని ఆరోజు వ్యాపారులు కొనుగోలు చేయాలని ఆదేశించా రు. రోజుకు రెండుసార్లు ఈ.నామ్‌లో టెండరు నిర్వహించి కొనుగోలు చేపట్టేలా చూడాలని అటు వ్యాపారులు.. ఇటు మార్కెట్ కమిటీ అధికారులకు సూచనలు ఇచ్చారు. కానీ ఇది కూడా అమలుకావడం లేదు. రోజుకు ఒక్కసారి మాత్రమే టెండరు నిర్వహిస్తున్నారు.

**పండగ వేళ పస్తులు : రామాంజిని, బోడబండ, ఎమ్మిగనూరు**

అర ఎకరా పొలంలో ఉల్లి సాగు చేయగా 57 ప్యాకెట్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. కోత కోసి గ్రేడింగ్ చేయించి సంచుల్లో నింపేందుకు, మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు, రవాణాకు కలిపి రూ.20 వేలకుపైగా ఖర్చైంది. పంట సాగుకు రూ.30 వేలకుపైగా ఖర్చు చేశా. ఆదివారం రాత్రి కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి తీసుకొచ్చా. సోమవారం నుంచి వరకు ఒక్క వ్యాపారి కూడా సరకు కొనుగోలు చేయలేదు. పండగ పూటా పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అర ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టినా కనీసం రూ.5 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు.

# మమ్మల్ని ఏం‘సేతు’రో

భీమవరం :జులైలో గుజరాత్‌లో మహిసాగర్ నదిపై ఆర్అండ్‌బీ వంతెన కూలింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. మొత్తం 352 ప్రమాదకరం గా ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. జిల్లాలోనూ చాలా ఉన్నాయి. భీమవరం–తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వద్ద ఉండి కెనాల్‌పై వంతెన ఇది. నిత్యం వేలలో వాహనాలు తిరుగుతుంటాయి. ఇది కూలిపోతే భీమవరం–తాడేపల్లిగూడెం పట్టణాల మధ్య రాకపోకలు బంద్. భారీ వాహనాలు తరచు మలుపు తిరిగే సమయంలో వంతెనపై ఇరుక్కుపో వడంతో గంటల కొద్దీ వాహనాలు బారులు తీరడంతో ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

డెల్టాలో పంట, మురుగు కాలువలపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితిలో ఉన్నాయి. అయినా ఏళ్ల తరబడి పాలకులు అలాగే వదిలేశారు. భీమవరం, ఉండి, నరసాపురంలో పలు చోట్ల కీలక ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

ఇటీవల ఉప్పుటేరును ఆనుకుని ఉన్న భీమవరం మండలం దొంగపిండిలో వంతెనపై కొంత హఠాత్తుగా కూలిపోయింది. గ్రామంలోకి ప్రవేశించేందుకు ఉన్న ఒకే ఒక మార్గం ఇది. ఇక్కడ ద్విచక్ర వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా అనుమతించారు. మూడు రోజుల కిందట మొగల్తూరు మండలం జగన్నాథపురం వద్ద జీఅండ్‌వీ కెనాల్‌పై ఉన్న వంతెనపై లారీ వెనక్కి వస్తుండగా శ్లాబ్ కూలి అది తిరగబడింది. దీని పైభాగం గతంలోనే



శిథిలమైంది. అధికారులు మరమ్మతులు చేయించి తేలికపాటి వాహనాలు తిరిగేలా అనుమతి ఇచ్చారు. గడిచిన కొన్నేళ్లలో జిల్లాలో రూ.వందల కోట్లు రహదారుల విస్తరణ అభివృద్ధికి ఖర్చు చేసినా వంతెనల ఊసే పట్టించుకోలేదు. భీమవరం–విజయవాడ ప్రధాన మార్గంలో కాళ్ల మండలం కోపెల్ల వద్ద బొండాడ డ్రెయిన్‌పై ఉన్న శిథిల వంతెన ఇది. రెండు దశాబ్దాలుగా దీన్ని పట్టించుకోవడం లేదు. గతంలో రూ.3 కోట్ల నిధులు మంజూరైనా టెండర్లు పూర్తి కాక అలాగే ఉండిపోయింది.

**ఏమి చేయాలి?..** జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూటమి నుంచి నెగ్గినవారే. ప్రభుత్వం కూడా శిథిల వంతెనలపై దృష్టి పెట్టిన నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు చేయించి తీసుకెళ్లాలి. ప్రమాద తీవ్రతను పెద్దలకు వివరించి నిధులు మంజూరు చేయించాలి. డబ్బులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిపించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..** ప్రమాదకరంగా ఉన్న వంతెనల విషయంపై ప్రత్యేక దృష్టి పెడతాం.పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కోపెల్ల వంతెన నిర్మాణానికి నిధులున్నాయి. దొంగపిండి వారధి తాత్కాలిక మరమ్మతులకు రూ.24 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.– శ్రీనివాసరావు, ర.భ.శాఖ ఈఈ

# హడలెత్తిస్తున్న కడలి



అల్లవరం : సఖినేటిపల్లి మండల పరిధిలో 13 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. పల్లిపాలెం, అంతర్వేది, అంతర్వేదికర గ్రామాల్లో తీరం కోతకు గురవుతోంది. కేవశదాసుపాలెం, అంతర్వేది, పల్లిపాలెం గ్రామాల్లోకి నీరు చొచ్చుకువస్తోంది.అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో సముద్రపు అలలు తీరంపై విరుచుకుపడుతున్నాయి. ఓఎన్జీసీ చమురు సంస్థకు రక్షణగా నిర్మించిన రహదారి పూర్తిగా కడలి గర్భంలో కలిసిపోయింది. ఈ ప్రాంతాల్లో తీరం వెంబడి గ్రామాల్లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.ఉప్పలగుప్తం మండలం పరిధిలో వాసాలతిప్ప పరిధిలో మడ అడవులను నరికి అనధికారిక చెరువులను తవ్వేస్తున్నారు.సువిశాల తీరం కోనసీమ సొంతం. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వరుస వాయుగుండాలు, తుపాన్ల ప్రభావం ఈ జిల్లాపై అధికంగా ఉంటుంది. ఒకప్పుడు సహజ సిద్ధంగా తీరానికి రక్షణ కవచంగా ఉండే వనరులు నేడు విధ్వంసం కావడంతో విపత్తులు వచ్చి తీవ్ర నష్టం కలగజేస్తున్నాయి.

**మానవ చర్యల వల్లే:** కోనసీమ తీర ప్రాంతానికి తుపాన్లతో అపార నష్టం వాటిల్లుతోంది. విపత్తులు వచ్చిన సమయంలో అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప, తీర ప్రాంత రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని సమీప ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

**ఇవీ కారణాలు..**

కోనసీమ తీరంలో 19,302 ఎకరాల్లో అటవీ ప్రాంత భూములు ఉన్నాయి. వీటిలో వెయ్యి ఎకరాలు ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా తీరం వెంబడి అక్రమ రొయ్యల చెరువులు, ఇతర నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గాలుల తీవ్రతను తగ్గించే తాటిచెట్లు, సరుగుడు, ఇతర వనాలు నరికివేతకు గురయ్యాయి. మడ అడవులు, మొగలి పొదలు మాయమవుతున్నాయి. తీర ప్రాంత గ్రామాలకు రక్షణగా నిలిచిన ఇసుక తిన్నెలను అక్రమార్కులు తమ కాసుల కక్కుర్తితో కొల్లగొట్టి వ్యాపారం చేస్తున్నారు.

**కనీస చర్యలు చేపడితేనే..**

తీరం వెంబడి గాలుల తీవ్రతను నియంత్రించే సరుగుడు, తాటి వనాలు, మొగలిపొదలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. సామాజిక అటవీ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి. తీరానికి 5 కి.మీ.దూరంలో అన్ని సదుపాయాలతో కూడిన తుపాను రక్షిత భవనాల నిర్మాణం చేపట్టాలి. జిల్లాలో ఉన్న 6వేల ఎకరాల చిత్తడి నేలల్లో ఉన్న ఆక్రమణలు తొలగించి మడచెట్లు పెంచాలి. తీరం వెంబడి సాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలి. అనధికారిక రొయ్యల చెరువుల సాగును తక్షణం నియంత్రించాలి.

తీర ప్రాంతం: 93 కి.మీ.
మండలాలు: 9
మత్స్యకార అనుసంధాన గ్రామాలు: 85
సామాజిక అటవీ ప్రాంతం: 19,302
చిత్తడి నేలలు: 6 వేల ఎకరాలు
రొయ్యల చెరువులు సాగు: 7 వేల ఎకరాలు

# వరుణుడు గర్జిం‘చేను’



ఉండి : ప్రతికూల వాతావరణం జిల్లాలో ఖరీఫ్ వరిసాగును ముంచేస్తోంది. ఈ నెల 14న కురిసిన అధిక వర్షంతో మునిగిన 17,775 ఎకరాల చేలు ఇంకా తేరుకోలేదు. వచ్చే అయిదో తేదీ లోపు ఆ నష్టాన్ని తేల్చే పనిలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. ఇంతలో వినాయక చవితి రోజున ఎడతెరపి లేకుండా జిల్లాలో పాలకొల్లులో అత్యధికంగా 84.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అత్తిలిలో 11.2 మి.మీ. కురిసింది. 17 మండలాల్లో 30 మి.మీ కంటే ఎక్కువ పడింది. దీంతో భీమవరం, కాళ్ల, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు తదితర మండలాల్లోని పల్లపు ప్రాంతాల్లో 500 ఎకరాల్లో చేలు జలదిగ్బంధంలో చిక్కాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడతాయని అధికారులు భావిస్తున్నారు. జూన్, జులైలో వర్షాభావ పరిస్థితులు, ఈ నెలలో అతివృష్టితో నూరుశాతం పూర్తి కాలేదు. నరసాపురం, యలమంచిలి, ఆచంట, మొగల్తూరు, పోడూరు తదితర మండలాల్లో మరో ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉందని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కురిసిన వర్షంతో మునిగిన చేలను గుర్తించి అవి కోలుకోకపోతే పంట నష్టం జాబితాల్లో చేరుస్తామని వివరించారు.

**నిపుణుల సూచనలు తప్పనిసరి**

వర్షాలు.. మబ్బులతో కూడిన వాతావరణం వల్ల చేలు ఆకుపచ్చ రంగులోకి మారి ఆకుముడత, పొడతెగుళ్లు సోకే ప్రమాదముంది. ఇటువంటిచోట్ల నిపుణుల సూచనల్లేకుండా ఏవిధమైన రసాయనాలు పిచికారీ చేయొద్దు. పల్లపు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిన చోట్ల దుబ్బులు ఎర్రబడి సల్ఫైడ్ ఇంజూరి తెగులు బారిన పడితుండటాన్ని కాళ్ల, ఉండి వంటి మండలాల్లో గుర్తించాం. ఇటువంటిచోట్ల కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలి. తాటాకు తెగులు కనిపిస్తే హెక్సాకొనజోల్ 2 ఎంఎల్/ప్రొపికొనజోల్ ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. – ఎన్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి

# క్రీడలు ‘కల’శాల

కర్నూలు : జూనియర్, డిగ్రీ కళాశాలల్లో క్రీడా సౌకర్యాలు కరవయ్యాయి. వ్యాయామ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అంతర్ కళాశాలల పోటీలు మాత్రమే మొక్కుబడిగా జరుగుతున్నాయి. మిగతా పోటీలు ఎంపికలకే పరిమితం అవుతుండటం క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లో మైదానాలు ఉన్నా ఉపయోగం లేకుండాపోయింది. అరకొరగా ఉన్న ఆట పరికరాలు సైతం తుప్పు పట్టిపోతున్నాయి.

**కోటా పెంచినా.. పోటీల్లేవు**

ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటాను ప్రభుత్వం 3 శాతానికి పెంచింది. అన్ని క్రీడలకు అనుబంధ పోటీల పత్రాలుండాలి. లేకుంటే క్రీడా కోటా కోల్పోవాల్సి వస్తుందని క్రీడాకారులు వాపోతున్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు లేకపోవడంతో.. పాఠశాల స్థాయిలో రాణించిన క్రీడాకారులు ప్రైవేటుగా శిక్షణ పొంది ఎంపిక పోటీల్లో పాల్గొంటున్నారు. అలా.. లాన్‌టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, క్రికెట్ వంటి క్రీడల్లో ఆడుతున్నారు.

**ఆర్‌యూలో ‘ఆట’కెక్కించారు**

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 80 దాకా డిగ్రీ కళాశాలలు



ఉన్నాయి. వీటిలో పది ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అన్ని కళాశాలల్లో కలిపి 20–30 మంది వ్యాయామ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కింద పలువురిని నియమించారు. దీంతో క్రీడలు నామమాత్రమయ్యాయి. వార్షిక క్రీడా పోటీలకు 15 నుంచి 20 కళాశాలల విద్యార్థులు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ప్రతిభావంతులను ఆర్‌యూ జట్టుకు ఎంపిక చేస్తున్నారు. సరైన శిక్షణ, ప్రోత్సాహం లేకపోవడంతో ఆశించిన మేర పతకాలు రావడం లేదని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలో..**

కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలో కేవీఆర్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మాత్రమే వ్యాయామ అధ్యాపకుడు ఉన్నారు.

**44 మందికి గాను ఉన్నది నలుగురే**

కర్నూలు జిల్లాలో 44 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో నలుగురు వ్యాయామ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. కర్నూలు కేవీఆర్ జూనియర్, నందికొట్కూరు, ఆదోని, కర్నూలు టౌన్ జూనియర్ కళాశాలలో మాత్రమే వ్యాయామ అధ్యాపకులు ఉన్నారు. దీంతో జూనియర్ కళాశాల స్థాయిలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వలేని పరిస్థితి. పాఠశాల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్‌లో సత్తా చాటిన క్రీడాకారులే జూనియర్ కళాశాలల తరఫున ఆడుతున్నారు. కొత్త క్రీడాకారుల సంఖ్య నామమాత్రమే.

# కుందూలో కబ్జాల విందు

నంద్యాల : కుందూ నది యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతోంది. నంద్యాల నుంచి కోవెలకుంట్ల వరకు కబ్జాల పర్వం రోజురోజుకు పెరిగిపోతోంది. నీటి పారుదల శాఖ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకించి జిల్లా కేంద్రం నంద్యాలతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. నంద్యాల పట్టణంలో ఆర్టీసీ బస్టాండు వెనుక నుంచి బ్రాహ్మణపల్లె గ్రామం వరకు 9 కి.మీల పొడవునా కుందూ నది వెంబడి పలువురు కబ్జాలకు పాల్పడుతున్నారు. నదికి ఇరువైపులా ఉన్న మట్టి కట్టలను ధ్వంసం చేసి ఆక్రమించేస్తున్నారు. గతంలో కుందూ నది ఆధునికీకరణ కోసం ఏర్పాటుచేసిన సర్వే రాళ్లను సైతం పెకలించేస్తున్నారు. వందలాది ఎకరాల భూమి ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ అధికారులు దృష్టి సారించడం లేదు.

**బోర్లు, మోటార్లు ఏర్పాటుచేసి...**

ఆక్రమించుకున్న భూముల్లో పలువురు బోర్లు వేయడంతోపాటు ఇంజిన్ మోటారు ఏర్పాటుచేసుకుని సాగు చేసుకుంటున్నారు. మట్టి గట్లను తవ్వి చదును చేసి వరి, జొన్న పంటలు వేశారు. కర్నూలు బైపాస్ సమీపంలో ఆక్రమించిన పోరంబోకు స్థలంలో ఏకంగా మునగ తోటలను సాగు చేస్తున్నారు. కొందరు ప్రథమ నంది ఆలయం వెనుక



వైపు గట్లను ధ్వంసం చేసి తమ పొలాల్లో కలిపేసుకోవడం గమనార్హం. దీంతో ఏటా కుందూకు వరద వచ్చిన సమయంలో సమీప ప్రాంతాల్లోని పొలాలను ముంచెత్తుతోంది.

**27 కి.మీ. పొడవునా..**

నంద్యాల పట్టణం నుంచి గోస్పాడు మండలం తెల్లపురి వరకు సుమారు 27 కి.మీ. పొడవునా కుందూ నది వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైంది. నంద్యాల, చాపిరేవుల, గుంతనాల, మిట్నాల, బ్రాహ్మణపల్లె, తెల్లపురి, ఎస్.కూలూరు తదితర గ్రామాల్లో ఏకంగా బోర్లు వేసి విద్యుత్తు మోటార్లు అమర్చుకున్నారు. ప్రభుత్వ భూమికి విద్యుత్తు సదుపాయం ఎలా ఇచ్చారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆక్రమించిన కొన్ని భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు సైతం ఉండటం గమనార్హం. మరికొన్ని భూములకు పట్టాలు పుట్టించారు. వీటిని కొందరు విక్రయించి సొమ్ము చేసుకోగా.. మరికొందరు ‘మార్టిగేజ్’ చేసి రుణాలు పొందారు.

**100 ఎకరాల వరకు**

నంద్యాల, పాణ్యం, కోవెలకుంట్ల నియోజకవర్గాల పరిధిలో కుందూ నది వెంబడి 100 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైంది. ఈ భూమి విలువ ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంది. నంద్యాలలో ఎకరా భూమి విలువ కనీసం రూ.2 కోట్ల వరకు ఉంది. కోవెలకుంట్ల, ఇతర గ్రామాల పరిధిలో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలు పలుకుతోంది. ఆక్రమణలకు గురైన భూమి విలువ రూ.50 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఇటీవల నంద్యాల బైపాస్ రహదారిలో కుందూ ఒడ్డున సుమారు 10 ఎకరాలను అక్రమార్కులు కబ్జా చేసి దర్జాగా సాగు చేస్తున్నారు. అక్రమార్కుల వెనక కొందరు నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి.

చురకలు



## పెరిగిన రద్దీ.. అసౌకర్యాలతో కుస్తీ!

అనంతపురం : ఆర్టీసీ బస్సుల్లో స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. దీంతో రద్దీ పెరిగింది. అందుకు అనుగుణంగా సౌకర్యాలు సమకూరలేదు. పథకం అమలుకు ముందు కనీస సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు చెప్పినా క్షేత్రస్థాయిలో పలుచోట్ల కార్యరూపం దాల్చలేదు. అనంతపురం, హిందూపురం బస్టాండ్లలో పారిశుద్ధ్య చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. తాగునీరు అందుబాటులో ఉండటం లేదు. తాడిపత్రి బస్టాండులో ఫ్యాన్లు తిరగడం లేదని ప్రయాణికులు వాపోయారు.

**ఉచితమైనా.. వసూళ్లు**

అనంత ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సాధారణ రోజుల్లోనే 60,500 మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత ప్రయాణంతో మహిళల సంఖ్య పెరిగింది. మూత్రశాలను ఉచితంగా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉన్నా రూ. 10 వరకు వసూలు చేస్తున్నారు. తాడిపత్రిలో మహిళలకు ఉచితంగా వినియోగించే మరుగుదొడ్లు రెండే ఉన్నాయి. హిందూపురం బస్టాండులో ప్రయాణికులు మూత్రవిసర్జన చేయాలన్నా రూ. 5 చెల్లించుకోవాలి. ప్రస్తుతం ఉన్న 8 మరుగుదొడ్లు సరిపోవటం లేదు. స్వచ్ఛభారత్ కింద బస్టాండు ఆవరణలో స్త్రీ, పురుషుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలల నిర్వహణ చేయలేక మూసివేశారు. దీనిపై డిపో మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మూత్రశాలల నిర్వహణకు



నిధులు లేవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బస్టాండును పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

**తగిన చర్యలు తీసుకుంటాం..** రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాం. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి శుభ్రం చేయిస్తున్నాం. ప్రయాణ ప్రాంగణాల్లో అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. శ్రీలక్ష్మి, జిల్లా ప్రజారవాణా అధికారిణి, అనంతపురం

**అనంత జిల్లాలో..**
ఆర్టీసీ డిపోలు: 7
మొత్తం బస్సులు: 521
రోజూ ప్రయాణించేవారు: 1.90 లక్షల నుంచి 2 లక్షలు
రోజువారీ ఆదాయం: సుమారు రూ. 70లక్షలు

## అడ్డేదెవరు.. ఆపేదెవరు!

అనకాపల్లి : వందల ఎకరాలకు సాగునీటి భరోసా అందిస్తున్న మాకవరపాలెంలోని పాపయ్యపాలెం జలాశయం అక్రమార్కుల కన్నుపడి బక్కచిక్కిపోతోంది. వీటిని సంరక్షించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాపయ్యపాలెం రిజర్వాయర్ సుమారు 90 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని నుంచి పాపయ్యపాలెం, బుచ్చయ్యపాలెం, ముసిడిపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాలకు ఏటా నీరు అందుతుంది. గత తెదేపా హయాంలో రిజర్వాయర్ పరిధిలోని ఆక్రమణలు తొలగించారు. దీంతోపాటు రూ. 70 లక్షలకు పైగా ఖర్చుచేసి.. పంటకాలువలు, మదుములు అభివృద్ధి చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజర్వాయర్ భూములపై ఆ పార్టీ నాయకుల కన్నుపడింది. మూడేళ్ల క్రితం కొంతమంది 15 ఎకరాలకు పైగా చదునుచేసి ఆక్రమించుకుని సరుగుడు తోట వేశారు. దీనిపై గతంలో ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఇదే అవకాశంగా భావించి మరికొంతమంది ఆక్రమణలకు బరితెగించారు. ఒకరితో ఒకరు పోటీపడి ట్రాక్టర్లతో దున్ని.. సరుగుడు, అరటి తోటలు సాగు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఈ జలాశయం ఆక్రమణలను పట్టించుకోవడం లేదు. దీంతో అన్ని పార్టీల నేతలూ కుమ్మక్కయి మరో 16 ఎకరాలు ఆక్రమించి యంత్రాలతో చదును చేశారు. ఈ విషయాన్ని జలవనరులు, రెవెన్యూ అధికారుల దృష్టికి స్థానిక రైతులు తీసుకెళ్లినా అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి నీరు చేరుతోంది. జలాశయం నిండితే తాము ఆక్రమించిన భూములు నీటమునుగుతాయనే ఉద్దేశంతో అక్రమార్కులు కావాలనే అనధికారికం



గా రిజర్వాయర్ గేట్లు ఎత్తేస్తున్నారు. దీంతో ఎంత వర్షాలు పడినా రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండటం లేదు. దీంతో ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేకుండా పోతోంది. తాజాగా ఇంకొకరు ఆక్రమణలకు రంగం సిద్ధం చేసుకున్నారు. తెదేపా మండల మహిళ అధ్యక్షురాలు రమణమ్మ ఉప తహసీల్దారుకు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ అధికారులు వెళ్లి ఆక్రమణలను అడ్డుకున్నారు. కానీ పాత ఆక్రమణలవైపు కన్నెత్తి కూడా చూడలేదు.

త్వరలో హద్దులు నిర్ణయిస్తాం

రిజర్వాయర్ ఆక్రమణలపై ఇటీవల ఫిర్యాదులు అందాయి. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. ఆర్ఐ, ఏఈ, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓ లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశాం. త్వరలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. వెంకటరమణ, తహసీల్దారు, మాకవరపాలెం

## పుడుతోంది.. కుడుతోంది!



గుత్తి : పురపాలికల్లో ‘దోమ పుట్టరాదు.. కుట్టరాదు’ అన్న నినాదం కాగితాలకే పరిమితమవుతోంది. గత నెల రోజులుగా పడుతున్న వర్షాలకు వాతావరణంలో మార్పులొచ్చాయి. అన్ని ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో దోమల ఉధ్ధృతి పెరిగింది. ఫలితంగా సీజనల్‌వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వాటికి సంబంధించిన ఫాగింగ్ యంత్రాలకు మూలకు చేరాయి. దీంతో రెండు పురపాలికల్లోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా, టైఫాయిడ్, ఇతరత్రా విషజ్వరాలు బాధితుల రోజురోజుకీ పెరిగిపోతున్నారు.

**రెండు చోట్ల ఇదీ పరిస్థితి**

గుత్తితోపాటు తాడిపత్రి పురపాలికల్లో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న ఫాంగింగ్ యంత్రాలను మూలనపెడుతున్నారు. ఒక్కో యంత్రాన్ని రూ.2లక్షలు వ్యయం చేసి కోనుగోలు చేశారు. పదేళ్ల కిందట వరకు గుత్తి,చెట్నేపల్లి మేజర్ పంచాయతీల్లో ఉన్న యంత్రాలు తుప్పుపట్టి పాడయ్యాయి. వాటిని వినియోగంలోకి తేకుండా వదిలేయడంతో ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఐదేళ్ల కిందట గుత్తి పురపాలిక అధికారులు రెండు ఫాగింగ్ యంత్రాలు కొన్నారు. అవి కూడా వినియోగించకుండానే మూలకు చేరాయి. తరువాత కొత్తగా మూడింటిని కొన్నారు. ప్రస్తుతం అవి స్టోర్ గదిలో వృథాగా దర్శనమిస్తున్నాయి. తాడిపత్రి పురపాలికలోనూ ఒకటి పెద్దది, మరో రెండు చిన్న యంత్రాలు ఉన్నాయి. అవి వినియోగంలోలేక తప్పుపడుతున్నాయి. ఆరు నెలలుగా దోమల తీవ్రత ఎక్కువగా ఉన్నా ఫాగింగ్ చర్యలు లేవని జనం వాపోతున్నారు. అప్పుడప్పుడు పెద్ద యంత్రంతో ఫాగింగ్ చేస్తున్నా సత్ఫలితాలు ఉండటం లేదు. ప్రస్తుతం దోమల వృద్ధి ఎక్కువగా ఉంది. ప్రధానంగా నందలపాడు, జయనగర్ కాలనీ, అంబేద్కర్‌నగర్, టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్ పలు కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది.

**సమస్యను పరిష్కరిస్తాం**

గుత్తి పురపాలికల్లో ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తెస్తాం. ప్రతి వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. మురుగుకాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయడంతోపాటు దోమల లార్వాను కట్టడికి చర్యలు తీసుకుంటాం. తాడిపత్రిలో కొన్ని నెలలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. అయినా సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి కాలనీల్లో ఫాగింగ్ చర్యలు చేపడతాం. మహబూబ్‌బాషా, రాంప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, డీఈ, గుత్తి, తాడిపత్రి

## పేదల కాలనీల్లో అవినీతి మేడలు!



అనంతపురం : కంబదూరులో ‘పేదలందరికీ ఇళ్లు’ పథకం కాలనీలోని 232709ఎన్‌పీ19582941 ఐడీలో కేవలం బేస్‌మెంట్ పూర్తయిన ఇంటికి రూఫ్‌లెవెల్ పూర్తయినట్లు బిల్లులు మంజూరు చేశారు. అదే కాలనీలో 232709ఎన్‌పీ16999896లోనూ పునాది పూర్తయిన నిర్మాణానికి బిల్లు కట్టబెట్టారు. ఒక్క కంబదూరు లేఅవుట్‌లోనే 52 ఇళ్లకు అక్రమంగా బిల్లులు మంజూరు చేశారు. కళ్యాణదుర్గం పట్టణ పరిధిలో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల పేరుతో నిధులు దోచేశారు. పునాదులు కూడా పడని ఇళ్లకు బిల్లులు మంజూరు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 120 ఇళ్లకు సంబంధించి రూ.లక్షల్లో నొక్కేశారు. వైకాపా నాయకుల అండతో జియో ట్యాగింగ్‌ను సైతం పక్కదారి పట్టించారు. ఒక్కో ఇంటి ముందు ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులను వేర్వేరుగా నిల్చోబెట్టి ఫొటోలు తీసి.. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. పేదవాడి సొంతింటి కల సాకారం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. గృహ నిర్మాణశాఖలోని కొందరు అవినీతి అధికారుల తీరుతో ప్రభుత్వ సాయం పక్కదారి పడుతోంది. గత వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన పలువురు అధికారులు జగనన్న కాలనీల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడ్డారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో నిర్మాణాలు పూర్తికాకుండానే బిల్లులు మంజూరు చేశారు. కంబదూరులో 241 ఇళ్లు మంజూరు చేశారు. అప్పటి ఏఈ వైకాపా నాయకులతో అంటకాగుతూ పార్టీ సానుభూతిపరులకు బిల్లులు కట్టబెట్టారు. నిర్మాణాలు మొదలుపెట్టని వారికి సైతం రూ. 70 వేలు చొప్పున జమ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కంబదూరు ఏఈని అనంతపురం గ్రామీణానికి బదిలీ చేశారు. ఆయన్ను మళ్లీ అదే స్థానానికి బదిలీ చేయడం గమనార్హం. ప్రస్తుతం అవినీతి లెక్కలన్నింటినీ సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు.


**ఉన్నతాధికారి సహకారంతోనే..**

గత ప్రభుత్వంలో కళ్యాణదుర్గం డివిజన్‌లో పనిచేసిన ఓ అధికారి అక్రమాలకు సహకరించారనే ఆరోపణలు వస్తున్నాయి. కంబదూరులో ఓ ఏఈ, కళ్యాణదుర్గంలో ఇద్దరు వర్క్‌ఇన్స్‌పెక్టర్లు, మరో ఏఈ సాగించిన అవినీతి దందాను చూసీచూడనట్లుగా వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. అక్రమంగా బిల్లుల మంజూరుకు ఒక్కో లబ్ధిదారు నుంచి రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. సదరు అధికారి కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నత పోస్టులో కూర్చున్నారు.

**ముందస్తు చెల్లింపులు నిజమే..**

కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాంతాల్లో కొందరు లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించిన మాట వాస్తవమే. తర్వాత ఏఈలు లబ్ధిదారులను పిలిపించి నిర్మాణాలు పూర్తిచేయాలని చెప్పారు. ఇప్పుడు చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. ముందస్తుగా బిల్లులు ఎందుకు చెల్లించారనేది తెలియదు.
విజయ్‌భాస్కర్, ఇన్‌ఛార్జి డీఈ, కళ్యాణదుర్గం

## పంటకు రక్ష.. సోలార్ కంచె



ముదిగుబ్బ : రైతులు పంటలు సాగు చేయడం ఒక ఎత్తైతే.. వాటిని కాపాడుకోవడం మరోఎత్తు. విత్తనం విత్తింది మొదలు.. కోత కోసే వరకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నా కొన్నేళ్లుగా వన్యప్రాణుల బెడద పెరిగింది. ముదిగుబ్బ మండలంలోని అటవీ ప్రాంతంలో ఎక్కువగా మొక్కజొన్న, వేరుసెనగ ఇతర ఉద్యాన పంటలు సాగు చేశారు. పంటలను పందులు, జింకలు, కోతులు పాడు చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు కాపలా ఉంటూ రైతులు శ్రమిస్తున్నారు. పొలాలు చుట్టూ ఇనుప కంచె, మైక్‌సెట్లు ఏర్పాటు చేయడం, చీరలు కట్టడం, ప్లేట్లు, బీరుసీసాలు వేలాడదీయడం, తప్పెట్లు, డబ్బాలు కొట్టడం ఇలా అనేక పద్ధతులు అనుసరించారు. వాటి నుంచి వెలువడే శబ్దాలకు అలవాటు పడిన జంతువులు లెక్క చేయకుండా మూకుమ్మడిగా వచ్చి పంటలను నాశనం చేస్తుండటంతో రైతు కష్టం వృథాగా మారుతోంది. ముదిగుబ్బలోని కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి ప్రాణహానిలేని సోలార్ ఫెన్సింగ్ వైపు ఆసక్తి చూపుతున్నారు. దాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పంటకు రక్షణగా ఉందని రైతులు చెబుతున్నారు.

**ప్రాణహాని లేకుండా..**

సోలార్ కంచెతో పంటకు రక్షణతోపాటు వణ్యప్రాణులకు ఎటువంటి హాని ఉండదు. ఇది ఎలా పని చేస్తుందంటే..
పొలంలో ఒక స్తంభానికి 12 ఓల్టులు లేదా 15 ఓల్టులు ఉత్పత్తి సామర్థ్యమున్న సోలార్ ప్యానెల్, బ్యాటరీ, అర్తింగ్ ఏర్పాటు చేసుకుంటారు. పొలం చుట్టూ మూడు వరుసలుగా తీగలు చుట్టాలి. ఇన్సులేటర్ ఉపయోగిస్తే భూమికి విద్యుత్తు సరఫరా కాదు.
సౌర పలక ద్వారా వచ్చే విద్యుత్తు బ్యాటరీలో నిల్వ ఉండటంతో రాత్రివేళల్లోనూ పని చేస్తుంది. జంతువులు తీగకు తగిలినప్పుడు షాక్ కొడుతుంది. విద్యుత్తు నిరంతరం సరఫరా కాకుండా సెకను సెకనుకు మధ్య ఆన్ అండ్ ఆఫ్ అవుతుండటంతో ప్రాణహాని ఉండదు. సెకనుకి ఒక పల్స్ విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. పొలం చుట్టూ తీగలు ఏర్పాటు చేసే క్రమంలో 10 అడుగులకు ఒక కర్ర లేదా సిమెంటు స్తంభాలు నాటి తీగలు ఒకదానికొకటి తగలకుండా టైట్‌గా ఏర్పాటు చేసుకోవాలి. పొలం దగ్గర డేంజర్ అని బోర్డు ఏర్పాటు చేసుకోవాలి. సోలార్ ప్యానెల్, బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి రూ. 10 వేల వరకు ఖర్చవుతుంది. సుమారు ఐదు ఎకరాల వరకు పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవచ్చు.

## వేగంగా పనులు.. తీరనున్న కష్టాలు

పెనుకొండ : గత ఐదేళ్ల వైకాపా పాలనలో కియా ఇండియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమలకు అవసరమైన ఉపరితల వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కియా ఉపరితల వంతెన నిర్మాణానికి రూ. 98 కోట్లతో ఇటీవల పనులు ప్రారంభించారు. శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 18నెలల వ్యవధిలోనే పూర్తి చేసేవిధంగా అధికారులు చర్యలు చేపడతున్నారు.

**జాతీయ రహదారి, రైల్వే డబుల్ లైన్..**

కియా ఇండియా పరిశ్రమకు కారు విడి భాగాలు సరఫరా చేసే పలు అనుబంధ పరిశ్రమలకు మధ్య 44వ జాతీయ రహదారి, రైల్వే డబుల్‌లైన్ ఉన్నాయి. దుద్దేబండ కూడలి మీదుగా గొల్లపల్లి రహదారి పక్కన ఉన్న అనుంబధ పరిశ్రమల నుంచి, పాలసముద్రం వద్ద ఉన్న కియా సైట్-బీలోని 18 అనుబంధ పరిశ్రమల నుంచి కార్ల విడిభాగాలు



కంటైనర్లతో సరఫరా చేస్తుంటారు. ప్రతిరోజు వందలాది కంటైనర్లు కారు విడిభాగాలను కియా ఇండియాకు చేరవేయడం కారణంగా 44వజాతీయ రహదారి పై నిత్యం ట్రాఫిక్ అంతరాయం తలెత్తడంతో పాటు పలు సందర్భాల్లో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

**పరిశ్రమ ప్రారంభంలోనే శ్రీకారం**

ప్రమాదాలు జరగకుండా పరిశ్రమ ప్రారంభంలోనే ఉపరితల వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో కేవలం వంతెన నిర్మాణానికి అవసరమైన దాదాపు 35ఎకరాల భూసేకరణ మాత్రమే చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణం పూర్తయితే కియా పరిశ్రమకు సంబంధించిన వందలాది వాహనాలు జాతీయ రహదారి మీదకు రాకుండానే పరిశ్రమకు చేరుకునే విధంగా వంతెన రూపుదిద్దుకుంటోంది.

## మంత్రి చెప్పినా పరిస్థితి మామూలే..

కొమ్మాది : మంత్రి నారా లోకేశ్ ఆదేశించి ఏడాది కావస్తున్నా చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడామైదానం రూపురేఖలు మారలేదు. స్వయంగా ఆయన గత ఏడాది ఆగస్టులో చెరువును తలపిస్తున్న మైదానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో తూతూమంత్రంగా చర్యలు చేపట్టి మమా అనిపించారు. ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించేందుకు ఈ నెల 29న మంత్రి మళ్లీ పాఠశాలకు రానున్నారు. ప్రస్తుత వర్షాలకు మైదానమంతా బురదమయంగా మారింది. ఈ దుస్థితిని చూసి మంత్రి ఎలా స్పందిస్తారోనని జిల్లా యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది.
**నాడు ఇలా..:** గత వైకాపా హయాంలో నాడు-నేడు కింద రూ. 5 లక్షలు వెచ్చించి మైదానంలో వర్షపునీరు నిలిచిపోకుండా నాలుగువైపులా ఇంకుడు గుంతల మాదిరి తవ్వి పైపుల ద్వారా వర్షపునీటిని మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. అప్పట్లో సాంకేతికంగా సరైన



పద్ధతిలో పనులు చేపట్టకపోవడంతో పరిస్థితి యథాస్థితికి చేరింది.
**అంచనాలు రూపొందించినా:** గతేడాది మంత్రి లోకేశ్ పరిశీలించిన తర్వాత క్రీడామైదానం అభివృద్ధికి సమగ్ర శిక్షా ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. మైదానం చుట్టూ కాలువలు ఏర్పాటు చేసి వర్షపునీరు ప్రధాన గెడ్డలోకి మళ్లించడం, మైదానం చదును, తాగునీటి ట్యాంక్ నిర్మాణం తదితర పనులపై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో ఆ పనులు కార్యరూపం దాల్చలేదు.
**అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం..:** విద్యార్థులు, ఉపాధ్యాయులు సాఫీగా తరగతుల గదులకు రాకపోకలు సాగించేలా మైదానాన్ని తీర్చిదిద్దుతాం. ప్రధానంగా అక్కడి నుంచి నీటిని మళ్లించేలా చర్యలు తీసుకుంటాం. అంతేగాక విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం పొందేందుకు మైదానం అభివృద్ధి చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తాం. అందుకు తగ్గ నిధులు కేటాయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.
డాక్టర్ జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్ర శిక్షా

## ఆంక్షలు పట్టక... ఆక్రమణలు గుట్టుగా!

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం ప్రాంతంలో భూఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూశాఖాధికారుల ఆంక్షలు, హెచ్చరికలు సైతం బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వ, బంజరు, అసైన్‌మెంట్, వాగుపోరంబోకు, ఇనాం, ప్రైవేటు, పట్టా భూములను సైతం ఆక్రమించుకుని వందల ఎకరాలు కొల్లగొడుతున్నారు. అక్రమార్కులు నేతలు, రెవెన్యూశాఖ అధికారులతో చేతులు కలిపి వారికి ఎంతోకొంత ముట్టచెప్పి తాజాగా వాగుపోరంబోకు భూములను ఆక్రమించేశారు. ఆక్రమిత 50 ఎకరాల్లో వరి సాగుకు ఇటీవల భూమిని సైతం దుక్కి సిద్ధం చేశారు. ఇక్కడ పంటలు సాగు చేసుకోవడానికి ఓ అధికారి అక్రమార్కుల నుంచి భారీగా డబ్బులు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణదారులు ప్రస్తుతం ఆక్రమించిన 50 ఎకరాల భూమి విలువ రూ. 5 కోట్లపైనే ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు కె.చిరంజీవి మాట్లాడుతూ నోటీసులు జారీ చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మార్కాపురం మండలం బొందలపాడు గ్రామంలోని సర్వే సంఖ్య 569లో 91.49 ఎకరాల వాగుపోరంబోకు భూమి ఉంది. ఇందులో సారవంతమైన 50 ఎకరాల్లోని భూములను ఆక్రమించుకుని ఎవరికి ఇష్టమొచ్చినట్లు వాళ్లు పంటలు సాగు చేసుకుంటూ కంచెలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ వాగుపోరంబోకు భూమిని ఎవరైనా ఆక్రమించినా, పంటలు సాగు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని గతేడాది రెవెన్యూశాఖాధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమార్కులు ఆంక్షలు, హెచ్చరికలు బేఖాతరు చేస్తూ 50 ఎకరాల వరకు ఆక్రమించేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

# పల్లె జనం.. అందని శుద్ధజలం

కర్నూలు : వానాకాలం మొదలైంది.. కొత్త నీరు రావడం.. తాగునీరు కలుషితం కావడం వల్ల రోగాలు ప్రబలుతున్నాయి. పల్లెల్లో తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటం వల్ల అతిసారం ప్రబలుతోంది. క్షేత్రస్థాయిలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖలు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**ఇదీ పరిస్థితి..** ఆస్పరి మండలం కైరుప్పల, తంగరడోణ గ్రామాల్లో సుమారు ఆరువేలకు పైగా జనాభా ఉంది. ఈ గ్రామాల్లో నీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. నీరు కలుషితమై ప్రజలు అతిసారం బారిన పడే ప్రమాదం ఉంది. ఆదోని మండలంలోని హనువాలు, ధణాపురం గ్రామాల్లోని నీటి ట్యాంకులు శుభ్రం చేయక సుమారు రెండు నెలల పైనే అయింది. ఈ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శి అక్కడ పనిచేసే ఏఎన్ఎం, ఆ మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి.

మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో గతంలో తాగునీరు కలుషితం కావడం వల్ల అతిసారం ప్రబలి 30మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ గ్రామంలో సుమారు వారం రోజుల పాటు వైద్యశిబిరం నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో దినేష్, అభిరామ్‌ను



సర్వజన వైద్యశాలకు తరలించి పీడియాట్రిక్ విభాగంలో చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

జులై 21న ఓర్వకల్లు మండలంలోని కన్నమడకల గ్రామంలో ఒకేరోజు పది మంది అతిసారం బారిన పడ్డారు. బీసీ కాలనీలోని నీటి ట్యాంకు కలుషితం కావడంతో వారు అస్వస్థతకు గురయ్యారు.

**తాగునీటితోనే ముప్పు**

జిల్లాలో నేటికీ చాలా గ్రామాల్లో శుద్ధజలం అందడం లేదు. మంత్రాలయం మండలం సుంకేశ్వరి, కన్నమడకల గ్రామాల్లో అతిసారం ప్రబలడానికి నీటి ట్యాంకుల నుంచి సరఫరా అయిన తాగునీరే కారణమని వైద్యఆరోగ్యశాఖాధికారులే నివేదికలు సమర్పించారు. వైద్యశిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఇకనైనా ట్యాంకుల శుభ్రం, నీటి పరీక్షలు తదితరాలపై పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖ అధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

**శుభ్రత తేదీల్లోనే..**

జిల్లా వ్యాప్తంగా 740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో తాగునీటి ట్యాంకును గ్రామ కార్యదర్శి అక్కడున్న సిబ్బందితో 15 రోజులకోసారి శుభ్రం చేయించాలి. నీటిని క్లోరినేషన్ చేయాలి. శుభ్రం చేసిన తేదీ, భవిష్యత్తులో చేయాల్సిన తేదీలు ట్యాంకుపై నమోదు చేయాలి. నెలలో రెండు సార్లు శుభ్రం చేయాలి. సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు పనికి వస్తుందా? లేదా కలుషితం అయిందా? అని అక్కడ ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్య కార్యకర్త నీటి నమూనాలను తరుచూ పరీక్షలకు పంపాలి. అందుకు భిన్నంగా జిల్లాలోని చాలా గ్రామాల్లో రెండు, మూడు నెలలకోసారి మొక్కుబడిగా శుభ్రం చేయడం తప్ప నిబంధనల ప్రకారం చేసిన దాఖలాలు లేవు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తాగునీటి పరీక్షలపై దృష్టిసారించడం లేదు.

# శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల

బేస్తవారపేట: మండలంలోని పిటికాయగుళ్లలోని ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వైద్య సిబ్బందితో పాటు వైద్యం కోసం వచ్చే రోగులు సైతం బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ కనీస సౌకర్యాలు సైతం కరవైపోవడంతో అరకొర వసతుల నడుమనే రోగులకు సేవలందించేందుకు వైద్య సిబ్బంది నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో కిటికీలు ఊడిపోయి ఉన్నాయి. తలుపులు నెట్టితే పడిపోయేలా కనిపిస్తున్నాయి. మరుగుదొడ్ల మరమ్మతులకు గురై వినియోగించేందుకు వీలు లేకుండా పోవడంతో కాలకృత్యాలకు సిబ్బంది అవస్థలు పడుతున్నారు.



వైద్యశాలలో నేటికి విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో లైట్లు, ఫ్యాన్లు ఉన్నప్పటికీ అవి పనిచేయని పరిస్థితి. వైద్యశాల ఆవరణంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. నీటి వసతి లేదు. కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు లేకపోవడంతో వచ్చిన రోగులు నేలపైనే నడుము వాల్చాల్సిన పరిస్థితి నెలకొంది.

**వైద్యుడు లేక ...తగ్గిన ఓపీ**

వైద్యశాలకు మెడికల్ ఆఫీసర్, ఎంఎన్‌వో, కంపౌండర్ తదితర మూడు పోస్టులు కేటాయించాల్సి ఉండగా అక్కడ కేవలం మెడికల్ ఆఫీసర్ పోస్టును మాత్రమే భర్తీ చేశారు. ఇటీవలే ఆయన పదవీవిరమణ పొందగా ఆయన స్థానంలో మరో వైద్యుడు వచ్చి కొన్నాళ్లకే మళ్లీ టంగుటూరుకు బదిలీపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం అక్కడ ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) సిబ్బంది ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉంటారు. కొన్నాళ్లుగా మందుల కొరత సైతం వేధిస్తోంది. ఒకరిద్దరు వచ్చినా సరిపడినన్ని మందుల రకాలు లేక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

**నిధులు మంజూరైతేనే...** గతంలో ఆయుష్మాన్‌భారత్ కింద పలు వైద్యశాలల మరమ్మతుల కోసం ఒక్కో వైద్యశాలకు రూ.3.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాగా ఆసమయంలో ఈ వైద్యశాల ఎంపిక కాలేదు.రెండో దశల్లోనైనా ఎంపికైతే వైద్యశాలకు మరమ్మతులతో పాటు పలు సౌకర్యాల కల్పనకు వీలుంటుంది. గురువారెడ్డి, ఎంఎన్‌వో, ఆయుర్వేద వైద్యశాల, పిటికాయగుళ్ల

# ఆక్రమణలు అంతేనా.. తొలగింపు ఓ తంతేనా!!



కుప్పం : నగరంలో అత్యంత విలువైన పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసెస్) పేరిట జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు నాలుగు రోజుల క్రితం వాటి పరిరక్షణకు చర్యలు ఆరంభించారు. అయితే... ఆ తరువాత ప్రక్రియ నెమ్మదించింది. మిగిలి ఉన్న ఆక్రమణల జోలికి వెళ్లకపోవడంతో వాటిని వదిలేస్తారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. మొత్తం 48 పార్కులు, ఖాళీ స్థలాల్లో ఆక్రమణలున్నాయని పట్టణ ప్రణాళికాధికారులు గుర్తించారు. కేవలం 15 చోట్లే తొలగించారు. న్యాయస్థానాల్లో వివాదాలున్నవి మినహా.. మిగిలినవి స్వాధీనం చేసుకోవడంతోపాటు పరిరక్షణకు ప్రహరీలు నిర్మించాల్సి ఉంది. చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించి... తరువాత పన్నులు కట్టి అది తమదేనని నమ్మించి నిర్మాణాలకు ప్లాన్‌లతో దరఖాస్తు చేస్తున్నారు. నగరంలోని అత్యంత విలువైన లాసన్స్‌బే కాలనీలోని సర్వే నెంబరు 17లో 726 గజాల స్థలం (విలువ దాదాపు రూ. రూ.14.52 కోట్లు)ను ప్రయివేటు వ్యక్తి తన స్వాధీనంలోకి తీసుకున్నా పట్టణ ప్రణాళికాధికారులు పట్టించుకోలేదు. ఇక్కడ కలెక్టర్ పేరిట గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా లెక్కచేయలేదు. స్థలాన్ని చదును చేసి కాంక్రీటుతో నేలను గట్టిగా చేశారు. అనంతరం రేకుల షెడ్డు నిర్మించి, అక్కడ పశువులను కట్టి వ్యాపారం చేశారు. దీనిపై అనేక ఫిర్యాదులు వచ్చినా పట్టణ ప్రణాళికాధికారులు పట్టించుకోలేదు. ఇటీవలే ఈ స్థలానికి వెళ్లే రహదారిని కొత్తగా నిర్మించడం గమనార్హం. గెడ్డకు ఆనుకుని ఈ స్థలం ఉన్నా... ఎలాంటి ఇబ్బంది లేకుండా గెడ్డ ఆధునికీకరణ పనులు పూర్తికావడంతో రక్షణ గోడ కూడా సమకూరినట్లయింది.అధికారుల తీరుపై విమర్శలు రావడంతో రంగంలోకి దిగారు. ఈ స్థలం వ్యవహారంపై న్యాయస్థానంలో కేసు ఉందని అక్కడ రాసి ఉన్నా..అందులో జీవీఎంసీ పార్టీ కాకపోవడంతో పట్టణ ప్రణాళికాధికారులు సునాయాసంగా తొలగించగలిగారు. దీనిపై జోన్-3 సహాయ ప్రణాళికాధికారి మధుసూదనరావును వివరణ కోరగా.. గెడ్డ, పోరంబోకు స్థలం కావడంతో ఆక్రమణలు తొలగించామని, మరోసారి కబ్జాకు గురికాకుండా కాపాడతామని పేర్కొన్నారు.

# ఉమ్మడి ఎల్‌పీఎం కష్టాలకు పరిష్కారం





చిత్తూరు : గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర భూముల రీసర్వేతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వే నంబర్ల స్థానంలో అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)ను అమల్లోకి తీసుకొచ్చింది. ఐదారుగురు రైతులకు కలిపి ఉమ్మడి ఈ సంఖ్య కేటాయించారు. దాని ఆధారంగా భూహక్కు పత్రాలు అందజేశారు. అప్పట్నుంచి రైతుల కష్టాలు మొదలయ్యాయి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఉమ్మడి ఎల్‌పీఎంల విభజనకు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అవకాశం కల్పించింది. గడువు ముగిసినా ఇంకా పెద్ద సంఖ్యలో రైతులు మిగిలిపోవడంతో దరఖాస్తు గడువును డిసెంబరు 31 వరకు పొడిగించింది. జిల్లాలో 319 గ్రామాల్లో రీసర్వే జరగగా, 34,877 ఎల్‌పీఎం ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు.

**సమస్యలిలా..**

భూవివరాలు సర్వే నంబర్లు, వాటి సబ్ డివిజన్ల వారీగా ఉండేవి. రీసర్వే జరిగిన గ్రామాల్లో కొత్తగా ఎల్‌పీఎం సంఖ్య విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో ఆ సంఖ్య కింద ఉన్న భూమి ఆ రైతులందరికీ చెందినదిగా ఆన్‌లైన్ చూపిస్తుండటంతో సమస్యలు మొదలయ్యాయి. ఫలితంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ పథకాలకు సంయుక్త ఎల్‌పీఎంలు ప్రతిబంధకంగా మారాయి. ఇద్దరు, ముగ్గురు రైతులకు చెందిన భూములు ఉండటంతో వారంతా విస్తీర్ణం ఎక్కువగా ఉందని అనర్హులుగా మారారు. బ్యాంకుల నుంచి రుణాలు కూడా రాని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ సదస్సుల్లోనూ పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.

**పరిశీలన ఇలా..**

జాయింట్ ఎల్‌పీఎం ఉన్నవారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరో సంఖ్య కేటాయిస్తారు. గతంలో విభజనకు రూ.500 రుసుం కాగా, రైతుల సౌకర్యార్థం రూ.50కి తగ్గించారు. గతంలో అవకాశం కల్పించినా గ్రామస్థాయిలో అవగాహన లేక రైతులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వం రెండోసారి అవకాశం కల్పించిన నేపథ్యంలో సర్వేయర్లు, వీఆర్వోలు రైతులకు సమాచారాన్ని చేరవేసి ఉమ్మడి ఎల్‌పీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతుంది**

– జయరాజ్, ఏడీ సర్వే శాఖ

రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత గ్రామ సర్వేయర్‌కి చేర్చి ప్రాథమిక సర్వే చేయిస్తున్నాం. ఇప్పటికే 1086 ఎల్‌పీఎంలను పరిష్కరించాం. పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం చేస్తాం.

# రోగులకు నావ.. ఎన్టీఆర్ వైద్యసేవ





తిరుపతి : ఎన్టీఆర్ వైద్య సేవ (ట్రస్టు (ఆరోగ్యశ్రీ) సేవలు రోగులకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలోని నెట్వర్క్ ఆస్పత్రుల ద్వారా 3,257 రకాల వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. పేదలే కాదు కార్డులున్న ఉన్నతస్థాయి వర్గాల వారూ సేవలు పొందుతున్నారు. కార్డు లేని అర్హులకు కూడా వైద్యసేవలకు సీఎంవో అనుమతులు ఇప్పిస్తున్నారు.

**కార్డు లేకుంటే ఎవరిని సంప్రదించాలి?:** ఆరోగ్యశ్రీ కార్డు లేని అర్హులు అనారోగ్యానికి గురై నెట్వర్క్ ఆస్పత్రులకు వెళ్లి ఆరోగ్యమిత్రలను సంప్రదించాలి. వారు జిల్లా సమన్వయకర్త కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. అర్హతను పరిశీలించి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అధికారికంగా అనుమతులు తీసుకుని వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతారు. జిల్లాలో ప్రతి రోజూ 20–30 మందికి అనుమతులిస్తున్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డుదారులు జిల్లాలో 6.61 లక్షల మంది ఉన్నారు. వీరు దేశంలో ఎక్కడైనా ఒప్పందం చేసుకున్న ఆస్పత్రుల్లో వైద్యం పొందొచ్చు.

**వీరంతా అర్హులే:** 'ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్న కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందుతాయి. చెవుడు, మూగ సమస్యలతో పుట్టిన వారు రూ.12 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. క్యాన్సర్ రోగులకు అపరిమిత వైద్యం అందించే ఏర్పాట్లున్నాయి. రూ.5లక్ష దాటితే ఈహెచ్‌ఎస్‌లో 836.. ఆరోగ్యశ్రీలో 3,257 రోగాలకు ఉచిత వైద్యం లభిస్తోంది. వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉంటే.. తక్కువ ఉండే వారంతా అర్హులు. 12 ఎకరాల్లోపు మాగాణి, 35 ఎకరాల్లోపు మెట్ట, మాగాణి – మెట్ట కలిపి 35 ఎకరాల్లోపు ఉన్న రైతులు అర్హులు. శాశ్వత ఉద్యోగి లేదా పింఛనుదారులు మినహా రూ.5 లక్షల వార్షిక ఆదాయం కలిగిన ఇతర ఉద్యోగులంతా ఈ పథకంలో చేరవచ్చు. కుటుంబం అంతటికీ ఒక కారున్నా ఇబ్బంది లేదు. పురపాలిక పరిధిలో 3వేల చదరపు అడుగుల అంతకన్నా తక్కువ ఆస్తి పన్ను చెల్లించిన వారూ పేర్లు నమోదు చేసుకోవచ్చు' అని ట్రస్టు సమన్వయకర్త డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొంటున్నారు.

**ఆరోగ్య మిత్రల వ్యవస్థ:** ట్రస్టు పరిధిలోని ఆసుపత్రిలో ఆరోగ్యమిత్రల వ్యవస్థ ఉంది. పూర్తి ఉచితంగా సేవలు అందించి డిశ్చార్జి తర్వాత రవాణాఛార్జీలు అందజేస్తారు. ఐబీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. అదనంగా డబ్బులు తీసుకుంటే 104, 14400 టోల్‌ఫ్రీ నంబర్లు, పీజీఆర్ఎస్, ఆరోగ్యమిత్రలకు ఫిర్యాదు చేయవచ్చు.

ట్రస్టు పరిధిలోని ఆస్పత్రులు ప్రైవేట్ – 38 ప్రభుత్వ జిల్లా – 2 ప్రాంతీయ – 2 పీహెచ్‌సీలు – 57 సీహెచ్‌సీలు – 10తితిదే – 3 రోజూ జరిగే శస్త్రచికిత్సలు – 70 నుంచి 90

# గుట్టలు తవ్వుతూ.. గుట్టుగా తరలిస్తూ..!

కుప్పం : వర్షాలు లేక చెరువులన్నీ ఇంకిపోయాయి. తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్న తరుణం.. చెరువులు ఖాళీ కావడంతో అక్రమార్కులు మట్టిని తవ్వి కృత్రిమ ఇసుక కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆ ఇసుకను మార్కెట్ తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్జనకు తెర తీస్తున్నారు. కుప్పం పురపాలిక పరిధిలో పలు చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూముల్లో వైకాపా పాలనలో భారీ ఎత్తున తవ్వకాలు జరిపారు. ప్రస్తుతం మళ్లీ తవ్వకాలు ప్రారంభమైనా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కుప్పం పురపాలికతోపాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని ప్రభుత్వ భూములు, బండలున్న ప్రాంతాల్లో మట్టిని ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. దీంతో భారీ ఎత్తున గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పురపాలిక పరిధిలోని కుప్పం చెరువు, దళవాయికొత్తపల్లె, గెర్కిబండ, లక్ష్మీపురం, శీగలపల్లె, పరమ సముద్రం తదితర చెరువుల్లో నిత్యం మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. **కృత్రిమ ఇసుక కేంద్రాలకు..** ఐదేళ్ల వైకాపా పాలనలో కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలు భారీ ఎత్తున వెలిశాయి. అప్పుడు నిర్వహిస్తున్న వారే ఇప్పటికీ కృత్రిమ ఇసుక కేంద్రాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చిట్టిబాబును వివరణ కోరగా.. అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, తవ్వకాలు జరిగే స్థలాలను పరిశీలిస్తామన్నారు.

# మిర్చి.. ఏమార్చి!

ఒంగోలు : జిల్లాలో పొగాకు తరువాత మిర్చి పంట పెద్దఎత్తున సాగవుతోంది. మొక్క దశ నుంచే మిరప రైతులకు కష్టాలు ఎదురవుతున్నాయి. నర్సరీల నుంచి నారు తెచ్చి నాటేస్తున్నారు. వాటి నాణ్యత ఎంత...దిగుబడులు ఎలాగనేది చెప్పేవారు లేక నిలువునా మోసపోతున్నారు. పర్యవేక్షించాల్సిన వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు దస్త్రాల పరిశీలనకే పరిమితమవుతున్నారు.

జిల్లాలో త్రిపురాంతకం, కుంట, గిద్దలూరు ప్రాంతాల్లో 400కుపైగా నర్సరీలు ఉన్నాయి. నిర్వాహకుల్లో లోటుపాట్లను ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. నర్సరీ రిజిస్ట్రేషన్, నవీకరణ, దస్త్రాల పరిశీలన చేపడుతుంటారు. అరకొర సిబ్బంది, ఇతర వ్యాపకాల్లో మునిగిపోవడంతో నర్సరీల్లో నిర్వహణ ఎలా ఉందన్నదానిపై అధికారులు అలక్ష్యం వహిస్తున్నారు. ధ్రువీకరించిన విత్తనాలు వాడుతున్నారా.. లేదా..అనేది పరిశీలించడంలేదు. ప్రస్తుతం మిరప నారు కొద్దిచోట్ల



ఇప్పటికే వేయగా, మరికొన్నిచోట్ల ప్రారంభించారు. ఈ సమయంలోనే వాడుతున్న విత్తనాలపై ఆరా తీస్తే రైతులకు మేలు జరుగుతుంది. గత అనుభవాలు చూస్తే రైతులు నష్టపోయిన సందర్భాలున్నాయి. గతంలో త్రిపురాంతకం, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల్లోనూ రైతులు నకిలీ మిర్చి విత్తనాలు నాటి నష్టపోయారు. ఈ ఏడాదైనా ముందుగా దృష్టిసారిస్తే నకిలీ విత్తనాలు అరికట్టి నాణ్యమైన నారు అందించవచ్చు.

**అవగాహన కల్పించాం:** విత్తనాలకు సంబంధించి రసీదు, లాట్ నంబరు తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నాం. విత్తన శుద్ధి, చీడపీడల నివారణ.. నారు పెంపకంలో జాగ్రత్తలపై శాస్త్రవేత్తలతో నర్సరీ యజమానులకు అవగాహన కల్పించాం. ధ్రువీకరించబడిన విత్తనాలు నాటేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

వై.గోపీచంద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# కాన్పుకొస్తే కోతే!

మార్కాపురం : పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని మార్కాపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు సుఖ ప్రసవాల కంటే శస్త్రచికిత్సలే ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సుఖ ప్రసవాలు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైద్యశాలకు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల మండలాలు, నంద్యాల జిల్లా శ్రీశైలం, సున్నిపెంట, ఆత్మకూరు ప్రాంతాల నుంచి ఎక్కువమంది గర్భిణులు కాన్పుల నిమిత్తం వస్తుంటారు. బయట ప్రైవేటు వైద్యశాలల్లో రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని అధిక శాతం మంది పేదలు ఇక్కడకు తరలివస్తుంటారు.

మార్కాపురం డివిజన్ పరిధిలో గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం, దోర్నాల, ప్రాంతాల్లోని వైద్యశాలల్లో ఎక్కువ శాతం కాన్పులు జరగడంలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అయితే నెలకు ఒక్కటి



మాత్రమే జరుగు తోంది. అది కూడా కాన్పు అత్యవసరమైతే తప్పా, ఆ కేసును కూడా మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆయా వైద్యశాలల్లో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సుఖ ప్రసవాలు జరగడంలేదు. ఆసుపత్రిలో రోజుకు అన్ని రకాల ఓపీలు కలిపి 450 నుంచి 500 వరకు నమోదవుతోంది. వైద్యశాలలో గర్భిణుల శస్త్రచికిత్స కాన్పులు నెలకు సగటున 120 వరకు జరుగుతుండడం, సుఖ ప్రసవాలు 50కు మించకపోవడం గమనార్హం. సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవాలు చేసి తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని రాష్ట్ర మంత్రుల నుంచి రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల వరకు ఆదేశాలు జారీ చేస్తున్నా ఇక్కడ అమలు కావడంలేదు. ఇక్కడ వైద్యులు ఎక్కువగా శస్త్రచికిత్సల ద్వారా బిడ్డలను బయటకు తీయడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు కాన్పుల గణాంకాలు చూస్తే అర్థమవుతోంది,.. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 1,594 శస్త్రచికిత్సలు చేసి కాన్పులు చేశారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవాలకే ప్రాధాన్యమిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లోనే శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తోందని తెలిపారు.

# రైతులను కా'పాడి'కోవాలని!

ఒంగోలు : గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడి పరిశ్రమకు మరింత చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరం తరహాలోనే ప్రస్తుత ఏడాది కూడా ఉపాధిహామీ పథకం నిధులతో పాడి రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయి. దీంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పశుపోషకులకు 90 శాతంలో జీవాలు, కోళ్ల పెంపకం దారులకు 70 శాతం మేర రాయితీ ఇవ్వనున్నారు. పశువుల షెడ్ల నిర్మాణ నిమిత్తం యూనిట్ వ్యయాన్ని రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు కేటాయించారు. జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీలుండగానూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రతి పంచాయతీకి రెండు చొప్పున మొత్తం 1,458 యూనిట్లు కేటాయించారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి ఉన్న పాడి రైతుల నుంచి స్థానిక పశు వైద్యాధికారులు లేదా ఉపాధిహామీ ఏపీవోలు దరఖాస్తులు స్వీకరించి మంజూరుకు ప్రతిపాదించనున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు తొలి ప్రాధాన్యమివ్వనున్నారు.

గతేడాది 843 పూర్తి : 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మినీ గోకులం పథకం కింద జిల్లాకు మొత్తం 1,075 షెడ్లు మంజూరు చేశారు. ఇందుకు మొదిటలు అర్జీలొచ్చాయి. ఒక్కో యూనిట్‌కు సరాసరిన ముగ్గురికిపైగా పోటీ పడటంతో స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అందులో ఇప్పటివరకు 843 పూర్తికాగాటీ మరో 181 షెడ్లు పలు దశల్లో పురోగతిలో ఉన్నాయి. బిల్లిదారులకు కూడా ఇటీవల బిల్లులు జమ కావడంతో ఈ ఏడాది ఎక్కువ మంది షెడ్ల నిర్మించుకునేందుకు ఆసక్తి చూపనున్నారు. షెడ్ల నిర్మాణానికి అవసరమైన సొంత స్థలం రైతులు కలిగి ఉండాలి.

## పాలన సాగక.. పర్యవేక్షణ మరచి

చిత్తూరు : విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా పాఠశాలల పర్యవేక్షణకు రెగ్యులర్ అధికారులు లేక విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. మండల స్థాయిలో పర్యవేక్షణకు ఎంఈవోలు, డివిజన్ స్థాయిలో డీవైఈవోలు పనిచేయాలి. అయితే వివిధ కారణాలతో చాలా మండలాల్లో ఇన్‌ఛార్జుల పాలనే కొనసాగుతుంది. గ్రేడ్-2 హెచ్ఎంలకు ఎంఈవో-1 బాధ్యతలు అప్పగించడంతో వారు.. రెండు వైపులా న్యాయం చేయలేపోతున్నారనే వాదనలు ఉన్నాయి. మరోవైపు డీవైఈవోలంతా తాత్కాలికంగా సర్దుబాటులో వచ్చిన వారే.

**మండల కేంద్రాలకే పరిమితం**

సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలోని శాంతిపురం ఎంఈవో-1 పోస్టు ఏడేళ్లకు పైగా ఖాళీగా ఉంది. ఇటీవల ఆ స్థానాన్ని ఇన్‌ఛార్జితోనే భర్తీ చేశారు. ఇలాంటి మండలాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 22కు పైగా ఉన్నట్లు విద్యాశాఖ చెబుతుండగా.. ఆ సంఖ్య మరింత అధికంగా ఉందని విద్యా నిపుణులు చెబుతున్నారు. మండల విద్యాశాఖాధికారుల పోస్టులను పక్క మండలాల ఎంఈవోలకు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వారు ద్విపాత్రాభినయం చేస్తూ పాలన, పర్యవేక్షణకు న్యాయం చేయలేక మండల కేంద్రాలకే పరిమితమవుతున్నారు. వివిధ కార్యక్రమాలు, యాప్‌ల్లో సమాచారం నమోదు, విద్యార్థుల అడ్మిషన్లు, సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యా మిత్ర అమలులోనే నిమగ్నమైపోతున్నారు.

**ఏళ్ల తరబడి లేక..**

దశాబ్ద కాలం ఉప విద్యాశాఖాధికారుల పోస్టులు ఇన్‌ఛార్జులతోనే గడిచిపోతుంది. ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, తిరుపతి, మదనపల్లి,




పుత్తూరులో ఈ పోస్టులు ఉండేవి. గత కొన్నేళ్లుగా వాటిల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు అంతంతమాత్రంగా ఉన్నాయి. జిల్లాల విభజన తర్వాత చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నాలుగు చొప్పున డీవైఈవో పోస్టులు ఏర్పడ్డాయి. పాత డివిజన్లలోనే రెగ్యులర్ డీవైఈవోలు లేరు.. ఇక కొత్త డివిజన్లలో ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

**తొమ్మిదేళ్లుగా నిలిచిన బదిలీలు**

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాల్సిన అధికారులు పనిభారంతో సతమతమవుతున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల ప్రవేశాలు, బోధనలో నాణ్యతపై దృష్టి సారించలేని పరిస్థితి. ఫలితంగా విద్యార్థుల ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయి. దాదాపు తొమ్మిదేళ్లుగా ఎంఈవోలకు బదిలీలు జరగలేదు. అలాగే కొందరు ఉద్యోగ విరమణ పొందడం, మరికొందరు అనారోగ్య సమస్యలతో సెలవులో ఉన్నారు. 2017, 2021, 2023, 2025లో ఉపాధ్యాయుల బదిలీలు జరిగినా ఎంఈవోలు బదిలీలు మాత్రం జరగలేదు. తాజాగా ఖాళీలు గుర్తించిన విద్యాశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సరిపడా హెచ్ఎంలు లేకపోవడంతో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవో-1గా నియమించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## అద్దె గదుల్లో అక్రమాల పద్దు

ఆదోని : ఉమ్మడి జిల్లాలో నగరపాలక, పురపాలికల్లో వాణిజ్య సముదాయాలు అక్రమార్కులకు ఆదాయ మార్గాలుగా మారాయి. పురపాలికలకు సొంత నిధుల సమీకరణలో భాగంగా వాణిజ్య సముదాయాలు నిర్మించి అద్దెకిచ్చారు. ఇవన్నీ ప్రధాన మార్కెట్ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో పలువురు కన్నేశారు. గడువు ముగిసినప్పటికీ బహిరంగ వేలాలు నిర్వహించకుండా లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారు. తక్కువ అద్దెలు చెల్లిస్తూ దుకాణాలను మరికొందరికి భారీ అద్దెకు ఇస్తు లబ్ధి పొందుతున్నారు.

**పాతవారికే కట్టబెడుతున్నారు**

పుర దుకాణాల అద్దెలను పరిశీలిస్తే కనిష్ఠంగా రూ.4 వేల నుంచి గరిష్ఠంగా రూ.18-20 వేలు లోపే ఉన్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో రూ.25 వేల వరకు ఉంటున్నాయి. అదే



ప్రాంతంలో ప్రైవేటు దుకాణాల అద్దెలు రూ.30-40 వేలు ఉండటం గమనార్హం. మూడేళ్లకోసారి అద్దెపై 33 శాతం పెంచి పాతవారినే కొనసాగిస్తున్నారు. మరోవైపు అద్దె బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**30 శాతం బినామీల చేతిలో..**

కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 18 సముదాయాల్లో 436 దుకాణాలున్నాయి. ఏటా రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతోంది. ఇక్కడ 30 శాతం దుకాణాలు బినామీల చేతుల్లోనే ఉన్నాయి. తక్కువ ధరకు అద్దెకు తీసుకొని.. అధిక ధరకు ఇతరులకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు.

**ఎక్కడ ఎలా ఉందంటే**

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 272 దుకాణాలకు ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తోంది. రెండేళ్ల కిందట వైకాపా హయాంలో గడువు తీరిన 35 దుకాణాలకు వేలం పేరుతో కొంత మొత్తం పెంచి పాతవారికే కట్టబెట్టారు. 50 దుకాణాల్లో బినామీలు తిష్ఠేశారు. సుమారు రూ.40 లక్షల వరకు అద్దె బకాయిలు ఉన్నాయి.

ఆదోని పురపాలక సంఘం పరిధిలో ఐదు సముదాయాల్లో 160 దుకాణాలున్నాయి. ఏడాదికి రూ.కోటి ఆదాయం సమకూరుతోంది. ఆరు సముదాయాల్లో పాతికేళ్ల గడువు తీరిన 37 దుకాణాలకు ఈ ఏడాది జూన్‌లో వేలం నిర్వహించారు. పాలకులు ముడుపులు తీసుకుని పాతవారికే కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిలో మరో పది దుకాణాలు మిగిలాయి. వీటికి వేలాల నిర్వహణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. అద్దె బకాయిలు రూ.30 లక్షలకుపైగా పేరుకుపోవడం గమనార్హం.

# సర్కారు భూమి కబ్జా



బుక్కరాయసముద్రం : ఆ ప్రభుత్వ భూమి విలువ రూ.కోట్లలో ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ సమీపాన ఉండటంతో కన్నుపడింది. భూమిని రక్షించాల్సిన రెవెన్యూ ఉద్యోగి భక్షకుడిగా మారాడు. పేదలకు ఇచ్చిన భూమిని రద్దు చేసి ఆక్రమించాడు. దర్జాగా రాళ్లు పాతించాడు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని జంతులూరు రెవెన్యూ గ్రామ శివారులో సెంట్రల్ యూనివర్సిటీ ఉంది. దీనికి దగ్గర్లో సర్వే నంబరు 276-1, 276-4లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి సమీపం నుంచి జాతీయ రహదారి వెళుతుంది. 2017లో అప్పటి రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాల భూమిని దళితులు నాగేశ్వరమ్మ, కృష్ణవేణిలకు 2.5 ఎకరాల చొప్పున ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారు. 2023లో జంతులూరులో ఇల్లులేని పేదలకు సదరు భూమిలో పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. పట్టాదారులకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో జంతులూరు వీఆర్వోగా పనిచేసిన వ్యక్తి విలువైన భూమిని కాపాడాల్సిందిపోయి.. కబ్జా చేయడానికి కన్నేశాడు. ప్రస్తుతం అక్కడ ఎకరం భూమి ధర రూ.4 కోట్లకు పైగా పలుకుతోంది. ఐదు ఎకరాల విలువ రూ.20 కోట్లకు పైగానే ఉంటుంది.

**హెచ్చరిక బోర్డు తొలగించి..**

కొంతకాలం క్రితం విలువైన భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించేశారు. తాజాగా భూమి చదునుచేసి సరిహద్దు రాళ్లు పాతడం గమనార్హం. అప్పట్లో వీఆర్వోగా ఉన్న సదరు వ్యక్తి.. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లాలోని రెవెన్యూశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నాడు. విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రద్దు చేయించి..**

పేదలకు పట్టాలు ఇస్తామంటూ అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో నాగేశ్వరమ్మ పేరుతో ఉన్న 2.5 ఎకరాల భూమిని వీఆర్వో రద్దు చేయించాడు. తనతోపాటు భార్య పేరిట మార్పించుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. అప్పట్లో సదరు భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వలేకపోయారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అప్పటి అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం**

శ్రీధర్‌మూర్తి, తహసీల్దార్, బుక్కరాయసముద్రం

అది ప్రభుత్వ భూమి. అందులో పాతిన రాళ్లను తొలగిస్తాం. ఆక్రమించిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం.

## అమృత తుల్యం.. సంపూర్ణ పోషకం..!




మద్దిలపాలెం : తల్లిపాలు అమృతంతో సమానం అంటారు. శిశువుకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు పట్టడం చాలా మంచిదని వైద్య నిపుణులు చెబుతుంటారు. అయితే పలు కారణాలతో ఆరు నెలల ముందే శిశువులు తల్లిపాలకు దూరం అవుతున్నారు. ఇది పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. తల్లిపాలపై నెలకొన్న అపోహలను తొలగించడానికి ప్రపంచ లయన్స్ క్లబ్ ఫర్ బ్రెస్టు ఫీడింగ్ యాక్షన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో నుంచి 273 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కె.నీలిమ తెలిపారు.

**బిడ్డకు కలిగే ప్రయోజనాలు ఇవీ..:** 'తల్లిపాలతో శిశువు మెదడు ఎదుగుదల బాగుంటుంది. ఎముకలు దృఢంగా మారుతాయి. వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్స్ రాకుండా కాపాడుతుంది. తల్లిపాలతో పోలిస్తే డబ్బాపాలు తాగే పిల్లలు విరోచనాలు , న్యూమోనియా బారిన పడే అవకాశాలు కనీసం ఐదురెట్లు ఎక్కువగా ఉంటాయి. శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే రెండేళ్లపాటు తల్లిపాలు ఇవ్వాల'ని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**నిల్వచేసి ఇవ్వవొచ్చు:** తల్లిపాలు నిల్వ చేసి బిడ్డకు ఆరు గుంటల తరువాత కూడా ఇవ్వవచ్చు. పాలు ఫ్రిజ్‌లో పెట్టి నిల్వ చేస్తే ముందుగా వేడి నీటిలో ఒక బౌల్‌లో తల్లిపాలు ఉంచి.. కాస్త వేడి అయిన తరువాత బిడ్డకు ఇవ్వాలి.

**రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్సుల్లో బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాలు:** ఉద్యోగాలు చేసే మహిళలు బిడ్డలకు తగిన స్థాయిలో పాలు ఇవ్వలేని పరిస్థితి. రెండు, మూడు నెలలు దాటక ముందే డబ్బాపాలు తాగించాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి ఇప్పటికే కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు బ్రెస్ట్ ఫీడింగ్ గదులు వంటివి ఏర్పాటు చేస్తున్నాయి. ద్వారకానగర్, మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్సులు, రైల్వేస్టేషన్‌లో ఈ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

**అనుబంధం పెరుగుతుంది..:** 'బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. కొంతమంది తల్లుల్లో పాలు తక్కువగా ఉంటాయి. అటువంటివారు ఆవు, గేదె పాలు తాగాలి. తెల్ల ఉల్లి, బీరకాయల్లో తల్లిపాలు పెంచే పోషకాలు ఉంటాయి. ఆహారంలో వాటిని అధికంగా తీసుకోవాలి'అని ఆరిలోవ ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.అనిత తెలిపారు.

## ఉపాధికి చోదక శక్తి!



చిత్తూరు : ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లే కీలక భూమిక పోషిస్తాయి. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో మొదటి దశలో చేపట్టే రెండు పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడ్డాయి. రెండో విడతలోని పార్కులకు త్వరగా భూమిని గుర్తిస్తే చకచకా పనులు మొదలవుతాయి.

చిత్తూరు జిల్లాలో తొలి విడతలో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లెలో 38.57 ఎకరాలు సేకరించారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, నీరు, విద్యుత్తు వంటి సదుపాయాలు సమకూర్చడానికి రూ.17.75 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పలమనేరు పురపాలిక నాగమంగళం సమీపంలో 3.28 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయం (ఎఫ్ఎఫ్‌సీ) నిర్మించనున్నారు. రూ.15.27 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. పనులు చేసేందుకు త్వరలోనే గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరిలో 1.04 ఎకరాలు ఉంది. ఇక్కడ కూడా ఎఫ్ఎఫ్‌సీ ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సదుపాయాలు కల్పిస్తారు. జీ ప్లస్ 2 విధానంలో గదులు అందుబాటులోకి తెచ్చి ఔత్సాహికులకు నిర్ణీత మొత్తానికి ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ అసెంబ్లింగ్, సర్వీసింగ్ వంటి యూనిట్లు నెలకొల్పుకోవచ్చు.

**జిల్లాలోనే కొంత సమస్య**

రెండో విడత ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు.. త్వరలో శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే చిత్తూరు జిల్లాలో భూసేకరణ చేస్తున్నారు. మిగతా ఐదు నియోజకవర్గాల్లో పెద్దగా సమస్యలు లేవు. గంగాధరనెల్లూరులో గతంలో లిడ్‌క్యాప్‌నకు కేటాయించిన 400 ఎకరాల్లో 90 ఎకరాలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పూతలపట్టుకు సంబంధించి పి.కొత్తకోట వద్ద 89 ఎకరాలు, చిత్తూరులో 5.వెంకటాపురం, నగరిలో మాంగాడు, పుంగనూరులో చదళ్ల వద్ద భూమిని గుర్తించారు. తిరుపతి జిల్లాలోనే కొంతవరకు సమస్య ఉంది. చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద ప్రాథమికంగా స్థలం ఇవ్వాలని భావిస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాళెం వద్ద భూమి ఉంది. తిరుపతి నగరంలో ఎఫ్ఎఫ్‌సీ నెలకొల్పాలన్నా స్థలం దొరకడం లేదు.

**త్వరలోనే రెండో విడతలోనూ..**

- సుమిత్‌కుమార్, కలెక్టర్

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. తొలి విడతలో గుర్తించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అభివృద్ధి చేసిన తర్వాత ధర నిర్ణయించి ఔత్సాహికులకు ప్లాట్లు కేటాయిస్తాం. రెండో విడతకు సంబంధించి భూసేకరణ వేగంగా చేయాలని ఆదేశించాం.

## పర్యాటకం.. కాగితాలకే పరిమితం

గుంతకల్లు : "గుత్తి దుర్గంతోపాటు కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం, బుగ్గసంగమేశ్వరాలయ ప్రాంతాలను పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చేస్తాం. ఇందుకు రూ.20 కోట్లు కేటాయించినట్లు 2017 ఏప్రిల్ 20న తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పామిడిలో జరిగిన బహిరంగ సభలో చెప్పారు. ఇందుకు సంబంధించి అధికారులు ప్రణాళికలు కూడా రూపొందించారు. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులను దారి మళ్లించింది. దాంతో పనులు పట్టాలెక్కలేదు. ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది



**చూశారు.. వెళ్లారు**

ఆరేళ్ల కిందట పర్యాటకశాఖ అధికారులు మూడు ప్రదేశాలను పరిశీలించారు. పర్యాటకులు గుత్తి కోటకు నడిచి వెళ్లడం కష్టమని, రోప్‌వే ఏర్పాటు చేస్తామని చెప్పారు. హెూటళ్లు, విశ్రాంతి గదులు, పార్కులు నిర్మిస్తామన్నారు. బుగ్గసంగాల గ్రామ సమీపంలోని సంగమేశ్వరాలయం వద్ద కూడా పర్యాటకుల కోసం విశ్రాంతి గదులు, హెూటళ్లు, అధునాతన స్నానాల గదులు, మరుగుదొడ్లను నిర్మిస్తామని తెలిపారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గుట్టను పరిశీలించి అక్కడ నిర్మాణాలు చేపడతామని అప్పట్లో ప్రకటించారు. ఇక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పర్యాటకులు ఆశపడ్డారు. ఆతరువాత అధికారులు రాకపోవడంతో ప్రణాళికలు కాగితాలకు పరిమితమయ్యాయి. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నిధులు కేటాయించాలని పర్యాటకులు కోరుతున్నారు.

## భళా.. సర్కారు కళాశాల

కర్నూలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో చేపట్టిన మార్పులు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అసౌకర్యాలు, అధ్యాపకుల కొరత వేధించేది. సరైన బోధన లేక పిల్లల్ని చేర్చేందుకు తల్లిదండ్రులు వెనకాడేవారు. పేదలు సైతం అప్పులు చేసి పిల్లల్ని ప్రైవేటు కళాశాలల్లో చేర్చేవారు. ఈ పరిస్థితిని మార్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో కంటే ఈ ఏడాది ప్రవేశాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

కర్నూలు జిల్లాలో 23, నంద్యాల జిల్లాలో 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఊహించిన దానికన్నా ఎక్కువమంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 2025- 26 విద్యా సంవత్సరానికి గాను జులై నెలాఖరు వరకు కర్నూలు జిల్లాలో 10,358, నంద్యాల జిల్లాలో 3,423 మంది విద్యార్థులు ఇంటర్‌లో చేరారు. అధ్యాపకులు గ్రామాలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు.



పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకెళ్లి తల్లిదండ్రులను కలిసి.. సర్కారు కళాశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించిందని, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధిస్తామని, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా, పోటీ పరీక్షల్లో రాణించేలా సన్నద్ధం చేస్తామని చెప్పి ఒప్పించి పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్చుకున్నారు. ప్రభుత్వ సంస్కరణలకు తోడు తమ ప్రచారం ఫలించడంతోనే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

**ఫలించిన పథకాలు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం అందించేందుకు డొక్కా సీతమ్మ పథకాన్ని అమలు చేస్తోంది. కళాశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసింది. ఇంటర్ విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకం వర్తింపచేసింది. ఇంటర్ విద్య తర్వాత వైద్య విద్య, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో రాణించేందుకు ఇంటర్ పాఠ్యాంశాలతో పాటు నీట్, జేఈఈకి సంబంధించిన పుస్తకాలు కూడా సరఫరా చేసింది. ఇది ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు దోహదపడ్డాయి.

## నది నిండింది.. ఇసుక నిండుకుంది

కర్నూలు : శ్రావణమాసంలో మంచి రోజులని.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చాలామంది ముందుకొస్తున్నారు. భవన నిర్మాణ ఊపందుకుంటున్న తరుణంలో ఇసుక కొరత వేధిస్తోంది. తుంగభద్ర ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఓపెన్ ఇసుక రీచ్‌లు మునిగిపోయాయి. డీసిల్టింగ్ పాయింట్లలో ఇసుక తవ్వకాలు ఆగిపో యాయి. జిల్లాలో గత వారం రోజులుగా తవ్వకాలు నిలిచిపోయాయి. జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో విఫలమవడం తో కొరత ఏర్పడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయం లో దళారులు అనుమతిలేని ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగిస్తూ.. మొత్తానికి ఇసుక విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**ఒక్క ట్రాక్టర్ కూడా లేదు**

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా గనుల శాఖ అధికారులు గత వేసవిలో సి.బెళగల్ మండలంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉంచుకోవాల్సి ఉండగా.. 2.20 లక్షల టన్నులే పెట్టారు. ఇందులో జూన్, జులై మాసాల్లో నంద్యాల జిల్లాకు 80 వేలు, అనంతపురం జిల్లాకు 10 వేల టన్నులు సరఫరా చేశారు. జిల్లాలోని పత్తికొండ, గార్గేయపురం తదితర ప్రాంతాల్లో హంద్రినీవా కాలువ లైనింగ్ పనులతో పాటు జిల్లా అవసరాలకు కలిపి 1.30 లక్షల టన్నుల వినియోగం జరిగింది. దీంతో ప్రస్తుతం ఇసుక నిల్వలు నిండుకున్నాయి. ఒక ట్రాక్టర్ ఇసుక కూడా లేదు. సి.బెళగల్ మండలంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో 2.30 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులున్నాయి. తుంగభద్రకు వరద తగ్గితేగాని ఇక్కడ తవ్వకాలు చేపట్టలేని పరిస్థితి.

చురకలు



## మాల్దీవ్స్ అందాలు.. కాజల్ సోయగాలు.. పిక్స్ చూశారా?

సీనియర్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గురించి అందరికీ తెలిసిందే. తన యాక్టింగ్ తో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అమ్మడు.. స్పెషల్ ఫ్యాన్ బేస్ కూడా క్రియేట్ చేసుకున్నారు. లక్ష్మీ కళ్యాణం మూవీతో ఇండస్ట్రీలోకి వచ్చిన బ్యూటీ.. తన అందం, అభినయంతో తెలుగు ఆడియన్స్ మనసులో నిలిచిపోయారు. చందమామ మూవీతో టాలీవుడ్ చందమామగా మారారు. ఆ తర్వాత దాదాపు అందరి స్టార్ హీరోలతో ఆడిపాడిన అమ్మడు.. స్టార్ హీరోయిన్ గా మారిపోయిందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. బాక్సాఫీస్ వద్ద అనేక హిట్స్ కూడా అందుకున్న కాజల్.. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు ప్రేమలో పడి ప్రియుడిని పెళ్లి చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. 2020లో గౌతమ్ కిచ్లాను వివాహం చేసుకున్న కాజల్ అగర్వాల్.. 2022లో కుమారుడు నీల్ కిచ్లూకు జన్మనిచ్చారు. అయితే




పెళ్లి అయ్యాక కొన్ని సినిమాల్లో కనిపించిన బ్యూటీ.. బాబు పుట్టాక తర్వాత పూర్తిగా సినిమాలకు దూరమైంది. కాస్త గ్యాప్ ఇచ్చి లేడీ ఓరియెంటెడ్ మూవీ సత్యభామలో నటించారు. కానీ అనుకున్న స్థాయిలో హిట్ అందుకోని కాజల్.. ఆ తర్వాత మంచు విష్ణు భక్త కన్నప్ప మూవీలో పార్వతీ దేవిగా కనిపించారు. ఇప్పుడు బాలీవుడ్ లో ఓ సినిమా చేస్తున్నారు. అయితే ఓ వైపు సినిమాలు.. మరోవైపు ఫ్యామిలీ లైఫ్ ను లీడ్ చేస్తున్న కాజల్.. సోషల్ మీడియాలో తన అభిమానులతో ఎప్పుడూ దగ్గరగా ఉంటారు. ఎప్పటికప్పుడు ఫ్యామిలీతో వెకేషన్స్ కు వెళ్లే టాలీవుడ్ చందమామ రీసెంట్ గా మాల్దీవ్స్ వెళ్లారు. ఇప్పుడు ఆ పిక్స్ ను షేర్ చేయగా.. ప్రస్తుతం అవి ఫుల్ వైరల్ అవుతున్నాయి. “మాల్దీవ్స్.. నేను హ్యాపీగా మంత్లీ మీటింగ్. అంతులేని ఆకర్షణ, శాశ్వతమైన కాంతి, ప్రకృతి అత్యంత ఆకర్షణీయమైన రన్‌వేలా అనిపించే సూర్యాస్తమయాలతో ప్రతిసారీ ఆకర్షించింది” అంటూ రాసుకొచ్చారు అయితే పిక్స్ లో కాజల్ వేరే లెవెల్ లో ఉన్నారు. ఎల్లో, బ్లూ, వైట్ కలర్ స్విమ్ సూట్స్ లో దిగిన ఫోటోస్ పోస్ట్ చేయగా.. ఒక్కొక్కటి ఓ రేంజ్ లో ఉంది. ఆమె పోజులు, లుక్స్ అదిరిపోయాయి. తన సోయగాలకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే అన్నట్లు ఉన్నాయి చిత్రాలు. కొడుకుతో నడుస్తున్న పిక్ క్యూట్ గా ఉండగా.. భర్తతో ఐకానిక్ పోజ్ ఇచ్చారు అమ్మడు. మొత్తానికి 40 ఏళ్ల వయసులో కాజల్ హీట్ పుట్టిస్తున్నారని చెప్పాలి. మరి ఆమె పిక్స్ ను చేశారా?

## అజ్ఞాతం అనంతరం గంభీర రంగంలోకా!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య ఓజీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాపై మంచి హైప్ తీసుకొచ్చాయి. ఈ సినిమాతో పవన్ సాలిడ్ కంబ్యా క్ ఇస్తాడని అంచనాలు భారీగా ఉన్నాయి. గత పరాజయాలన్నింటికీ ఓజీ ఫలితంతో సమాధానం చెబు తారని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓజీ కంటెంట్ పై చర్చా మొదలైంది.

**ఓజాస్ గంభీర ఎలా:** సినిమాలో పవన్ ఓజాస్ గంభీర పాత్రలో కనిపించనున్నాడు. ఆరోల్ ఎలివేషన్ ఎలా ఉంటుంది? అన్నది డైరెక్టర్ ని బట్టి అంచనా వేయొచ్చు. ఈ విషయంలో సుజిత్ ఎక్కడా కాంప్రమైజ్



కాడు. యాక్షన్ ఫిలిం మేకర్ గా తన సత్తా ఏంటో సాహోతోనే ప్రూవ్ చేసాడు. అందులో ప్రభాస్ పాత్రను హైలైట్ చేయడం ఆద్యంతం అలరించింది. సాహో తెలుగులో అనుకున్న ఫలితాలు సాధించినప్పటికీ హిందీ కి బాగా కనెక్ట్ అయింది. ఈ రకమైన సానుకూల ఫలితం తో ఓజాస్ గంభీర ఎలా ఉంటాడో? అభిమానుల ఊహకే వదిలేయాలి.

**అజ్ఞాతం వీడిన అనంతరం:** ఈ నేపథ్యంలో తాజాగా సినిమా స్టోరీ లీకైంది. ఓజాస్ గంభీర మాఫియా సామ్రాజ్యం నుంచి ఒక్కసారిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. ఈక్రమంలో ఓమీ బావు ఇమ్రాన్ హాష్మీ తన చీటకి సామ్రాజ్యాన్ని మరింత విస్తరి స్తాడు. బలమైన మాఫియా కింగ్ లా మారుతాడు. దీంతో విషయం తెలిసిన ఓజాస్ గంభీర దాదాపు పదేళ్ల అజ్ఞానం వీడి తిరిగి మళ్లీ ఆ చీకటి సామ్రాజ్యంలోకి అడుగు పెడతాడు. అటుపై ఓజాస్ గంభీర– ఓమీ బావు మధ్య యుద్ధం ఎలా మొదలైంది? అందుకు దారి తీసిన కారణాలు ఏంటి? ఓజాస్ గతం ఏంటి? అన్నది ఆసక్తికరంగా మలిచినట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది.

**అభిమానుల ఆశలన్నీ అతడిపైనే:** మరి ఈ లీక్డ్ స్టోరీలో నిజమెంతో తెలియాలి. కొన్ని సినిమాలకు పాయింట్ పాతదే అయినా దాన్ని ట్రీట్ చేసే విధానం సినిమా విజయాన్ని నిర్ణయిస్తుంది. మరికొన్ని సినిమాలకు పాయింట్ కొత్తదైనా? ట్రీట్ మెంట్ కారణంగా ఫెయిల్ అవుతుంటాయి. సుజిత్ గత సినిమా అనుభవాల నేపథ్యంలో అతడి అభి మానులు చాలా ఆశలు పెట్టుకున్నారు. సినిమాలో సరికొత్త గ్యాంగ్ స్టర్ ని ఆవిష్కరిస్తాడని ఆశిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 25న రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే.




## ఇలాంటి ఘోరాన్ని ఇంతకుముందెప్పుడూ చూసి ఉండరు!



నిజమైన స్వచ్ఛమైన ప్రేమ ఏం కోరుకుంటుంది? రక్త తర్పణం చేయమని కోరుతుందా? కత్తులు గొడ్డళ్లతో నరుక్కోమని సూచిస్తుందా? ప్రేమ కథలో ఎంతటి ఘోరమైన విలన్లు ఉన్నా కానీ, మరీ ఈ రేంజులో నిలువునా చీరేసే, ఒంటి నిండా గుచ్చుకున్న చువ్వలతో రక్త మాంసాలు బయటపడటం, తలలు గాల్లో ఎగిరిపడటం..లాంటి భయానక భీభత్స వాతావరణం సృష్టించడం.. దీనిని ప్రేమకథ అని అంటారా? టైగర్ ష్రాఫ్– సంజయ్ దత్‌ల భాఘి 4 ట్రైలర్ వీక్షించాక కలిగిన సందేహాలివి. మా సినిమా ఆర్–రేటెడ్ అని మేకర్స్ అధికారికంగా బాహాటంగా ప్రకటించి మరీ తెర నిండా రక్తతర్పణం చేయడం షాకిస్తోంది. నిజానికి ఇలాంటి సినిమాలు చూసే వర్గాన్ని సైకోలు, శాడిజం జాతికి చెందిన వారు అంటారో లేదా ఇంకేదైనా భయానకమైన పేరుతో పిలుస్తారో! ఎంత గొప్ప యాక్షన్ సినిమాల ప్రియులైనా కానీ, మరీ ఇంత ఘోరమైన తీవ్రమైన ఘాతుకాలను కళ్లారా చూడటం చాలా కష్టమైన విద్య. చంపుకోవడం, నరుక్కోవడం, చీల్చుకోవడం వంటి దుర్మార్గాలను తెరపై చూడాలని అనుకోరు. వీటన్నిటినీ మించి చాలా రొటీన్ గా సంజయ్ దత్ పాత్రను మరో అబ్రార్ (యానిమల్) లా చూపించడం ఆశ్చర్యపరుస్తోంది. ఇందులో నటించిన అందాల భామలు రక్త పిశాచాల్లా స్టంట్స్ చేయడం కూడా షాకిస్తుంది. మ్యాట్రిక్స్ ఫ్రాంఛైజీ, అవతార్, అవెంజెర్స్ ఫ్రాంఛైజీల్లో కూడా ఇలాంటి భయానకమైన విజువల్స్ ని చూపించలేదు. నిజం చెప్పాలంటే యానిమల్ సినిమాలో కూడా మరీ అంత దారుణంగా చూపించలేదు. కిల్ లేదా మార్కో సినిమాల్లో క్రూరత్వం, హింస, రక్తపాతం మరో లెవల్ అని భావించిన వారికి భాఘి 4 చూశాక, అది చాలా తక్కువ అనే భావన కలగడం సహజమే అవుతుందేమో! ఇంతటి ఘోరమైన విజువల్స్ మునుపెన్నడూ చూసి ఉండరు. ఇప్పటికీ ఫ్యామిలీ ఆడియెన్ సెన్సిబిలిటీ మనుషుల్లో చచ్చిపోలేదు. బంధాలు అనుబంధాలు సెంటిమెంట్లు ఇంకా భారతీయుల్లో చావలేదు. అయినా అవేవీ లేని మృగాలను తెరపై చూపించాలనే ప్రయత్నం ఏ.హర్షకు న్యాయమైనదేనా? కాబట్టి ఇప్పుడు థియేటర్లలోకి రాబోతున్న భాఘి 4 ఏ వర్గంలో అయినా ఆసక్తిని రేకెత్తించిందా? అన్నది సస్పెన్స్ గా ఉంది. ఈ చిత్రానికి కన్నడిగ నిమ్మ హర్ష ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. సాజిద్ నడియాడ్ వాలా నిర్మాత. సెప్టెంబర్ మొదటివారంలో రిలీజ్ కి వస్తున్న ఈ సినిమా ట్రైలర్ చూశాక థియేటర్ కి వెళ్లే సాహసం ఎవరు చేస్తారో చూడాలి.

## తెలిసి తప్పు చేస్తున్న బన్నీ.. ఫ్యాన్స్ ఫైర్!



అల్లు అర్జున్ ప్రస్తుతం కోలీవుడ్ డైరెక్టర్ అట్లీతో AA22xA6 అనే వర్కింగ్ టైటిల్ తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ముంబైలో ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం ఈ కాంబోలో రాబోయే సినిమాపై ఇండస్ట్రీలో భారీ హైప్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే తాజాగా అల్లు అర్జున్ – అట్లీ కాంబోలో రాబోతున్న సినిమా గురించి ఒక షాకింగ్ వార్త వినిపిస్తోంది. ఇది చూసిన చాలామంది అభిమానులు అల్లు అర్జున్ పై ఫైర్ అవుతున్నారు. తెలిసి తప్పు చేస్తుంటే మండిపడుతున్నారు పైగా ఆ మ్యూజిక్ డైరెక్టర్ వద్దే వద్దు అంటూ అల్లు అర్జున్ ని వేడుకుంటున్నారు. మరి ఇంతకీ అట్లీ – బన్నీ కాంబోలో రాబోతున్న సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎవరు చేయబోతున్నారు అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. అల్లు అర్జున్ – అట్లీ కాంబినేషన్ లో రాబోతున్న సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గా సాయి అభ్యంకర్ పేరు ఖరారు అయినట్టు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే సాయి అభ్యంకర్ పేరుని అఫీషియల్ చేయకపోయినప్పటికీ కొన్ని నివేదికలు మాత్రం ఈయన పేరు వైరల్ చేస్తున్నాయి. ఇక ఈ విషయం బయట పడడంతోనే చాలామంది అల్లు అర్జున్ అభిమానులు సాయి అభ్యంకర్ వద్దే వద్దు అంటూ పోస్టులు పెడుతున్నారు.

ఎందుకంటే సాయి అభ్యంకర్ అంత ఫేమస్ అయిన మ్యూజిక్ డైరెక్టర్ కాదు..ఒకవేళ అంతగా తమిళ వారిని మ్యూజిక్ డైరెక్టర్ గా పెట్టుకోవాలనిపిస్తే ఆ అవకాశం అనిరుధ్ కి ఇవ్వండి..అంతేగాని ఇలా పేరు ఊరు లేని మ్యూజిక్ డైరెక్టర్లను పెట్టుకొని పెద్ద సినిమా పరువు తీస్తే ఎలా అని మాట్లాడుకుంటున్నారు. సాయి అభ్యంకర్ చిన్న చిన్న హీరోల సినిమాలకి మ్యూజిక్ ఇవ్వడానికి పనికి వస్తారు. కానీ అల్లు అర్జున్ అట్లీ కాంబోలో రాబోతున్న ఈ అతిపెద్ద సినిమాకి ఆయన మ్యూజిక్ సరిపోదని.. పైగా అల్లు అర్జున్ సినిమాపై అభిమానులకి ఎన్నో అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టు ప్రతి ఒక్కటి ఉండాలి. ఇందులో మ్యూజిక్ బాగుండకపోతే సినిమాకి పెద్ద దెబ్బ పడుతుంది అంటూ కామెంట్లు చేస్తున్నారు.అయితే సాయి అభ్యంకర్ ఇప్పటికే పలు సినిమాలు చేసినప్పటికీ అంత పేరైతే రాలేదు. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్ హీరోగా చేస్తున్న డ్యూడ్ అనే తమిళ మూవీకి మ్యూజిక్ డైరెక్టర్ గా చేస్తున్నారు. ఈ సినిమా నుండి రీసెంట్గా ఊరం బ్లడ్ అనే పాట రిలీజ్ అయింది. అయితే ఈ పాట శ్రోతలను అంతగా ఆకట్టుకోలేదు.అంతేకాదు ఈ పాట ట్రాక్ లో రెగ్యులర్ ట్యూన్ లేకుండా సౌండ్ ట్రాక్ మాత్రమే ఉందని అంటున్నారు. అయితే ఇలాంటి మ్యూజిక్ చిన్న సినిమాలకు చిన్న హీరోలకు చేస్తే పనికి వస్తుంది కానీ అల్లు అర్జున్ లాంటి పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న హీరో సినిమాకు చేస్తే పనికి రాదని,సాయి అభ్యంకర్ ఇచ్చే మ్యూజిక్.. అల్లు అర్జున్ మాస్ అభిమానులకు కనెక్ట్ కాకపోవచ్చని కొంతమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎవరు ఎన్ని చెప్పినా కూడా అట్లీ, అల్లు అర్జున్ ఇద్దరూ సాయి అభ్యంకర్ ని తమ సినిమాకి తీసుకోవాలనే ఆసక్తితోనే ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇదే చివరి నిర్ణయం కాకపోవడంతో చాలామంది అభిమానులు సోషల్ మీడియా వేదికగా అల్లు అర్జున్ ని రిక్వెస్ట్ చేస్తున్నారు.మీ సినిమాకి పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ ని తీసుకోండి అంటూ పోస్టులు పెడుతున్నారు. మరి చూడాలి అల్లు అర్జున్ అట్లీ కాంబోలో రాబోయే సినిమాకి సాయి అభ్యంకర్ నే మ్యూజిక్ డైరెక్టర్ గా ఫిక్స్ చేస్తారా లేక మరెవరినైనా ఎంచుకుంటారా అనేది ముందు ముందు తెలుస్తుంది.

## మీనాక్షి జోరు జీరోకి దగ్గరలో!

టాలీవుడ్ కి ఉవ్వెత్తున దూసుకొచ్చింది మీనాక్షి చౌదరి. తొలి సినిమా %–%ఇచట వాహనములు నిలుపరాదు%–%తో డీసెంట్ హిట్ అందుకుంది. ఆ సినిమా రిలీజ్ కు ముందే అమ్మడిలో ప్రతిభను గుర్తించిన గురూజీ త్రివిక్రమ్ సక్సెస్ అవుతుందని ముందే జోస్యం చెప్పారు. ఆయన అన్నట్లుగానే సక్సెస్ అయింది. వరుస అవకాశాలతో బిజీ నటిగా మారింది.గుంటూరు కారంలో సెకెండ్ లీడ్ ఛాన్స్ ఇచ్చి గురూజీ సైతం ప్రోత్స హించారు. అంతకుముందే హిట్ ది సెకెండ్ కేస్ తో మరోహిట్ ఖాతాలో వేసుకుంది. అదే సమయంలో కోలీవుడ్ లో కోలై చిత్రంతో లాంచ్ అయింది. అక్కడా అనుకున్నట్లుగా అవకాశాలు బాగానే వరించాయి. ఆరంభంలో దళపతి విజయ్ సరసన ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో ఛాన్స్ అందు కుంది. మొత్తంగా గత ఏడాది ఆరు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలోనే ఉంది. కానీ వాటిలో విజయాలెన్ని అంటే? ఒకటి రెండే కనిపిస్తున్నాయి. మరి ఈ వైఫల్యాలు మీనాక్షి జోరుకు బ్రేక్ లు వేసాయా? ఆజోరు




జీరోకి కూడా పడిపోయే అవకాశం ఉందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం తో బ్లాక్ బస్టర్ అందు కుంది. అదీ సెకెండ్ లీడ్ లోనే. సినిమా పెద్ద విజయం సాధించినా? చేతిలో కొత్త సినిమాలైతే ఏవీ కనిపించలేదు. ప్రస్తుతం అనగనగా ఒక రోజు అనే సినిమా చేస్తోంది. ఈ సినిమా ప్రారంభమైన దగ్గర నుంచి మళ్లీ ఎలాంటి అప్ డేట్ లేదు. ఇది మీనాక్షి కెరీర్ లో ఏమాత్రం ఊహించనది. అమ్మడు స్పీడ్ కు స్టార్ లీగ్ లో చేరడం పెద్ద పనిగా కనిపించలేదు. సక్సెస్ తో వచ్చిన గుర్తింపు..పెర్ఫార్మర్ కావడంతో? ఆ ట్యాలెంట్ తో స్టార్ లీగ్ ఈజీ అనుకున్నా? చేతిలో ఛాన్సులు లేకపోవడం అన్నది వెనక్కి లాగుతోంది. మరి అమ్మడు ఈ దశను ఎలా దాటుంతుందో చూడాలి. ప్రస్తుతం నాయికల మధ్య పోటీ ఎలా ఉంది? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ట్యాలెంట్ తో పాటు అదృష్టం కూడా ఉంటేనే అవకాశాలు వస్తున్నాయి. పైగా మీనాక్షి చౌదరి కొన్ని పరిమితులతోనే నటిగా కొనసాగుతోంది. గ్లామర్ పాత్రలకు తొలి నుంచి దూరంగానే ఉంది. ఆ కారణంగానూ కొన్ని అవకాశాలు కోల్పోయింది. మరి ఇప్పుడు ఛాన్సులు లేని వేళ సడలింపు ఇస్తుందా? ఇచ్చినా ఇండస్ట్రీ కొత్త చాన్సులు కల్పిస్తుందా? అన్నది వేచి చూడాలి.

## రాజా సాబ్ ఆ టార్గెట్ అందుకుంటాడా..?

రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి కాంబినేషన్ లో వస్తున్న రాజా సాబ్ చిన్నగా 2026 సంక్రాంతి రేసుకి కన్ఫర్మ్ అయ్యింది. అసలైతే ఈ ఇయర్ సమ్మర్ అదే ఏప్రిల్ లోనే రావాల్సిన ఈ సినిమా దసరాకి వస్తుందని అనుకున్నారు. ఫైనల్ గా డిసెంబర్ 5కి రిలీజ్ లాక్ చేశారు. ఇప్పుడు ఆ డేట్ ని కూడా పుష్ చేస్తూ జనవరి 9, 2026 రిలీజ్ అంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినిమాల రిలీజ్ విషయంలో ఈ కన్ ఫ్యూజన్ కొనసాగుతూనే ఉంది. ఐతే పెద్ద టార్గెట్ పెట్టుకున్నారు కాబట్టి సరైన టైం రిలీజ్ చేస్తే బెటర్ అనే ప్లాన్ కనిపిస్తుంది.

**థ్రిల్లర్ జోనర్ లో రాజా సాబ్..** రాజా సాబ్ సినిమా థ్రిల్లర్ జోనర్ లో సంథింగ్ స్పెషల్ మూవీగా వస్తుంది. ఐతే ఈ సినిమా టార్గెట్ మాత్రం చాలా పెద్దగానే ఉందని టాక్. ప్రభాస్ సినిమా మరోసారి 1000 కోట్ల టార్గెట్ పెట్టుకుందని తెలుస్తుంది. మారుతి డైరెక్షన్ లో



వస్తున్న ఈ థ్రిల్లర్ సినిమాలో కామెడీ, ఎంటర్టైన్మెంట్ తో పాటు గూస్ బంప్స్ సీన్స్ కూడా ఉంటాయని తెలుస్తుంది. అందుకే ఈ సినిమాను కచ్చితంగా ప్రేఖకుల అంచనాలను అందుకుంటుందని అంటున్నారు. రాజా సాబ్ సినిమాతో మరోసారి ప్రభాస్ బాక్సాఫీస్ స్టామినా ప్రూవ్ చేయాలని అనుకుంటున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్నారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ పరంగా కూడా నెక్స్ట్ లెవెల్ అనేలా ఉంటుందట. ఇక మరోపక్క ప్రభాస్ కూడా తన మాస్ స్టామినా ఏంటన్నది చూపించాలని చూస్తున్నాడు.

**ఈగర్ గా నార్త్ సైడ్ రెబల్ ఫ్యాన్స్..** ప్రభాస్ రాజా సాబ్ థ్రిల్లర్ జోనర్ లో వచ్చే ఒక కమర్షియల్ ఎంటర్టైనర్. సినిమా నుంచి వచ్చిన టీజర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నార్త్ సైడ్ ఉన్న రెబల్ స్టార్ ఫ్యాన్స్ అయితే ప్రభాస్ రాజా సాబ్ కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ కి మరో 1000 కోట్ల కలెక్షన్స్ ఇవ్వాలని చూస్తున్నారు. ప్రభాస్ కూడా ఈ సినిమాపై సూపర్ కాన్ ఫిడెంట్ గా ఉన్నట్టు తెలుస్తుంది. బాహుబలి 2 తో 1000 కోట్లు కలెక్ట్ చేసిన ప్రభాస్ లాస్ట్ ఇయర్ వచ్చిన కల్కి 2898 ఏడితో మళ్లీ 1000 కోట్లు కలెక్షన్స్ కొల్లగొట్టాడు. మరి రాజా సాబ్ తో హ్యాట్రిక్ 1000 కోట్లు కొడతాడా లేదా అన్నది చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536